## ఇండిగో విమానానికి
# బాంబు బెదిరింపు
### ముంబైకి దారిమళ్లించిన పైలట్




**హైదరాబాద్, నవంబర్ 1 (నినాదం):** ఇండిగో విమానాలకు తరచుగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇండిగో విమానంలో బాంబులు ఉన్నట్లు బెదిరింపు మెయిల్స్ రావడం.. ఆ తరువాత అదంతా ఫేక్ అని తేలడం జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లుగా వచ్చిన మెయిల్ ఆందోళన కలిగిస్తోంది.

2


# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 2 నవంబర్ 2025 | సంపుటి: 22 | సంచిక: 41 | వెల: రూ.7 | పేజీలు: 12+24

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal
Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




# వైసీపీ ఓ పెద్ద ఫేక్ పార్టీ
### వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా
### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో చంద్రబాబు

**సత్యసాయి, నవంబర్ 1 (నినాదం):** వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీకి ఏమీ దొరకటం లేదని.. వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా చేశారు. శనివారం సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డిని గొడ్డలితో చంపి తనపై నెట్టేశారని ఫైర్ అయ్యారు సీఎం చంద్రబాబు. సాక్షిలో గుండెపోటు అని వస్తే తానూ నమ్మేశానని.. తానెప్పుడూ రాగద్వేషాలతో పనిచేయనని స్పష్టం చేశారు. ఓ సర్కిల్ ఇనస్పెక్టర్‌ని దగ్గర పెట్టుకుని రక్తం పడిన గదిని కడిగేశారని...

..మిగతా 2లో

శ్రీకాకుళం జిల్లా

# కాశీబుగ్గలో ఘోరం
### స్థానిక వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట
### ఏకాదశితో భారీగా తరలివచ్చిన భక్తులు
### 9మంది మృతి.. పలువురికి గాయాలు
### క్షతగాత్రలను ఆస్పత్రికి తరలించి చికిత్స
### ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
### కాశీబుగ్గకు చేరుకున్న మంత్రి అచ్చన్నాయుడు






**శ్రీకాకుళం, నవంబర్ 1 (నినాదం):** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతుంది. పోలీసులు సంఘటన జరిగిన ఆలయానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈరోజు కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయివడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి

..మిగతా 2లో

## ముందస్తు ప్రణాళికతో ఆస్తి, ప్రాణనష్టం నివారించాం
### ఉత్తమ సేవలు అందించిన వారిని అభినందించిన చంద్రబాబు



**అమరావతి, నవంబర్ 1 (నినాదం):** మొంథా తుపాను కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చేశామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. మొంథా తుపానులో ఉత్తమ సేవలందించిన వారి కోసం సీఎం క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పలువురిని గౌరవిస్తూ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'తుపానుపై సమాచారాన్ని ముందుగానే ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించాం. పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని డ్రోన్ ద్వారా గుర్తించి కాపాడాం. ప్రార్థనా మందిరం చుట్టూ వరద నీరు వస్తే 15 మందిని కాపాడాం. వరద నీటిని తొలగించే పనులు వేగంగా

..మిగతా 2లో

## కృత్రిమ మేధ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు



### మానవమేధస్సుకు అది సరితూగేది కానేకాదు
### సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రచారం తగదు
### రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న న్యాయమూర్తులు
### అమరావతి రాజధాని రైతుల పోరాటం అద్వితీయం
### విట్ స్నాతకోత్సవంలో విశ్రాంత జస్టిస్ ఎన్వి రమణ

2




## దేశ బలోపేతానికి యువతదే బాధ్యత
### వేమన వర్సిటీ విద్యార్థులతో వెంకయ్యనాయుడు

**కడప, నవంబర్ 1 (నినాదం):** నేటి యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూనివర్సిటీ విద్యార్థులతో ముచ్చటించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దేశం బలోపేతం కావాలంటే, యువత తమలో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవడం అత్యవసరమని చెప్పారు. మన మహనీయులు, ముఖ్యంగా నవభారత నిర్మాత సర్దార్ పటేల్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత తమ వ్యక్తిత్వాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి, యోగి వేమన బోధనలు మార్గదర్శకాలని పేర్కొన్నారు. సరళమైన పదాలతో పద్యాల ద్వారా ఆయన బోధించిన జీవిత సత్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తి త్వం

..మిగతా 2లో



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి
### కెనడా, ఫ్రాన్స్ ప్రతినిధులకు సీఎం వినతి

**హైదరాబాద్, నవంబర్ 1 (నినాదం):** తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కెనడా ప్రతినిధులని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్,

..మిగతా 2లో

## ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు
### 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ
### ఉత్సవాల నిర్వహణకు మంత్రులతో కమిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు



2



## కిషన్ రెడ్డికి క్రికెట్ అంటే తెలుసా?
### దేశానికి గౌరవం తెచ్చిన ఘనత నాది
### నిజాలు తెలుసుకోకుండా విమర్శలా: అజారుద్దీన్

**హైదరాబాద్, నవంబర్ 1 (నినాదం):** కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసని మంత్రి అజారుద్దీన్ ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి బ్యాట్ పట్టుకోవడం కూడా రాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తనను విమర్శించే వాళ్లకి సమాధానం చెప్పి తన స్థాయి తగ్గించుకోలేనని

..మిగతా 2లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తోక కట్ చేయడం ఖాయం
### అహనా పెళ్లంట తరహాలో రేవంత్ పాలన
### ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిన నేతలు
### మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, నవంబర్ 1 (నినాదం):** అహానా పెళ్లంట సినిమా తరహాలో రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని.. కోడిని వేలాడదీసి పచ్చడి మెతుకులు పెడతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చిందే ప్రజలు అని.. అది మర్చిపోయి రాజులా ఫీలవుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ తోక కత్తరించేందుకు రెడీగా ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. తెలంగాణ టీడీపీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ నాయుడు.. ఆయన సతీమణి, టీడీపీ నాయకురాలు సుజాతతో పాటు పలువురు నేతలు శనివారం నాడు గులాబీ పార్టీలో చేరారు. పెద్దఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు కేటీఆర్. వేసిన నామినేషన్ విత్‌డ్రా చేసుకొని మరీ

..మిగతా 2లో

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మొదటి పేజీ తరువాయి...



ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులెట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మోద్ మిక్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

మొదటి పేజీ తరువాయి...

శనివారం జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో సెక్యూరిటీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన విమానాన్ని ముంబాయి ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. బాంబు బెదిరింపు మెయిల్‌పై పోలీసులకు సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత నెలలో కూడా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దుబాయ్ నుంచి మంగళూరు బయలుదేరిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు ఉన్న సందేశాలను ప్రయాణికులు గుర్తించి.. సిబ్బందికి తెలియజేశారు. వెంటనే అలర్ట్ అయిన విమానాశ్రయ సిబ్బంది.. విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని.. అందంతా ఫేక్ అని నిర్ధారణ కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా.. ఇండిగో విమానాలకు పదే పదే ఇలాంటి బెదిరింపులు రావడంపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు భావిస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తున్న ఆకతాయిలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ఇలాంటి సందేశాలతో భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం

మొదటి పేజీ తరువాయి...

భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాల్కెన వారికి సత్వర చికిత్స అందించా లని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించా ల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్వీట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో



తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాల్కెన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాల్కెన వారికి మేల్కెన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాననని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్‌పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

## తొక్కిసలాట ఘటనపై పవన్ దిగ్భ్రాంతి

### క్షతగాత్రుకలు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



**అమరావతి, నవంబర్ 1 (నినాదం):** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం దగ్గర చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. కార్తీక మాసంలోని ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న క్రమంలో తొక్కిసలాట జరగడంతో తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను.. ఈ విషాదకర ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశాం.. సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశర చేసింది.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చారు.

## కూటమి ప్రభుత్వ వైఫల్యంగా జగన్ విమర్శలు



**అమరావతి, నవంబర్ 1 (నినాదం):** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ దుర్ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విచారకరం.. మీడియాలో సమాచారం మేరకు 10 మంది వరకు మరణించారని తెలుస్తోంది.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలి.. సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని మా పార్టీకి చెందిన నాయకులను ఆదేశించాను.. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించారు.. అలాగే, సింహాచలంలో జరిగిన దుర్ఘటనలో మరో ఏడుగురు మరణించారు.. ఇప్పుడు కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట కారణంగా ఇప్పటి వరకూ 10 మంది మరణించారని మీడియా ద్వారా సమాచారం వస్తోంది అని జగన్ అన్నారు. ఇక, ఈ 18 నెలల కాలంలో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నది అర్థం అవుతోంది అని మాజీ సీఎం జగన్ పేర్కొన్నారు. పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ భక్తుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు.. చంద్రబాబు అసమర్థ పాలనకు నిదర్శనం ఇది అని విమర్శించారు. ఇకనైనా కళ్లుతెరిచి తప్పులను సరిదిద్దుకోవాలని తెలిపారు.



## ముందస్తు ప్రణాళికతో ఆస్తి, ప్రాణనష్టం నివారించాం

మొదటి పేజీ తరువాయి...

జరిగాయి. సాంకేతికతతో పాటు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సహకరించారు. రాష్ట్రానికి రెండు సమస్యలు.. రాయలసీమ కరవు, కోస్తాంధ్రకు తుపాన్లు. సమర్థ నీటి నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణంతో రాయలసీమలో కరవు లేకుండా చేశాం. ఈసారి మొంథా తుపానుపై అధికారులతో బృందం సిద్ధం చేశాం. వారికి సాంకేతిక సపోర్టు ఇచ్చాం. అద్భుతంగా పనిచేశారు. పరిస్థితిని సమీక్షించి రియల్ టైమ్‌లోనే హెచ్చరికలు పంపాం. వర్ష ప్రభావం, గాలుల తీవ్రతను టెక్నాలజీతో పర్యవేక్షించాం. ముందస్తు జాగ్రత్తలు, హెచ్చరికలు పంపి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూశాం' అని తెలిపారు.

## దేశ బలోపేతానికి యువతదే బాధ్యత

మొదటి పేజీ తరువాయి...

రూపుదిద్దుకుంటుందని దిశానిర్దేశర చేశారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాగా ఇవాళ ఆయన కడపకు చేరుకున్నారు. ఆర్అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ జేసీ అదితి సింగ్, అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు.

# కృత్రిమ మేథ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

**అమరావతి,నవంబర్ 1 (నినాదం):** కృత్రిమ మేధ వంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న విద్వేషపూరిత ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో న్యాయమూర్తులు ఒత్తిళ్లు, వేధింపులు ఎదుర్కొన్నారని... కొందరు బదిలీ అయ్యారని, సంబంధం లేకపోయినా రాజకీయ కుట్రలకు బలయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. బాధ్యతగా పని చేయటం కూడా కొన్నిసార్లు వ్యక్తిగతమైన బాధగా మిగిలిపోతుందన్నారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేసిన రైతులకు న్యాయం చేసే క్రమంలో న్యాయమూర్తులు కూడా ఇబ్బందులకు గురయ్యారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అలాంటి క్లిష్ట సందర్భాల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేశారని గుర్తు చేశారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీ ఐదో స్నాతకోత్సవంలో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ .. యూనివర్సిటీలో చదివి ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేధ వంటి సాంకేతికత మనుషులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాబోదని అభిప్రాయపడ్డారు. ఎంఐటీ తాజా అధ్యయనం ప్రకారం, జనరేటివ్ ఏఐను తమ వ్యాపారాల్లో ప్రవేశపెట్టిన సంస్థల్లో 95 శాతం విఫలమయ్యాయని.. 5 శాతం సంస్థలు మాత్రమే ఆదాయం పెంచుకున్నాయని తెలిపారు. కృత్రిమ మేధస్సు అనేది మానవ మేధస్సుకు ఒక సాధనం మాత్రమేనని స్పష్టం చేశారు. పూర్తిగా ఏఐ మీద ఆధారపడితే మానవ ఆలోచనా శక్తిని కోల్పోతామన్నారు. కృత్రిమ మేధస్సును భావోద్వేగాలతో సమతుల్యం చేయకుంటే మానవ జీవితం, గౌరవం కూడా వస్తువులా మారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇక రాజధాని అమరావతి గురించి మాట్లాడుతూ..కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి ప్రాంతమంతా తనకు పరిచయమేనని.. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన



సమయంలో కృష్ణా నదిలో ఉన్న దీవుల్లో రహస్య సమావేశాలు నిర్వహించిన విషయం గుర్తు చేసుకున్నారు. ఈ గడ్డ తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, ఎన్నో పాఠాలు నేర్పిందని... ఇక్కడి ప్రజల నుంచి ఎప్పుడూ స్ఫూర్తి పొందుతానని తెలిపారు. రాజధానిని నిలబెట్టుకోవటం కోసం ఈ ప్రాంత రైతులు చేసిన పోరాటాన్ని జస్టిస్ రమణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారసత్వంగా వచ్చిన భూమిని రాజధాని కోసం త్యాగం చేసిన రైతులు... అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రో÷%-%డడెక్కారని, పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అమరావతి వీధుల్లో జరిగిన ఉద్యమం స్వాతంత్ర్య తర్వాత దక్షిణ భారతదేశంలో జరిగిన అతి పెద్ద, సుదీర్ఘ పోరాటమని అభివర్ణించారు. ప్రభుత్వ యంత్రాంగాల నుంచి ఒత్తిళ్లు వచ్చినా ఓర్పు, సహనం, నిబద్ధతతో వెనుకడుగు వేయని అమరావతి రైతుల ధైర్యానికి వందనం చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంచిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పాలన అనేది నిరంతర పక్రియ అని, అధికారం మారినప్పుడు విధానాల్ని మార్చటం తప్పని జస్టిస్ రమణ స్పష్టం చేశారు. అలా చేస్తే వృద్ధి ఆగిపోవటంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. అధికార వ్యవస్థను ప్రతీకార రాజకీయాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. దేశంలో న్యాయపాలన ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపైనా జస్టిస్ రమణ మాట్లాడారు. విట్ వంటి సంస్థలు కూడా గత ఐదేళ్లు ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాయని తెలిపారు. నేటి సమాచార యుగంలో సైతం ఖచ్చితమైన సమాచారం పొందడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. వార్తల వక్రీకరణ, పార్టీలకు అనుగుణంగా పనిచేసే మీడియా ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. స్వేచ్ఛ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రతి అంశాన్ని ట్రోల్ చేయటం, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయటం, మానసిక వేదనకు గురిచేయటం సరికాదన్నారు. సమాచార సృష్టి పేరుతో అత్యల్ప స్థాయికి దిగజారిపోయామని ఆవేదన వెలిబుచ్చారు. సోషల్ మీడియాకు బానిసల్కెన వారు డిజిటల్ ప్రపంచం నుంచి బయటకు రాలేకపోతున్నారన్నారు. కంటెంట్ నిజస్వరూపం ఇప్పుడు సమస్యగా మారిందని... ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేయటం, డీప్ ఫేక్ వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో బాధితులకు సాయం చేసే సమర్థమైన న్యాయ యంత్రాంగం లేదని, ఆన్ ల్కెన్‌ను నియంత్రించటం కష్టమైందన్నారు.

# వైసీపీ ఓ పెద్ద ఫేక్ పార్టీ

మొదటి పేజీ తరువాయి...

ఆధారాలు చెరిపేశారని విమర్శించారు. వివేకా కుమార్తె ఫిర్యాదు చేసిన తర్వాత అప్పుడు గొడ్డలి పోటని ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. వివేకా హత్య ఘటనలో ఏమరుపాటుకు గురయ్యామని చెప్పుకొచ్చారు. కోడికత్తి డ్రామా, గులకరాయి డ్రామాలు ఆడారని విమర్శించారు. అలాంటి వాళ్లకు రాజకీయాలు చేసేందుకు అర్హత ఉందా..? అసలు వారికి పార్టీగా ఉండే అర్హత ఉందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజల ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని అనుకుంటే ఎంతటి వారినైనా ఢీ కొంటానని స్పష్టం చేశారు. రాయలసీమ ఫ్యాక్షన్‌ను, హైదరాబాద్‌లో మత విద్వేషాలు, నక్సల్స్ సమస్యనూ అణచివేశానని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు. అందుకే నక్సల్స్ అలిపిరిలో తనపై క్లైమోర్‌మైన్స్ పేల్చారని చెప్పుకొచ్చారు. నేరస్తులే రాజకీయ పార్టీ పెట్టి రాజకీయ అండతో నేరాలు చేస్తూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్నూలులో బస్సు దగ్ధం ఘటన జరిగితే అందులోనూ ఫేక్ ప్రచారాలకు తెరదీశారని ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఒడిశాలో బస్సు రిజిస్ట్రేషన్ చేసి హైదరాబాద్ నుంచి బెంగుళూరు మధ్య నడుపుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రమాదం జరిగితే దానిపై కూడా ఫేక్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఫేక్ వ్యక్తులు దుష్ప్రచారం చేస్తుంటే ప్రతీ రోజూ చెప్పుకోవాలా..? అని ఆగ్రహించారు. వైసీపీకి ఓ పాంప్లెట్ ఉందని... ఓ ఛానల్ కూడా



ఉందని... కానీ ఆ వ్యక్తులు బయటకు వచ్చి తమకు ఛానల్ లేదని, పేపర్ లేదని ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు.వాహనాల రిజిస్ట్రేషన్ల అంశంపైనా కేంద్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ రాస్తానని చెప్పుకొచ్చారు. పేపర్, ఛానల్ ద్వారా శవరాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మరో ఘటనలో కమ్మ కాపు మధ్య కుల విద్వేషాలు రగిల్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. వాళ్లు నిద్రలేస్తే చాలు దుష్ప్రచారానికి తెగబడుతూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి రోజూ తమ ప్రభుత్వంపై బురద వేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇక ఏమాత్రం ఉపేక్షించబోనని... అడుగడుగునా సీసీ కెమెరాలు, ఆధారాలు ఉన్నాయని... అన్నిటినీ బయటపెడతామని హెచ్చరించారు. అమాయకులను మోసం చేస్తూ కులం, మతం, ప్రాంతం పేరుతో జగన్ అండ్ కో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

### 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ

### ఉత్సవాల నిర్వహణకు మంత్రులతో కమిటీ

### సిఎం చంద్రబాబు వెల్లడి

**సత్యసాయి జిల్లా,నవంబర్ 1 (నినాదం):** సత్యసాయి శతజయంతి ఉత్సవాలని ఘనంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. సత్యసాయి బాబా అనంతపురం జిల్లాకు నీటి సరఫరా విషయంలో తన దగ్గర మాట తీసుకున్నారని గుర్తుచేశారు. ఎల్ అండ్ టీ ద్వారా తాను గతంలో ఆ పనులు చేయించానని... కానీ ఆ తర్వాత వచ్చిన పాలకులు ఆ పనులని ఎందుకు నిలిపేశారని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఈ నెల13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని ప్రకటించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్‌లతో ఓ కమిటీ వేశామని తెలిపారు. సత్యసాయి ట్రస్టుతో కలిసి మంత్రుల కమిటీ శతజయంతి ఉత్సవాలను పర్యవేక్షిస్తుందని చెప్పుకొచ్చారు. ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. అభివృద్ధి అజెండాతో పనిచేస్తున్న బీజేపీ.. గుజరాత్ రాష్ట్రంలో గడచిన 25 ఏళ్లుగా అధికారంలో ఉందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. ఏపీలో ఏ వ్యక్తి తప్పు చేసినా ప్రభుత్వ నిఘా నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అత్యాచారాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని




వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ(శనివారం) సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. చిత్తూరు మాజీ మేయర్ దంపతుల హత్య కేసులో నిన్ననే కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ కేసులో ఐదుగురికి ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు సీఎం చంద్రబాబు. న్యాయం జరగడానికి ఆలస్యం అయినా.. తప్పు చేసిన వారు తప్పించు కోలేరనడానికి ఈ తీర్పు అతిపెద్ద ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. అతి దారుణంగా మేయర్ కార్యాలయంలోనే ఆ దంపతుల్ని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో తాము అభివృద్ధి చేసిన వాటిని గత పాలకులు విధ్వంసం చేశారన్గి÷ర్ అయ్యారు. ఇప్పుడు మళ్లీ వచ్చి వాటినే మొదలు పెట్టాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చేసిన పనులని విధ్వంసం చేస్తే.. మళ్లీ వాటినే పునరుద్ధరించటం చాలా కష్టతరం అవుతుందని వెల్లడిరచారు. ప్రజలంతా ఆలోచించి తమ ప్రభుత్వానికి సహకరిస్తేనే శాశ్వతంగా మంచి జరుగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కిషన్ రెడ్డికి క్రికెట్ అంటే తెలుసా?

మొదటి పేజీ తరువాయి...

చెప్పుకొచ్చారు. తనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ క్రికెటర్, మంత్రి అజారుద్దీన్ స్పందించారు. శనివారం ఆయన తనను కలిసిన విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ.. తనపై వచ్చిన ఆరోపణలపై కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇది ఎవరైనా తెలుసుకోవాలన్నరు. విమర్శలు చేయడం కాదు..నిజాలు కూడా తెలుసు కోవాలన్నారు. దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన తాను దేశ ద్రోహినా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమే బీజేపీ తనను టైట్ చేసిందని ఆరోపించారు. మంత్రిగా జూబ్లీహిల్స్‌లో అడుగుపెట్టిన తనను ప్రజలు ఆదరించారని.. ఇందుకు ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. విమర్శించిన వాళ్ళకి సమాధానం చెప్పదల్చు కోలేదని మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. కాగా.. అజారుద్దీన్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ దేశ ద్రోహానికి పాల్పడ్డారని, భారత్‌కు చెడ్డపేరు తెచ్చారని విమర్శించారు. ఆయనపై అనేక కేసులు ఉన్నాయని.. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇవ్వడం ప్రజాస్వామ్యానికి అవమాన కరమన్నారు. అజారుద్దీన్ దేశ గౌరవానికి భంగం కలిగించారంటూ కిషన్ రెడ్డి చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తోక కట్ చేయడం ఖాయం

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్న ప్రవీణ్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. శ్రీనివాస్ నాయుడు చాలా కాలం నుంచి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని.. ఐదేళ్ల కిందటే రావాల్సిన నాయకుడు ఇప్పుడు వచ్చారని అన్నారు. మన పార్టీ నుంచి గెలిచి మేయర్ అయిన వ్యక్తి ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డే ఏ పనులు చేయట్లేదని.. ఇక మేయర్ మనకు ఏం పనులు చేస్తుందని దుయ్యబట్టారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని గ్యారెంటీ కార్డులు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించారన్గి÷ర్ అయ్యారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ లక్ష రూపాయలు ఇస్తే.. తులం బంగారం కూడా ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారని అన్నారు. ఇప్పుడు తులం బంగారం ఇవ్వకపోగా.. మెడలో గొలుసు కూడా లాక్కెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ ఇస్తున్నామని చెప్పి భార్యకి ఫ్రీ ఇచ్చి.. భర్త నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కేసీఆర్ అమలు చేశారని.. అలాగే కేసీఆర్ కిట్ ఇచ్చారని కొనియాడారు. తమ హయాంలో ఆడపిల్ల పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు కేసీఆర్ హయాంలో జరిగాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు.. ఇలా అన్ని పథకాలు బంద్ అయ్యాయని ఆగ్రహించారు. ఎన్నికలు వస్తే ఎవరైనా ఏం చేస్తారో చెప్తారు.. కానీ బెదిరిస్తారా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ నాశనం చేశారని.. రెండేళ్లలో ఏం మంచిపని చేశారో చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ పేదల ఇళ్లు కూలగొడుతున్నారని, హైడ్రా, బుల్డోజర్ పేరుతో పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ఈ ప్రభుత్వం అమలు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. బీసీ, ఎస్సీ డిక్లరేషన్ అంటూ నోటికొచ్చిన 420 హామీలు ఇచ్చారని మండిపడ్డారు. మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో చనిపోతే ఈ నెల 11న బైపోల్ ఎన్నిక వచ్చిందన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గోపీనాథ్ భార్య మాగంటి సునీతకు కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పారు. భర్త చనిపోయి మాగంటి సునీత ఏడిస్తే.. దాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు డ్రామా అంటున్నారని చెప్పారు. ఒక ఆడబిడ్డ ఏడిస్తే కూడా ఇంత అన్యాయంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డను అవమానిస్తున్న వారికి బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. అధికారంలోకి రాగానే మేయర్, ఇతర నేతలు కాంగ్రెస్‌లో చేరినా ప్రజలు తమతోనే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ విజయంతోనే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం కావాలని.. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆకాంక్షించారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం



# సుదర్శన్ రెడ్డిని సన్మానించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా శుక్రవారం బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్ లో నివాసానికి వెళ్లి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకుల పల్లి భూపతిరెడ్డి శాలువాతో సన్మానించి , శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంటా తాహెర్ బిన్ హందన్, జిల్లా డిసిసి అధ్యక్షులు, రాష్ట్ర కోపరేటివ్ కార్పొరేషన్ మానాల మోహన్ రెడ్డి ఉన్నారు.

# జనం నాడి పట్టిన నాయకుడు బల్మూరి

### సమస్యల పరిష్కారమే ఆయన లక్ష్యం
### నేడు బల్మూరి వెంకట్ జన్మదినం



**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం) :** నిరుద్యోగ, విద్యార్థి, యువత సమస్యలపై బలంగా కొట్లాడే సైనికుడు ఆయన.. ఉద్యమమే అస్త్రంగా మలుచుకుని గత పాలకుల తీరుతెన్నులను ప్రశ్నిస్తూ.. యువత తరఫున బలమైన ప్రశ్నించే గొంతుకగా నిలబడి.. ప్రజా నాయకుడిగా యువ కెరటం గా గుర్తింపు పొందిన నాయకుడు బల్మూరి వెంకట్. శాసనమండలి సభ్యుడి గా.. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడిగా, రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా, నిరుద్యోగ యువతకు ఆశాకిరణంగా ప్రజా జీవితంలో ముందుకు సాగుతున్న బల్మూరి వెంకట్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక కథనం.. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన వెంకట్ కు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆదివారం వెంకట్ పుట్టినరోజు వేడుకలను ఆయన ఆఫీసు హైదరాబాదులోని నారాయణ గూడ తో పాటు హుజురాబాద్ నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించనున్నారు.

**డాక్టర్ గా రాజకీయ నాయకుడిగా ప్రజాసేవలో బల్మూరి**

విద్యార్థి దశ నుండి ఉద్యమాలలో చురుకుగా పాల్గొని వందలాది కేసులను తన మీద ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యపై నిరంతరం పోరాటం చేసిన విద్యార్థి నాయకుడు డాక్టర్ బల్మూరి వెంకట్. విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించకుండా ఎంత దూరమైన వెళ్లి వారికి న్యాయం చేయడమే లక్ష్యంగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థులకు అండగా నిలిచిన నాయకుడు వెంకట్. వెంకట్ చేసిన సేవలను గుర్తించి ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు నుండి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి పార్టీ ఆయనకు సముచిత స్థానం కల్పించారు. విద్యార్థి నాయకుడి నుండి రాజకీయ నాయకుడిగా ఎదిగినప్పటికీ తనలో ఆ పోరాట తత్వం తగ్గలేదు. సమస్యలపై ఇప్పటికి కూడా స్పందిస్తూ తన వద్దకు వచ్చే వారికి అందినంత సహాయం చేస్తూ వారికి అండగా నిలబ డడమే బల్మూరి నైజం. ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఘటైన సమాధానం చెబుతూ ప్రతిపక్షాల నోర్లు ముగించడంలో వెంకట్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటారు.

**నేటి యువతకు మార్గదర్శకుడు..**

రాష్ట్రంలో బల్మూరి వెంకట్ పేరు తెలవని యువతి యువకులు ఉండరు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సమస్యలపై ఉద్యమాలు చేసిన యువనేతకు యువతలో మంచి ఫాలోయింగ్ ఉంది. పోరాడే మనస్తత్వం చిన్నతనం నుండి ఉండడంతో ఎవరికి భయపడని వ్యక్తిత్వం తో తప్పు చేయకుండా ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు కదులుతున్న బల్మూరి కి యువత నుండి విశేష మద్దతు లభిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పుట్టినరోజు వేడుకలు జరపడానికి ఆయన అభిమానులు నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.


యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మహబూబ్‌నగర్ రీజియన్

**బంగారు ఆభరణముల వేలము ప్రకటన**

ఈ క్రింద చూపబడిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శాఖలోని ఖాతాదారులు, తమ బంగారు వస్తువుల హామీపై వ్యవసాయేతర అవసరాలకై పొందిన అప్పులు తిరిగి చెల్లించమని అనేక డిమాండ్ నోటీసులు ఇచ్చిననూ అప్పులు తిరిగి చెల్లించమని కారణముగా బ్యాంక్ నిబంధనల ప్రకారం తేది: 14.11.2025న సా. 04.00 గం॥లకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. ఈ క్రింది శాఖలో బహిరంగ వేలము వేయబడును.
ఈ క్రింద సూచించిన వివరములు తేది: 30.10.2025 నాటి వరకు అందుబాటులో ఉన్నవి. తేది: 31.10.2025 తరువాత చోటుచేసుకొనే మార్పులను వేలము రోజు పరిగణనలోకి తీసుకోబడదు.

**బంగారు ఆభరణముల వేలము వేయు వివరములు**

| క్ర.సం. | రుణగ్రస్తుని పేరు | ఖాతా నెం. | మొత్తం బరువు గ్రా॥లలో |
|---|---|---|---|
| చిట్యాల బ్రాంచ్, నల్గొండ జిల్లా | | | |
| 1 | పోతురాజు భాగ్యమ్మ | 132216540005191 | 11.90 |
| 2 | పోతురాజు భాగ్యమ్మ | 132216540005192 | 26.20 |
| దేవరకొండ బ్రాంచ్, నల్గొండ జిల్లా | | | |
| 1 | నేనావత్ బలరాం | 011330100241668 | 10.00 |
| కొండ మల్లేపల్లి, నల్గొండ జిల్లా | | | |
| 1 | తొటకూరి ధానమ్మ | 214116540015428 | 24.70 |
| మోమిన్‌పేట బ్రాంచ్, వికారాబాద్ జిల్లా | | | |
| 1 | చింతలపల్లి సురేష్ | 086316540004514 | 30.00 |
| అమరచింత బ్రాంచ్, వనపర్తి జిల్లా | | | |
| 1 | పుల్లంగారి మనోహర్ రెడ్డి | 071216540008395 | 29.50 |
| తుర్కమిడి బ్రాంచ్, వికారాబాద్ జిల్లా | | | |
| 1 | పార్థపురం అఖిల్ | 098016630000155 | 11.00 |
| చార్కొండ బ్రాంచ్, నాగర్‌కర్నూల్ జిల్లా | | | |
| 1 | చింతపల్లి జ్యోతి | 077916540008148 | 47.80 |

షరతులు: (1) ఖాతాదారులలో ఎవరైనా బ్యాంకు వారి నోటీసులు ఏ కారణము చేతనైనా అందని యెడల నోటీసు తిరిగి వచ్చిన యెడల వారికి కూడా ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. (2) ఖాతాదారులకు ఎవరైనా మరణించియుండిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. (3) తాకట్టుదారులు ఇదే చివరి నోటీసుగా భావించి, బకాయి చెల్లించగలరు. తదుపరి ఆక్షేపణలు అంగీకరించబడవు. (4) వేలంనందు పాల్గొనదలచినవారు PAN కాపీతో బయానా క్రింద రూ. 10,000/- తేది: 14.11.2025న ఉ. 10.00 గం॥ల నుండి సా. 04.00 గం॥లలోపు పైన తెలిపిన శాఖలో చెల్లించి వేలంలో పాల్గొనగలరు. (5) హెచ్చు పాటదారులు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. (6) ఎటువంటి కారణము లేకుండా వేలం రద్దుగాని, వాయిదా వేయుటకు బ్యాంకు శాఖ వారికి అధికారము కలదు. (7) వివరాలకు శాఖాధిపతిని బ్యాంకు పనివేళలలో సంప్రదించండి.

తేది: 01.11.2025 సం/- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


# గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



### రఘునాథ పాలెం సి ఐ. ఉస్మాన్ షరీఫ్

**ఖమ్మం, నవంబర్ 01(నినాదం):** ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం లోని ఆపిల్ సెంటర్ లో శనివారం ఖమ్మం పోలీస్ కమీషనర్ గ ఆదేశాల మేరకు ఖమ్మం టౌన్ ఏసీపీ పర్యవేక్షణలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక అనుమానస్పద వాహనంలోని ఇద్దరు వ్యక్తుల నుండి 30 లక్షల విలువ గల హాషీష్ ఆయిల్ (గంజాయి ఆయిల్) ,వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలిం చడం జరిగింది. శనివారం. ఈ కార్యక్రమం లో సబ్ ఇన్స్పెక్టర్ గజ్జెల నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

### యస్.బి.ఐ.టి. సహాయ ఆచార్యుడు
# జి. ప్రభాకర్‌కు డాక్టరేట్



**ఖమ్మం, నవంబర్1(నినాదం):** స్థానిక యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాల సి.యస్.ఈ. విభాగపు సహాయ ఆచార్యుడు గంటెల ప్రభాకర్ కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. "ఎన్హాన్స్డ్ మెథడాలజీస్ ఫర్ డేటా సెక్యూరిటీ ఇన్ క్లౌడ్ ఎన్విరాన్మెంట్ యూజింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్" అనే అంశం పై డా? బొబ్బా బసవేశ్వరరావు పర్యావేక్షణలో తను చేసిన పరిశోధనకు గాను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి పట్టాను పొందినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెక్యూరిటీ, డీప్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై పరిశోధన ద్వారా తన అనుభవం విద్యార్థులకు, సి.యస్.ఈ విభాగ అభివృద్ధికి దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేసారు. కాగా ప్రభాకర్ చింతకాని మండలం, అనంతసాగర్ గ్రామ వాసి కావడం వలన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులతో పాటు గ్రామ వాసులు ప్రభాకర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, డా॥ జె. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఖిల్లాపై జోరుగా సాగుతున్న పారిశుద్ధ్య పనులు




**ఖమ్మం, నవంబర్1 (నినాదం):** ఖమ్మం నగరం లోని ఖిల్లాపై 42వ డివిజన్ పరిధిలోని నిజాంపేటలో పారిశుద్ధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. శనివారం ఈ పనులను 42వ డివిజన్ కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల , జిల్లా కాంగ్రెస్ నాయకుడు పాకాలపాటి శేషగిరి పర్యవేక్షిస్తూ శ్రమదానం చేస్తున్నాడు. ఖిల్లా ప్రహరీ పై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే క్రమంలో అక్కడ ఉన్న జనావాసాలపై అవి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ శుభ్రం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనుల్లో మున్సిపల్ వర్కర్లు, డిఆర్ఎఫ్ సిబ్బంది పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పాకాలపాటి శేషగిరి మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చూపిన చొరవ ఎప్పటికీ మరువలేనిది అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ మార్గదర్శకత్వంలో పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం ఖిల్లా ను పర్యాటక కేంద్రంగా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు యుగంధర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.


**SAHASRA INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES**
(Approved by PCI, Affiliated to Kakatiya University, Warangal)
Mulugu Road, Near Ayyappa Swamy Temple, Hanumakonda - 506007

**Admission Notification to B. Category Admission for B.Pharm, Pharm.D and M.Pharmacy 2025-26**

B-CATEGORY SEATS - B.PHARMACY & PHARM.D A.Y. 2025-26

| Course | Intake | B-Category | TG-EAPCET CODE |
|---|---|---|---|
| B. Pharmacy | 100 | 30 | SHIP |
| Pharm.D | 30 | 9 | |

B.Category admissions for B.Pharmacy and Pharm.D will be filled at the institute. Interested candidates may obtain from college or online application. Visit our web portal www.sahasrapharm.edu.in at free of cost and submit your applications along with relevant certificates to the college on or before **22-11-2025.** Admissions will be made as per the regulations of TG-EAPCET: 2025-26 - GOVT OF TELANGANA (2025)

**Admission Notification to M.Pharmacy B-Category - A.Y 2025-26**

B-CATEGORY SEATS - M.PHARMACY A.Y. 2025-26

| M.Pharmacy (Branches) | Intake | B-Category | TG-PGECET CODE |
|---|---|---|---|
| Pharmaceutics | 15 | 4 | SHIP1 |
| Pharmaceutical Analysis | 15 | 4 | |
| Pharmacology | 15 | 4 | |
| Regulatory Affairs | 15 | 4 | |

Vacancy seats for B.Category admissions for M.Pharmacy will be filled at the institute. Interested candidates may obtain from college or online application. Visit our web portal www.sahasrapharm.edu.in at free of cost and submit your applications along with relevant certificates to the college on or before **10-11-2025.** Admissions will be made as per the regulations of TG-PGECET: 2025-26 - GOVT OF TELANGANA (2025)

FOR DETAILS CONTACT: - 9966866615 / 9160807548 Sd/- SECRETARY


# నిండా ముంచిన అకాల వర్షం

### ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధిత రైతు గోనెల సంపత్



**భీమదేవరపల్లి నవంబర్ 1 (నినాదం) :** హనుమకొండ జిల్లా భీమదేవర పల్లి మండలంలో మొంత తుఫాను బుధవారం రోజు మండల వ్యాప్తంగా అధిక నష్టం కలిగించింది. మండలంలోని బొల్లోనిపల్లి గ్రామానికి చెందిన గోనెల సంపత్ అనే రైతుకు కోలుకోలేని విధంగా నష్టాన్ని కలిగించింది. 150 బస్తాల వరి ధాన్యం నీటిలో కొట్టుకపోగా, వరదకు వ్యవసాయ బావి మొత్తం కూలిపోయి కరెంటు మోటార్ కూడా బయటికి రాలేని విధంగా బావికూరుకుపోయింది. ప్రభుత్వం తరఫున సహాయం చేసి ఆదుకోవాలని అధికారులను బాధిత రైతు గోనెల సంపత్ వేడుకుంటున్నాడు.

# మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన అన్నం సేవ



**ఖమ్మం, నవంబర్ 01(నినాదం):** మతిస్థిమితం లేని వ్యక్తిని వైద్య సదుపాయాలు అందించి వారి కుటుంబ సభ్యులకు అన్నం సేవా సంస్థ నిరాహువులు అందజేశారు. శనివారం అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల క్రితం గుర్తుతెలియని 60 సంవత్సరాల వృద్ధుడు మతిస్థిమితం కోల్పోయి ఖమ్మంలో తిరుగుతుండగా ప్రజల సమాచారం మేరకు పోలీసు వారు అన్నం ఫౌండేషన్ లో చేర్చగా అతనికి వసతి సపర్యాలు ఆహారం వైద్యం అందించగా ఇటీవల కోల్పోయిన నాది మహారాష్ట్ర నాగపూర్ జిల్లా కటోలు గ్రామానికి చెందిన రాజేంద్ర సూర్యవంశం నా భార్య పేరు వందన కుమారుడు మగేష్ అని చెప్పగా పెట్రోల్ పోలీసుల ద్వారా ఆచూకీ కనుగొని పేదవారైనందున మహారాష్ట్ర నుండి ఖమ్మం రాలేక ఖమ్మం నుండి అన్నం ఫౌండేషన్ ఖమ్మం నుండి రైలు ద్వారా నాగపూర్ వెళ్లి అక్కడి నుండి కటోలు గ్రామానికి తీసుకెళ్లి కటోలు పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులైన భార్య వందనకు కుమారుడు మహేష్ కు అప్పచెప్పిన అన్నం ఫౌండేషన్ ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆరు సంవత్సరాల తర్వాత నా భర్తని అప్ప జెప్పినారు అని కుమారుడికి తగిన అప్పగిస్తున్నారని అన్నం ఫౌండేషన్ అక్కడి పోలీసు వారు కుటుంబ సభ్యులు ప్రజలు ప్రజాప్రతినిధులు అన్నం ఫౌండేషన్ సేవలను అభినందించినారు ఇతను తప్పిపోయినాడు అని పోలీస్ స్టేషన్లో పిటిషన్ కూడా మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చి ఉన్నారు ఈ కార్యక్రమంలో పందెం ఫౌండేషన్ చైర్మన్ అంగం శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు

# అన్ని దాన కన్నా అన్నదానం మిన్న : కోయిల బుచ్చయ్య.





**ఖమ్మం నవంబర్01(నినాదం):** అన్ని దానాల కన్నా అన్నదాన మిన్న అని కోయిల బుచ్చయ్య చౌదరి అన్నారు. శనివారం 4వ డివిజన్ లో కలిసి ఉన్న శ్రీ స్వయంభు అభయ వెంకటేష్ స్వామి దేవస్థానంలో నిత్య అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత నెల 8 నుండి నవంబర్ 17 వరకు అయ్యప్ప మాల ధరించిన స్వాములకు నిత్యం ఏర్పాటు చేశారు. కాగా శనివారం కోయిల బుచ్చయ్య చౌదరి విజయలక్ష్మి దంపతులు అన్నదానానికి 50,000 విరాళం అందించి అయ్యప్ప స్వాములకు స్వయంగా వడ్డించి వారి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. కార్తీక మాసంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం మనసుకు సంతృప్తి కలిగిందని అన్నారు. అదేవిధంగా ఆలయ కమిటీ సభ్యులు ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేయడం గొప్ప విషయం అని కొనియారు. గతంలో ఈ దంపతులు ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంభానికి రూ. 15 లక్షలు విరాళం అందించే విషయం విదితమే. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కోయిల బుచ్చయ్య చౌదరి దంపతులకు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఇందిరమ్మ ఇంటి పిల్లర్ల గుంతలో
# పడి అంగన్‌వాడి చిన్నారి మృతి



**నిర్మల్ ప్రతినిధి,(పెంబి) నవంబర్ 1(నినాదం) :** నిర్మల్ జిల్లా, పెంబి మండలం, వేణునగర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆత్రం రేణుక, రాముల దంపతుల ఐదేళ్ల కూతురు పుష్ప, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ల గుంతలో పడి మరణించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పుష్ప సాయంత్రం దాదాపు మూడున్నర గంటల ప్రాంతంలో ఆడుకుంటుండగా ప్రమాదవ శాత్తు నీటితో నిండిన పిల్లర్ల గుంతలో పడిపోయింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో చిన్నారి మృతి చెందిందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం దాదాపు 3 గంటల 55 నిమిషాలకు తమ దృష్టికి వచ్చిందని గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్ తెలిపారు. హుటాహుటిన అంబులెన్స్‌కు ఫోన్ చేసి, చిన్నారిని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం దక్కలేదు. తమ చిన్నారి విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనకు అంగన్వాడి టీచర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు తీవ్రంగా ఆరోపిస్తు న్నారు. చిన్నారి అంగన్వాడి కేంద్రంలో ఉండాల్సిన సమయంలో అంగన్వాడి టీచర్ సరిగా పట్టించుకోలేదని విమర్శలు, వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై ఇన్‌చార్జి సీడీపీఓ శ్రీలత స్పందిస్తూ, చిన్నారి మృతి చెందిన విషయం తెలిసినా, ఎన్ని గంటలకు జరిగిందనేది ఇంకా స్పష్టంగా తెలియలేదన్నారు. అంగన్వాడి టీచర్‌ను అడగగా, నాలుగు గంటలకే ఇంటికి పంపించడం జరిగిందని, ఇది ఎలా జరిగిందో తెలియదు కానీ, నాలుగు గంటలకు పడిందని తటస్థం గా మాట్లాడిందని ఆమె తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, దర్యాప్తు పూర్తయిన తర్వాత అంగన్వాడి టీచర్‌పై తప్పకుండా చర్యలు తీసుకుంటామని శ్రీలత వెల్లడించారు

# కేటీఆర్ రోడ్ షో కు భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జూబ్లీహిల్స్ లో రోడ్ షో నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రహమత్ నగర్ నుంచి కేటీఆర్ రోడ్ షోకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలి వెళ్లారు. పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు కారు గుర్తుకు ఓటేయాలని, మాగంటి సునీతను గెలిపించుకోవాలని కోరుతూ ప్రజలను కలుస్తూ ర్యాలీగా ఉత్సాహంగా రహమత్ నగర్ చౌరస్తా కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, నాయకులు అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, నాగం తిరుపతి రెడ్డి, రజినీ తదితరులు ఉన్నారు

# బీసీ రిజర్వేషన్లపై కేంద్రం శాశ్వత పరిష్కారం చూపాలి




**చింతపల్లి, నవంబర్ 1 (నినాదం) :** 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని సామాజికవేత్త బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని వీటి నగర్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుమారు 1000 మంది బీసీ సంఘం సభ్యులతో కలిసి శాంతియుతంగా భారీ ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణతో 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్లను కల్పించే విషయంలో శాశ్వతమైనటువంటి పరిష్కారాన్ని చేయాలని డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్. పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్ ర్యాలీ కి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల ఆర్మీ శ్రీను , మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పూల యాదయ్య, జోరిగే రామకృష్ణ ,మేదర సంఘం ప్రచార కార్యదర్శి రెడ్డి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కాశగోని వెంకటయ్య, రెడ్డి యాదయ్య , జెసి లక్ష్మణ్ సాగర్, ముడిగ మల్లేశ్, అంగిరేకుల శ్రీకాంత్, అంగిరేకుల జగదీష్, దామెర శాంసన్ , అంకం శీను, చిట్టిపోలు వెంకటేష్ , సురికి జంగయ్య, గోనగోని అశోక్ , గడ్డం ఆంజనేయులు, అజీమ్ పాషా , రావిరాల సీనయ్య ,గుర్రం రాజు , కర్నాటి గణేష్, దువ్వ శ్రీనివాస్, మునగపాటి పురుషోత్తం, పున్న నరసింహా, అంకం చంద్రశేఖర్, రవి , ఆర్కపెల్లి సాయిప్రసాద్ , కుకుడాల వినీత్, ఉడుతల వెంకటేష్, మాదారం శివాజీ , లగోని శివకృష్ణ , అండెకార్ నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

### మరణించిన పద్మశాలి కుటుంబాలకు ఆర్థిక సహాయం
# అందజేసిన ఖమ్మం జిల్లా పద్మశాలి సంఘం

**ఖమ్మం, నవంబర్ 01(నినాదం):** జిల్లాలో ఇటీవల మరణించిన నిరుపేద పద్మశాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం..ఖమ్మం నగర పరిధిలోని పంపింగ్ వెల్ రోడ్డు 30వ డివిజన్ లో నివసిస్తున్న పొట్టబత్తని కిరణ్ వయసు (45) సం" వారి కుటుంబానికి 6000 , గాంధీ చౌక్ లో నివసిస్తున్న సోమ మురళి వయసు (45) సం" వారి కుటుంబానికి 6000 , 30వ డివిజన్ లో నివసిస్తున్న గోంగూర సంతోష్ వయసు (40) సం" వారి కుటుంబానికి 6000 , పొన్నెకల్లు లో నివసిస్తున్న కుసుమవీరస్వామి వయసు (70) సం" వారి కుటుంబానికి 6000 . మొత్తం నాలుగు కుటుంబాలకు 24000 వేల రూపాయలను తెలంగాణ పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి చేతుల మీదుగా అందించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారంఅందించిన వారు పద్మశాలి ఖమ్మం నియోజకవర్గ కమిటీ , విశ్రాంత ఉద్యోగ విభాగం . ఈ సందర్భంగా కమర్తపు మురళి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలనుండి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాము పద్మశాలి కుల బాంధవులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా పద్మశాలిసంఘ ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస్ బాబు , ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు పెండంజనార్ధన్ బండారు , శ్రీను విశ్రాంత ఉద్యోగవిభాగ అధ్యక్షులు , దుస్స సత్యనారాయణ , యూత్విభాగ అధ్యక్ష కార్యదర్శులు పులి పాటిసంపత్ కుమార్ , చందా వీరభద్రం , జానకిరామయ్య , పారుపల్లి సత్యనారాయణ , కమర్తపు శ్రీధర్ , గుడ్ల శీను , పంతంగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఫండ్స్‌ను సక్రమంగా వినియోగించాలి

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం) :** నగరంలో పనిచేయని స్ట్రీట్ లైట్లు తక్షణమే మరమ్మతు చేసి కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని, ఇటీవల విడుదలైన మున్సిపల్ ఫండ్స్ ను పూర్తిగా, సక్రమంగా వినియోగించాలి అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అధికారులకు సూచించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణ రెడ్డితో కలిసి జిల్లా ముఖ్య విభాగాలపై విస్తృత సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పలుకీలకఅంశాలను ప్రస్తావిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. నగర శానిటేషన్ పనుల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్ది పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్‌కు ఆదేశించారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు,ముఖ్యంగా ఆడపిల్లల పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇన్ఫ్రా స్ట్రక్చర్ అప్‌గ్రేడేషన్, అవసరమైన అంచనాలు, ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలి అని డీఈఓను ఆదేశించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న పనులు, ఆలస్యమవుతున్న నేపథ్యంలో, వాటిని తక్షణమే వేగవంతం చేసి పూర్తి చేయాలని అన్నారు. సోనీ ఫంక్షన్‌హాల్ దగ్గర బ్రిడ్జ్ వర్క్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందూరు నగరం లోని బస్తీ దవాఖానాల పని తీరు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి మంజూరు చేసిన రూ.2.25 కోట్ల నిధులతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. సంబంధిత అధికారులు టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు.
మదర్, చైల్డ్ వెల్ఫేర్ హాస్పిటల్‌లో సఫీషియెంట్‌గా స్టాఫ్‌ను రిక్రూట్ చేసుకుని త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలోని కుంటలు, చెరువులు, నీటిమడుగులపై జరిగిన ఆక్రమణలపై పూర్తి నివేదికను వెంటనే సమర్పించాలి అని ఆదేశించారు. ఆక్రమణలను తొలగించే దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అండర్ గ్రౌండ్ వర్క్ నత్తనడకన జరుగుతున్నాయని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా డివిజన్‌కి కోటిరూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, వాటి టెండర్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ, విద్యాశాఖ, ఆర్అండ్‌బి, హెల్త్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ నష్టాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి

### 6 నాటికి పంట, మౌలిక వసతుల నష్టం అంచనా నివేదికలు అందించాలి : అదనపు కలెక్టర్ డా. శ్రీజ



**ఖమ్మం (ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం):** మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో సంభవించిన పంట, మౌలిక వసతుల నష్టాలపై నిర్దిష్ట నమూనాలో నివేదికలు సిద్ధం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి తుఫాన్ నష్టాంచనాల పురోగతిని సమీక్షించారు. అదనపు కలెక్టర్ డాక్టర్. పి.శ్రీజ మాట్లాడుతూ, వ్యవసాయ అధికారులు,ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. నవంబర్ 6 నాటికి సమర్పించాలని సూచించారు. ప్రతి నష్టపోయిన రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు.పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి శాఖలు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారి రూట్లపై తాత్కాలిక, శాశ్వత మరమ్మత్తుల అంచనాలను వ్యయ వివరాలతో సహా సమర్పించాలని తెలిపారు. విద్యుత్‌శాఖ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, నీటి పారుదల శాఖ చెరువులు, కాల్వలు, నీటివనరుల నష్టం వివరాలను అందించాలని ఆదేశించారు. అలాగే దెబ్బతిన్న ఇండ్లు, చనిపోయిన పశువులు, పౌల్ట్రీ నష్టం తదితర వివరాలను పక్కాగా సిద్ధం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తులకు అవసరమైన నిధులను పరిశీలించి ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల అవసరాన్ని పక్కా వివరాలతో నివేదించాలని సూచించారు.సమీక్షలో డిఆర్‌ఓ ఎ. పద్మశ్రీ, సిపిఓ ఎ. శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్‌ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్‌ఈ యాకుబ్, పీఆర్ ఎస్‌ఈ వెంకట్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, మార్కెటింగ్ అధికారి అలీమ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సరిత,ఎన్పిడిసిఎల్‌డిఇ రామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో పొంగులేటి..

### కోరంతో పాటు పాల్గొన్న మల్లి బాబు యాదవ్





**ఖమ్మం, నవంబర్ 1(నినాదం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రచారానికి కేవలం 9రోజులు మాత్రమే ఉన్నందున అధికార ప్రతిపక్ష పార్టీల ప్రచారం ఉధృతంగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఖమ్మం జిల్లా నుండి అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అఖిలభారత యాదవ మహాసభ నాయకులు భారీ ఎత్తున పాల్గొని జూబ్లీహిల్స్ రహమత్ నగర్, ఇందిరానగర్ కృష్ణానగర్ యూసఫ్ గూడ ప్రాంతాల్లో, శనివారం ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ జెడ్పిటీసీ, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో అవినీతికి పాల్పడిందని, కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంగా వాడుకుందని, తెలంగాణ సెంటిమెంటును అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువు దోపిడీ చేసి, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, సానుభూతితో ఓట్లు వేయడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదని, స్థానికతకు అభివృద్ధికి ఓటు వేయాలని పొంగులేటి, కోరం ఓటర్లను అభ్యర్థించారు. రాజకీయాలు పార్టీలు వర్గాలకతీతంగా ప్రతి యాదవుడు నవీన్ యాదవ్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మల్లి బాబు యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.కె గౌస్, జానీ బాయ్,బడే సాబ్, బార్ల బాబురావు కొప్పుల శ్రీనివాసరావు, పుట్టా ఉపేందర్, చిన్న వెంకటరమణ, పల్లెబోయిన శ్రీనివాస్, శేఖర్, వరదబోయిన నరసింహారావు ప్రతాప్ సాయి యాదవ్, చిలకల రామకృష్ణ దేగల రాజు చిలకల వెంకటేశ్వర్లు, పద్మా యాదవ్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## రామారావు పార్థివ దేహానికి రామనాథం నివాళులు



**మధిర, నవంబర్ 1 (నినాదం):** మధిర మండలం కృష్ణాపురం గ్రామ వాస్తవ్యులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు టిడిపిసభ్యులు కృష్ణాపురం గ్రామ శాఖ మొట్టమొదటి అధ్యక్షులు (1982 లో) కర్నాటి రామారావు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి తెలుగు దేశం జెండా కప్పి నివాళులు అర్పించి, సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేసిన ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం,సీనియర్ టిడిపి నాయకులు వాసిరెడ్డి ప్రకాశరావు, వట్టి కొండ రామ్మోహన్‌రావు, దేవ భక్తుని వెంకట్ తదితరులు. తన జీవితకాలంలో తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తు ఉంటేనే తప్ప ఓటు వేయని దివంగత రామారావు గురించి గ్రామస్తులు ప్రత్యేకంగా చెప్పుకోవడం విశేషం.

# 3 నుండి కళాశాలలు బంద్

### తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతి పత్రం అందజేసిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్య అసోసియేషన్



**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం):** ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల మనుగడ ప్రశ్నార్థకం అయిందని, డబ్బులు రానిపక్షంలో కళాశాలలు నడపడం కష్టమని కళాశాలల రాష్ట్ర అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 3నుంచి అన్ని కళాశాలలను బంద్ పెడుతున్నామని తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరిని, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గత మూడు సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు రాకపోవడంతో కళాశాల నిర్వహణ కష్టం అయిపోయిందని, జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు.ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు విడుదల అయ్యే వరకు కళాశాలలు తెరిచే ఆస్కారంలేదని అసోసియేషన్ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి,నరాల సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మారయ్య గౌడ్, శంకర్, గురువేందర్ రెడ్డి, సూర్య ప్రకాష్, శ్రీనివాస్, అరుణ్, గిరి,దత్తు,అనిల్, షకీల్, రషీద్, నవీన్, సత్యం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం





**ఖమ్మం, నవంబర్1(నినాదం):** మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉత్త వైద్య శిబిరానికి ప్రజలు భారీగా తరలి వచ్చారు. శనివారం స్వర్గీయ పల్లా జాన్ రాములు జయంతి సందర్భంగా వారి కుమారుడు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో మిషన్ హాస్పిటల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ వైద్య శిబిరానికి సుమారు 1000 మందికి పైగా విచ్చారు, పెద్దలు, నిపుణులైన వైద్యులచే వైద్యం చేయించుకుని ఉచితంగా మందులు అందజేశారు.కార్యక్రమాన్ని పల్లా కిరణ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పెద్దలు ప్రముఖులు ప్రజలు స్వర్గీయ పల్లా జాన్ రాములను స్మరించుకుని నివాళులు అర్పించడం జరిగింది. పల్లా కిరణ్ సేవలను కొనియాడుతూ శాలువా కప్పి సత్కరించారు.

# ఎట్టకేలకు న్యాయం జరిగింది..

### కృషి చేసిన నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు బచ్చలకూరి నాగరాజు





**పాలేరు,అక్టోబర్1(నినాదం):** ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి సమీపంలో 21-9-1998లో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో కొత్తపల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మృతి చెందారు. కేసు కోర్టుకు వెళ్లి కొంతకాలం తర్వాత ఆగిపోయింది.కేసును పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బచ్చలకూరి నాగరాజు బాధితులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో చొరవ తీసుకుని లాయర్‌గా ఆకుల శేఖర్‌ని ఏర్పాటు చేసి కేసును ముందుకు తీసుకెళ్లారు.ఎట్టకేలకు శనివారం మృతుని కుటుంబానికి న్యాయం జరిగింది.కార్మిక సహాయ కమీషనర్ ఖమ్మం కోర్ట్ మృతునికి నష్ట పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. దీంతో బాధితులకు అనుకూలంగా తీర్పు రావడం తో కేసును ముందుకు తీసుకుపోయి తమ కుటుంబానికి న్యాయం జరిగేలా చూసిన బచ్చలకూరి నాగరాజుకి వారు కృతజ్ఞత తెలియజేసారు. కొత్తపల్లి వెంకటేశ్వరరావు భార్య నాగమణి, తల్లి ధర్మమ్మకు 2,81,321 నష్టపరిహారం కార్మిక అధికారి ఏసీ కృష్ణవేణి అందించారు. ఈ కార్యక్రమములో కోరట్లగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కొత్తపల్లి సుబ్బారావు, కోరట్లగూడెం మాజీ సర్పంచ్ షేక్ జహీరాభి, బచ్చలకూరి ఉదయ్ ప్రతాప్, కొత్తపల్లి సాయి పాల్గొన్నారు.

### 3లోగా పోస్ట్ మెట్రిక్ దరఖాస్తుల్లోని

# సమస్యలు పరిష్కరించాలి

### జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జ్యోతి



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 1:(నినాదం):** నవంబర్ 3 లోగా పోస్ట్ మెట్రిక్ దరఖాస్తులలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి జ్యోతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంజిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే ఎస్సీ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికిగాను పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు మంజూరులో తలెత్తుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించ వలసిందిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.ఆధార్ నంబరు బ్యాంకు ఖాతాకు లింక్ లేకపోవడం, కాలేజీలో ఫస్ట్ లెవెల్ వెరిఫికేషన్ పూర్తికాని దరఖాస్తులు ఇంకా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డిజిటల్ కీ ద్వారా ఫార్వర్డ్ చేయని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అన్నారు.సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, అన్ని పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా ఈ పాస్‌పోర్టల్‌లో పూర్తి చేయాలని, ఈప్రక్రియ మొత్తం నవంబర్ 3 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు విద్యార్థులు తమ ప్రస్తుత బ్యాంకుఖాతాలో ఆధార్ సీడింగ్ సమస్యలుఎదుర్కొంటున్నట్లయితే, వారికి పోస్టాఫీస్‌లో కొత్తగా అకౌంట్ ఓపెన్ చేయమని సూచించాలని,పోస్టాఫీస్ అకౌంట్ ఆధార్ లింక్అయిన తర్వాత, ఆ వివరాలు ఈ- పాస్ పోర్టల్‌లో ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అవుతాయని, కాబట్టి విద్యార్థులు వెబ్‌సైట్‌లో స్వయంగా అప్ డేట్ చేయాల్సిన అవసరం లేదని అన్నారు.జిల్లాలోని అన్నికళాశాలల ప్రిన్సిపాల్‌లు పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా జిల్లా కార్యాలయానికి డిజిటల్ కీ ద్వారా సమర్పించాలని, ఈవిషయంలో ఏవైనా నిర్లక్ష్యం, అనాసక్తి లేదా ఆలస్యం జరిగితే, సంబంధిత ప్రిన్సిపాల్ విద్యార్థుల స్కాలర్షిప్ మంజూరులో ఆలస్యం లేదా తిరస్కరణకు వ్యక్తిగతంగాబాధ్యత వహించవలసి ఉంటుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి ప్రకటనలో పేర్కొన్నారు.

### పాఠశాలల్లో కంప్యూటర్ల మరమ్మతు

# పనులకు టెండర్లకు ఆహ్వానం

**ఖమ్మం ప్రతినిధి, (నినాదం):** జిల్లాలోని 84 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్స్ మరమ్మత్తు కొరకు ఆసక్తి గల వారు నవంబర్ 6 లోపు టెండర్లు దాఖలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఉన్న 84 ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్స్ కు మరమ్మత్తులు చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్ మరమ్మత్తుల నిమిత్తం 69 ఉన్నత పాఠశాలలకు 15 వేల రూపాయలు చొప్పున, 15 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 5 వేల చొప్పున మొత్తం 11లక్షల పదివేల రూపాయలు కేటాయించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు.ఆసక్తి గల ఖమ్మం జిల్లాకు చెందిన అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో 4వేలు చెల్లించి దరఖాస్తు తీసుకుని, 50 వేల రూపాయలు జిల్లా కలెక్టర్, చైర్మన్, సమగ్ర శిక్షా, ఖమ్మం పేరిట డీడీ తీసి నవంబర్ 3 నుంచి నవంబర్ 6 సాయంత్రం 5గంటల వరకు టెండర్లు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దాఖలు చేయాలని అన్నారు. గడువు దాటిన పిదప వచ్చిన టెండర్లు, తపాల ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించడం జరగదని అన్నారు. సీల్డ్ కవర్ టెండర్లను నవంబర్ 8న ఉదయం 11.00 గంటలకు అదనపు కలెక్టర్ సమక్షంలో తెరిచి ఫైనల్ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కలెక్టర్, సీపీలతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ భేటీ





**నిజామాబాద్ ప్రతినిధి, (నినాదం):** రాష్ట్ర షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఇతర అధికారులతో భేటీ అయ్యారు. పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డు కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

**కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన చైర్మన్**

బాధిత సీ.సీ.ఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమోద్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణ సందర్భంగా కానిస్టేబుల్ హత్యకు గురి కావడం ఎంతో బాధ కలిగించిందని, బాధిత కుటుంబానికి కమిషన్ అండగా నిలుస్తుందని, పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. చైర్మన్ వెంట ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులు ఉన్నారు.

# ఫోరెన్సిక్ సైన్స్‌పై అవగాహన తప్పనిసరి: జిల్లా న్యాయమూర్తి పి.వసంత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్1(నినాదం):** కోర్టు కేసులలో ఫోరెన్సిక్ సాక్ష్యం అనేది కీలకపాత్ర పోషిస్తుందని,న్యాయవాదులు దానిపై పక్కా అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తి పి. వసంత్ తెలిపారు. శనివారం జిల్లా న్యాయవాదుల లైబ్రరీ హాల్‌లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పి.ఏ) ఆధ్వర్యంలో కోర్టు కేసులలో ఫోరెన్సిక్ సాక్ష్యం ప్రాముఖ్యత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రో-బ్లాక్ డైరెక్టర్ మోహన్ ఎర్రగోళ్ల మాట్లాడుతూ.. భారత సాక్ష్య చట్టంలో ఫోరెన్సిక్ సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ,నేటి రోజుల్లో ఫోరెన్సిక్ పరిశోధనల అవసరం మరింత పెరిగిందని తెలిపారు.న్యాయవాదులు ఈరంగంలో నేర్చుకోవాల్సిన నైపుణ్యాలను ప్రస్తావిస్తూ పాలిగ్రఫీ టెస్ట్,ఫింగర్ ప్రింట్ అనాలసిస్,నార్కో అనాలిసిస్,హ్యాండ్ రైటింగ్ అనాలసిస్,సంతకం ధృవీకరణ వంటి అంశాల్లో పూర్తి సవివరమైన అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు విశిష్ట అతిథులుగా అదనపు జిల్లా జడ్జి ఎస్.సరిత, న్యాయమూర్తులు ఎం. రాజేందర్, కె.కిరణ్‌కుమార్, కె.కవిత, కె.సాయిశ్రీ, సెంకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజమల్లు తదితరులు హాజరయ్యారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐ.ఎల్.పి.ఏ జిల్లా కన్వీనర్లు జె.గోపికృష్ణ, సుంకర భానుప్రియ, సీనియర్ న్యాయవాదులు పోసాని రాధాకృష్ణమూర్తి, జె.శివరామ్ ప్రసాద్, విజయ్ భాస్కర్ రెడ్డి, పి.నాగేశ్వరరావు, గంట వీరభద్రం, కిలారు పురుషోత్తం, గాజుల రామమూర్తి, బి.చిరంజీవి, నల్లమల ప్రతిభ, లక్ష్మి సరిత, కాసాని రమేశ్, సహనజు పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా అడపాల మహాలక్ష్మి, యెర్రా కామేష్, సాధిక్ పాషా, ఎర్రపాటి కృష్ణ, మారపాక రమేష్, అంబటి రమేష్, దొడ్డా సామంత్, మేకల దేవేందర్, పాల రాజశేఖర్, పగిడిపల్లి శ్రీకాంత్,వడ్లకొండ హరిప్రసాద్,ఇందిరా ప్రియదర్శిని,బేబీ షామిలి, దారావత్ రాధాకృష్ణ,యాస యుగేందర్ తదితర న్యాయవాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

### శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో

# ఎల్లో కలర్ డే సెలబ్రేషన్స్



**మధిర, నవంబర్ 1 (నినాదం):** మధిర మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్లో శనివారం ఎల్లో కలర్ డేనీ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పసుపు రంగు దుస్తులు వేసుకొని పసుపురంగు విశిష్టతను తెలిపారు. ఎల్లో కలర్ అనేది. ఆశయం, సానుకూలత, ఆనందం, స్ఫూర్తి, ధైర్యం, ఉజ్వల భవిష్యత్తుకు సంకేతం. విద్యార్థులు పసుపు రంగుకు సంబంధించిన పాటలు, నృత్యాలు నిర్వహించి రంగు ప్రాముఖ్యతను ప్రతిపాదించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో సానుకూల భావాలు, సృజనాత్మకత పెంపొందించడంలో పసుపురంగుపాత్రను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ బి అంజన్ బాబు, డైరెక్టర్ చందు, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్లో కలర్ డే విద్యార్థుల్లో ధైర్యం, ఉత్సాహం నింపుతూ సమాజంలో సానుకూల మార్పులకు ప్రేరణ ఇస్తుందని ఈ కార్యక్రమం ప్రకటించింది. ఈ పవిత్ర రంగు పాఠశాల వాతావరణం ప్రకాశవంతం చేసేదిగా విద్యార్థుల్లో ఆశయస్ఫూర్తి నింపేదిగా నిర్వహణను అభినందించారు.

# ఫకీరాబాద్ శివారులో మహిళ దారుణ హత్య

### ఘటన స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ సాయి చైతన్య



**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం) :** నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం ఫకీరాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై అత్యాచారం చేసి హత్య చేశారు. శనివారం ఉదయం నవీపేట్ మండలంలోని ఫకీరాబాద్ నుంచి మిట్టాపూర్ వెళ్లే దారిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా నవీపేట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకోవడంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిర్మానుష్య ప్రాంతానికి మహిళను దారుణంగా హత్య చేశారు. ఆమె ఒంటిపై ఎలాంటి వస్త్రాలు లేకపోవడంతో అఘాయిత్యం చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అతి కిరాతకంగా తలను మొండెం నుంచి వేరు చేసి హత్య చేయడం, అంతేకాకుండా చేతిని మణికట్టు వరకు నరికివేయడంతో హంతకులు పకడ్బందీగానే హత్య చేశారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలాన్ని సీపీ సాయి చైతన్య , ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, నార్త్ సిఐ శ్రీనివాస్ లు పరిశీలించారు. మహిళ ఆచూకి తెలిస్తే కానీ కేసు కొలిక్కి రాదని గుర్తించి పది టీంలను ఏర్పాటు చేసి నిజామాబాద్, బోధన్, భైంసా, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో పోస్టర్లను వేసి వెతికిస్తున్నారు. మహిళ ఆచూకి కోసం ఘటన స్థలం వద్ద ఉన్న ఆనవాళ్ళపై డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలు చేశారు. డాగ్ స్క్వాడ్ ను రప్పించి ఘటన స్థలంలో పరిశీలన జరిపారు. శుక్రవారం రాత్రి నుంచి ఫకీరాబాద్ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# శబరిమల మహా పాదయాత్ర ప్రారంభం



**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం) :** ఇందూరు నుండి కేరళలోని పవిత్రమైన శబరిమల అయ్యప్ప ఆలయం వరకు సుమారు 1500 కి.మీ. మహా పాద యాత్రను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ శని వారం జెండా ఊపిప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తి, నియమ నిష్టలు మన భారతీయ సంస్కృతికి ఆధ్యాత్మిక పునాది. నిజామాబాద్ నుండి కేరళ వరకు జరుగుతున్న మహా పాదయాత్ర అనేది కేవలం భౌతిక ప్రయాణం మాత్రమే కాదు.. అది ఆంతరిక సాధన, ఆత్మీయ మార్గం. ఇలాంటి పాదయాత్రలు యువతలో ధార్మిక చైతన్యాన్ని, నియమశీలతను పెంపొందించడంతో పాటు, సమాజంలో ఐక్యతను బలపరుస్తాయని తెలిపారు. ఈ మహా పాదయాత్రలో పురంశెట్టి నంద కిషోర్, నూరు రాజేందర్, వేణు, సాయిరెడ్డి, సుధాకర్, దీపక్, గంగా ప్రసాద్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా వనమా జన్మదిన వేడుకలు





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్1 (నినాదం):** మాజీ మంత్రి, కొత్తగూడెం టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వనమా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు వైభవంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానుల ఆధ్వర్యంలో జరిగాయి. శనివారం ఆయన జన్మదినం పురస్కరించుకొని తన స్వగ్రామం పాత పాల్వంచలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి, స్వామివారి అనుగ్రహం పొంది, వేదపండితులు ఆశీర్వాదాన్ని అందజేశారు. కొత్తగూడెం నియోజకవర్గం వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వనమాకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పాత పాల్వంచలోని ఆయన స్వగృహంలో వనమా పుట్టినరోజు సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ వార్డులో, గ్రామాల్లో స్వచ్ఛందంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేకులు కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాత పాల్వంచ లోని మాజీ మంత్రి వనమా ఇంటికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి,పూలమాలలు, బొకేలు అందించి శాలువాలతో వనమా దంపతులను సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. తమ నాయకుడి శుభాకాంక్షలు చెప్పిన ప్రతి ఒక్కరు సంతోషాల్లో మునిగిపోయారు. మాజీ మంత్రి వనమా కుటుంబ సభ్యులు సంతోషసాగరంలో మునిగిపోయారు. వనమా మాట్లాడుతూ టిఆర్ఎస్అధినేత, తెలంగాణ జాతిపిత కెసిఆర్ ఆశీస్సులతో, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో కొత్తగూడెం నియోజకవర్గంలో బిఆర్ఎస్‌ను బలోపేతం చేయడానికి తనవంతు నిరంతరంపాటు పడతానని పేర్కొన్నారు. అలాగే కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటానని పుట్టినరోజు సందర్భంగా మరోసారి పునరుద్ఘాటించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్‌చేసి,సామాజిక సేవాకార్యక్రమాలునిర్వహించి, బాణాసంచా కాల్చి వనమా జన్మదిన వేడుకలను పార్టీక్యాడర్,అభిమానులు ఘనంగా నిర్వహించారు.

# సీఎం దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి నేతలు.. అరెస్ట్



**మణుగూరు,నవంబర్1 (నినాదం):** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న బిజెపీ నేతలు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో అంబేద్కర్ విగ్రహం సెంటర్లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బిజెపి నాయకులు శనివారం దగ్ధం చేశారు. దేశ ప్రధానమంత్రి హోదాను మర్చిపోయిన సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా మోడీపై ఆరోపణలు చేయటం చట్ట విరుద్ధమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుటిల రాజకీయాలపై నరేంద్ర మోడీ ప్రజలకు విపులంగా తెలియజేయడమే నేరమా అనివారు నిలదీశారు. రోజుకుఒక మాట పూటకోక వేషం వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల బండారాన్ని బయటపెడుతున్న నరేంద్ర మోడీపై సీఎం హోదాలో అనుచితవాక్యాలు చేయడం నిరసిస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్నట్టు వారు ప్రకటించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సిఐ నాగబాబు ఎస్ఐలు బిజెపి నాయకులను అడ్డుకొని వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీస్ స్టేషన్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు వారిని బలవంతంగా పోలీస్ స్టేషన్ తరలించి అరెస్టు చేశారు.

# వైకాపా ఓ పెద్ద ఫేక్ పార్టీ

**వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా**

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో చంద్రబాబు**






**సత్యసాయి, నవంబర్1(నినాదం):** వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీకి ఏమీ దొరకటం లేదని.. వారి జీవితమే ఫేక్ అని ఎద్దేవా చేశారు. శనివారం సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డిని గొడ్డలితో చంపి తనపై నెట్టేశారని ఫైర్ అయ్యారు సీఎం చంద్రబాబు. సాక్షిలో గుండెపోటు అని వేస్తే తాను నమ్మేశానని.. తానెప్పుడూ రాగద్వేషాలతో పనిచేయనని స్పష్టం చేశారు. ఓ సర్కిల్ ఇన్స్పెక్టర్‌ను దగ్గర పెట్టుకుని రక్తం పడిన గదిని కడిగేశారని... ఆధారాలు చెరిపేశారని విమర్శించారు. వివేకా కుమార్తె ఫిర్యాదు చేసిన తర్వాత అప్పుడు గొడ్డలి పోటని ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. వివేకా హత్య ఘటనలో ఏమరుపాటుకు గురయ్యామని చెప్పుకొచ్చారు. కోడికత్తి డ్రామా, గులకరాయి డ్రామాలు ఆడారని విమర్శించారు. అలాంటి వాళ్లకు రాజకీయాలు చేసేందుకు అర్హత ఉందా..? అసలు వారికి పార్టీగా ఉండే అర్హత ఉందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజల ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని అనుకుంటే ఎంతటి వారినైనా ఢీ కొంటానని స్పష్టం చేశారు. రాయలసీమ ఫ్యాక్షన్‌ను, హైదరాబాద్‌లో మత విద్వేషాలు, నక్సల్స్ సమస్యను అణచివేశానని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు. అందుకే నక్సల్స్ అలిపిరిలో తనపై క్లైమోర్‌మైన్స్ పేల్చారని చెప్పుకొచ్చారు. నేరస్తులే రాజకీయ పార్టీ పెట్టి రాజకీయం అంటుంటే నేరాలు చేస్తూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్నూల్‌లో బస్సు దగ్ధం ఘటన జరిగితే అందులోనూ ఫేక్ ప్రచారాలకు తెరదీశారని ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ఒడిశాలో బస్సు రిజిస్ట్రేషన్ చేసి హైదరాబాద్ నుంచి బెంగళూరు మధ్య నడుపుతున్నారని తెలిపారు. ఏపీలో ప్రమాదం జరిగితే దానిపై కూడా ఫేక్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి ఫేక్ వ్యక్తులు దుష్ప్రచారం చేస్తుంటే ప్రతీ రోజూ ఇది చెప్పుకోవాలా..? అని ఆగ్రహించారు. వైసీపీకి ఓ పాంప్లెట్ ఉందని... ఓ ఛానల్ కూడా ఉందని... కానీ ఆ వ్యక్తులు బయటకు వచ్చి తమకు ఛానల్ లేదని, పేపర్ లేదని ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ అంశంపైనా కేంద్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ రాస్తానని చెప్పుకొచ్చారు. పేపర్, ఛానల్ ద్వారా శవరాజకీయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఓ ఘటనలో కమ్మ కాపు మధ్య కుల విద్వేషాలు రగిల్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. వాళ్ళ నిర్లక్ష్యానికి చాలు దుష్ప్రచారానికి తెగబడుతూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతీ రోజూ తమ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఫైర్ అయ్యారు. ఇక ఏమాత్రం ఉపేక్షించబోమని... అడుగడుగునా సీసీ కెమెరాలు, ఆధారాలు ఉన్నాయని... అన్నింటినీ బయటపెడతామని హెచ్చరించారు. అమాయకులను మోసం చేస్తూ కులం, మతం, ప్రాంతం పేరుతో జగన్ అండ్ కో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ముందస్తు ప్రణాళికతో ఆస్తి, ప్రాణనష్టం నివారించాం

**ఉత్తమ సేవలు అందించిన వారిని అభినందించిన సిఎం చంద్రబాబు**



**అమరావతి, నవంబర్1(నినాదం):** మొంథా తుపాను కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చేశామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. మొంథా తుపానులో ఉత్తమ సేవలందించిన వారి కోసం సీఎం క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. పలువురిని సైక్లోన్ మొంథా ÷టైర్లుగా గౌరవిస్తూ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'తుపానుపై సమాచారాన్ని ముందుగానే ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించాం. పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని డ్రోన్ ద్వారా గుర్తించి కాపాడాం. ప్రార్థనా మందిరం చుట్టూ వరద నీరు వస్తే 15 మందిని కాపాడాం. వరద నీటిని తొలగించే పనులు వేగంగా జరిగాయి. సాంకేతికతతో పాటు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సహకరించారు. రాష్ట్రానికి రెండు సమస్యలు.. రాయలసీమ కరవు, కోస్తాంధ్రకు తుపాన్లు. సమర్థ నీటి నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణంతో రాయలసీమలో కరవు లేకుండా చేశాం. ఈసారి మొంథా తుపానుపై అధికారులతో బృందం సిద్ధం చేశాం. వారికి సాంకేతిక సపోర్టు ఇచ్చాం. అద్భుతంగా పనిచేశారు. పరిస్థితిని సమీక్షించి రియల్ టైమ్‌లోనే హెచ్చరికలు పంపాం. వర్ష ప్రభావం, గాలుల తీవ్రతను టెక్నాలజీతో పర్యవేక్షించాం. ముందస్తు జాగ్రత్తలు, హెచ్చరికలు పంపి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూశాం' అని తెలిపారు.

## కాశీబుగ్గ ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి



**న్యూఢిల్లీ, నవంబర్1(నినాదం):** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నాడు తొక్కిసలాట జరిగి 10 మంది మృతిచెందడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరం. కుటుంబసభ్యులను కోల్పోయిన వారి గురించే నా ఆలోచనంతా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. మృతులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ.2లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున పరిహారం అందజేస్తామని పీఎంఓ కార్యాలయం ప్రకటించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాగా, తొక్కిసలాటలో పలువురు గాయపడటం, వీరిలో కొందరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

## ఎన్‌టీఆర్ భరోసాతో.. పేదలకు సామాజిక భద్రత

**జిల్లాలో 2,29,393 మంది లబిద్దారులకు రూ. 99.43 కోట్లు**

**పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, నవంబర్1 (నినాదం):** పేదలు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు దోహదం చేస్తున్నాయని.. జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎన్‌టీర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ అర్బన్ పరిధిలోని ఖుద్దూస్ నగర్ – కేదారేశ్వరపేట ప్రాంతంలో అధికారులతో కలిసి లబ్దిదారులకు సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. లబ్దిదారులతో స్వయంగా మాట్లాడి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్దిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు కూడా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్ల ద్వారా 2,29,393 మంది లబిద్దారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబంధించి రూ. 99 కోట్ల 43 లక్షల మొత్తాన్ని లబ్దిదారులకు అందజేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. లెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తొక్కిసలాట ఘటనపై పవన్ దిగ్భ్రాంతి

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**



**అమరావతి, నవంబర్1(నినాదం):** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం దగ్గర చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలచివేసిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. కార్తీక మాసంలోని ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న క్రమంలో తొక్కిసలాట జరగడంతో తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను.. ఈ విషాదకర ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశాం.. సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి ప్రభుత్వం దిశానిర్దేశర చేసింది.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చారు. ఇక, ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న ఈ ఆలయంలో చోటు చేసుకున్న విషాదకర ఘటనపై విచారణ చేపడుతామని పవన్ కళ్యాణ్ తెలిపారు. కార్తీక మాసంలో రాష్ట్రంలోని శైవ క్షేత్రాలతోపాటు, ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.. క్యూ లైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచిస్తున్నాను.. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.. ఆలయ ప్రాంగణాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలి.. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనాకు వచ్చినప్పుడు పోలీసు బందోబస్తుతో పాటు మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు.

## తొక్కిసలాట ఘటన కూటమి ప్రభుత్వ వైఫల్యమే

**మాజీ సీఎం వైఎస్ జగన్**



**అమరావతి, నవంబర్1(నినాదం):** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటనపై మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ దుర్ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విచారకరం.. మీడియాలో సమాచారం మేరకు 10 మంది వరకు మరణించారని తెలుస్తోంది.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలి.. సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని మా పార్టీకి చెందిన నాయకులను ఆదేశించాను.. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించారు.. అలాగే, సింహాచలంలో జరిగిన దుర్ఘటనలో మరో ఏడుగురు మరణించారు.. ఇప్పుడు కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట కారణంగా ఇప్పటి వరకూ 10 మంది మరణించారని మీడియా ద్వారా సమాచారం వస్తోంది అని జగన్ అన్నారు. ఇక, ఈ 18 నెలల కాలంలో వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నది అర్థం అవుతోంది అని మాజీ సీఎం జగన్ పేర్కొన్నారు. పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ భక్తుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు.. చంద్రబాబు అసమర్థ పాలనకు నిదర్శనం ఇది అని విమర్శించారు. ఇకనైనా కళ్లుతెరిచి తప్పులను సరిదిద్దుకోవాలని తెలిపారు.

## శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఘోరం

**స్థానిక వేంకటేశ్వరాలయంలో తొక్కిసలాట**

**ఏకాదశితో భారీగా తరలివచ్చిన భక్తులు**

**9మంది మృతి, పలువురికి గాయాలు**

**క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స**

**ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి**

**వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు**

**కాశీబుగ్గకు చేరుకున్న మంత్రి అచ్చన్నాయుడు**



**శ్రీకాకుళం, నవంబర్1(నినాదం):** శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతుంది. పోలీసులు సంఘటన జరిగిన ఆలయానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈరోజు కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయివడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించానని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్‌పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

## కృత్రిమ మేథ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు

**మానవమేధస్సుకు అది సరితూగేది కానేకాదు**

**సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత ప్రచారం తగదు**

**రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న న్యాయమూర్తులు**

**అమరావతి రాజధాని రైతుల పోరాటం అద్వితీయం**

**విట్ స్నాతకోత్సవంలో విశ్రాంత జస్టిస్ ఎన్‌వి రమణ**




**అమరావతి, నవంబర్1(నినాదం):** కృత్రిమ మేధ వంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న విద్వేషపూరిత ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడే క్రమంలో న్యాయమూర్తులు ఒత్తిళ్లు, వేధింపులు ఎదుర్కొన్నారని... కొందరు బదిలీ అయ్యారని, సంబంధం లేకపోయినా రాజకీయ కుట్రలకు బలయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. బాధ్యతగా పని చేయటం కూడా కొన్నిసార్లు వ్యక్తిగతమైన బాధగా మిగిలిపోతుందన్నారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేసిన రైతులకు న్యాయం చేసే క్రమంలో న్యాయమూర్తులు కూడా ఇబ్బందులకు గురయ్యారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అలాంటి క్లిష్ట సందర్భాల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులు రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేశారని గుర్తు చేశారు. అమరావతిలోని విట్ యూనివర్సిటీ ఐదో స్నాతకోత్సవంలో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ .. యూనివర్సిటీలో చదివి ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేధ వంటి సాంకేతికత మనుషులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాబోదని అభిప్రాయపడ్డారు. ఎంఐటీ తాజా అధ్యయనం ప్రకారం, జనరేటివ్ ఏఐను తమ వ్యాపారాల్లో ప్రవేశపెట్టిన సంస్థల్లో 95 శాతం విఫలమయ్యాయని.. 5 శాతం సంస్థలు మాత్రమే ఆదాయం పెంచుకున్నాయని తెలిపారు. కృత్రిమ మేధస్సు అనేది మానవ మేధస్సుకు ఒక సాధనం మాత్రమేనని స్పష్టం చేశారు. పూర్తిగా ఏఐ మీద ఆధారపడితే మానవ ఆలోచనా శక్తిని కోల్పోతామ్నారు. కృత్రిమ మేధస్సును భావోద్వేగాలతో సమతుల్యం చేయకుంటే మానవ జీవితం, గౌరవం కూడా వస్తువులా మారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇక రాజధాని అమరావతి గురించి మాట్లాడుతూ..కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి ప్రాంతమంతా తనకు పరిచయమేనని.. దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో కృష్ణా నదిలో ఉన్న దీవుల్లో రహస్య సమావేశాలు నిర్వహించిన విషయం గుర్తు చేసుకున్నారు. ఈ గడ్డ తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, ఎన్నో పాఠాలు నేర్పిందని... ఇక్కడి ప్రజల నుంచి ఎప్పుడూ స్ఫూర్తి పొందుతానని తెలిపారు. రాజధానిని నిలబెట్టుకోవటం కోసం ఈ ప్రాంత రైతులు చేసిన పోరాటాన్ని జస్టిస్ రమణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారసత్వంగా వచ్చిన భూమిని రాజధాని కోసం త్యాగం చేసిన రైతులు... అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రో÷-డడెక్కారని, పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అమరావతి వీధుల్లో జరిగిన ఉద్యమం స్వాతంత్ర్యం తర్వాత దక్షిణ భారతదేశంలో జరిగిన అతి పెద్ద, సుదీర్ఘ పోరాటమని అభివర్ణించారు. ప్రభుత్వ యంత్రాంగాల నుంచి ఒత్తిళ్లు వచ్చినా ఓర్పు, సహనం, నిబద్ధతతో వెనుకడుగు వేయని అమరావతి రైతుల ధైర్యానికి వందనం చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంచిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పాలన అనేది నిరంతర ప్రక్రియ అని, అధికారం మారినప్పుడు విధానాల్ని మార్చటం తప్పని జస్టిస్ రమణ స్పష్టం చేశారు. అలా చేస్తే వృద్ధి ఆగిపోవటంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. అధికార వ్యవస్థను ప్రతీకార రాజకీయాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. దేశంలో న్యాయపాలన ఉన్నప్పుడు మాత్రమే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపైనా జస్టిస్ రమణ మాట్లాడారు. విట్ వంటి సంస్థలు కూడా గత ఐదేళ్లు ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాయని తెలిపారు. నేటి సమాచార యుగంలో సైతం ఖచ్చితమైన సమాచారం పొందడం కష్టంగా మారిందని వ్యాఖ్యానించారు. వార్తల వక్రీకరణ, పార్టీలకు అనుగుణంగా పనిచేసే మీడియా ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. స్వేచ్ఛ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రతి అంశాన్ని ట్రోల్ చేయటం, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయటం, మానసిక వేదనకు గురిచేయటం సరికాదన్నారు. సమాచార సృష్టి పేరుతో అత్యల్ప స్థాయికి దిగజారిపోయామని ఆవేదన వెలిబుచ్చారు. సోషల్ మీడియాకు బానిసలైన వారు డిజిటల్ ప్రపంచం నుంచి బయటకు రాలేకపోతున్నారన్నారు. కంటెంట్ నిజస్వరూపం ఇప్పుడు సమస్యగా మారిందని... ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేయటం, డీప్ ఫేక్ వంటి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో బాధితులకు సాయం చేసే సమర్థమైన న్యాయ యంత్రాంగం లేదని, ఆన్ లైన్‌ను నియంత్రించటం కష్టమైందన్నారు.



## దేశ బలోపేతానికి యువతదే బాధ్యత

**వేమన వర్సిటీ విద్యార్థులతో వెంకయ్యనాయుడు**

**కడప, నవంబర్1(నినాదం):** నేటి యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూనివర్సిటీ విద్యార్థులతో ముచ్చటించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దేశం బలోపేతం కావాలంటే, యువత తమలో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవడం అత్యవసరమని చెప్పారు. మన మహనీయులు, ముఖ్యంగా నవభారత నిర్మాత సర్దార్ పటేల్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత తమ వ్యక్తిత్వాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి, యోగి వేమన బోధనలు మార్గదర్శకాలని పేర్కొన్నారు. సరళమైన పదాలతో పద్యాల ద్వారా ఆయన బోధించిన జీవిత సత్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తి త్వం రూపుదిద్దుకుంటుందని దిశానిర్దేశర చేశారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాగా ఇవాళ ఆయన కడపకు చేరుకున్నారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ జేసీ అదితి సింగ్, అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు.

## ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

**13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహణ**

**ఉత్సవాల నిర్వహణకు మంత్రులతో కమిటీ : సిఎం చంద్రబాబు వెల్లడి**

**సత్యసాయి జిల్లా, నవంబర్1(నినాదం):** సత్యసాయి శతజయంతి ఉత్సవాలని ఘనంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు. సత్యసాయి బాబా అనంతపురం జిల్లాకు నీటి సరఫరా విషయంలో తన దగ్గర మాట తీసుకున్నారని గుర్తుచేశారు. ఎల్ అండ్ టీ ద్వారా తాను గతంలో ఆ పనులు చేయించానని... కానీ ఆ తర్వాత వచ్చిన పాలకులు ఆ పనులని ఎందుకు నిలిపేశారని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఈ నెల13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ వైభవంగా నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని ప్రకటించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్‌లతో ఓ కమిటీ వేశామని తెలిపారు. సత్యసాయి ట్రస్టుతో కలిసి మంత్రుల కమిటీ శతజయంతి ఉత్సవాలను పర్యవేక్షిస్తుందని చెప్పుకొచ్చారు. ఓ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. అభివృద్ధి అజెండాతో పనిచేస్తున్న బీజేపీ.. గుజరాత్ రాష్ట్రంలో గడచిన 25 ఏళ్లుగా అధికారంలో ఉందని నొక్కిచెప్పారు సీఎం చంద్రబాబు. ఏపీలో ఏ వ్యక్తి తప్పు చేసినా ప్రభుత్వ నిఘా నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అత్యాచారాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ(శనివారం) సత్యసాయి జిల్లాలోని పెద్దన్నవారి పల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పేదలసేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. చిత్తూరు మాజీ మేయర్ దంపతుల హత్య కేసులో నిన్ననే కోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ కేసులో ఐదుగురికి ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు సీఎం చంద్రబాబు. న్యాయం జరగడానికి ఆలస్యం అయినా.. తప్పు చేసిన వారు తప్పించు కోలేరనడానికి ఈ తీర్పు అతిపెద్ద ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. అతి దారుణంగా మేయర్ కార్యాలయంలోనే ఆ దంపతుల్ని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో తాము అభివృద్ధి చేసిన వాటిని గత పాలకులు విధ్వంసం చేశారని ÷ర్ అయ్యారు. ఇప్పుడు మళ్లీ వచ్చి వాటినే మొదలు పెట్టాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. అభివృద్ధి చేసిన పనులని విధ్వంసం చేస్తే.. మళ్లీ వాటినే పునరుద్ధరించటం చాలా కష్టతరం అవుతుందని వెల్లడించారు. ప్రజలంతా ఆలోచించి తమ ప్రభుత్వానికి సహకరిస్తేనే శాశ్వతంగా మంచి జరుగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## తుఫాన్ బాధితులను గాలికి వదిలేస్తే ఎలా?



చెరువులు, నాలుల కబ్జాకు గురవుతున్నాయని స్వయంగా ప్రకటస్తున్న పాలకులు అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకోవడం లేదు. కబ్జాకోరులను ప్రభుత్వాలే రక్షిస్తూ గడుసు మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాలు తలచుకుంటే కబ్జారాయుళ్లను తొలగించడం నిముషంలో పని. హైడ్రా చేస్తున్న పనిని అంతటా చేయించే బాధ్యత ఉందా లేదా అన్నది సిఎం రేవంత్ రెడ్డి ఆలోచించాలి. వరంగల్ జిల్లాలో వరదనష్టం సందర్భంగా కబ్జాలపై వ్యాఖ్యలు చేసిన సిఎం, అందుకు తగ్గట్లుగా ప్రణ్నాళిక సిద్ధం చేసి చిత్తశుద్ధిని చాటాలి. ఉత్పాతాలు జరిగినప్పుడు తూతూ మంత్రంగా సాయం ప్రకటించడం, అందరినీ ఆదుకున్నామని చెప్పడంతో సరిపెట్టేస్తున్నారు. ఇల్లు మునిగిని వారికి 15 వేలు పరిహారంగా తెలంగాణ సిఎం ప్రకటించారు. ఈ డబ్బుతో ఏం వస్తుందో అధికారులు, సిఎం రేవంత్ రెడ్డి చెబితే బాగుండేది. దెబ్బతిన్న ఇళ్లను, రైతులను ఆదుకునేందుకు కార్యాచరణ ప్రకటించడం లేదు. ఆక్రమణలను తొలగించాలన్న దానికి కూడా ప్రణాళిక లేదు. అలాగే ఎపిలో తుపాన్‌లో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు సర్టిఫికెట్లు ఇచ్చారు. అధికారులు పనిచేయడం వారి విధి. జీతాలు తీసుకుంటున్నారు. అయినా వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిందే. ఇదే సమయంలో గ్రామాల వారీగా నష్టపోయిన వారి లెక్కలు తీసుకుని ఆదుకుంటే బాగుంటుంది. ఎందుకంటే తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు సామాన్యుల జీవితాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. వీరిని ఆదుకోవాలి. ఆదుకునే వరకు మనమంతా సంఘటితంగా ముందుకు సాగాలి. ప్రకృతి విపత్తులు చోటుచేసు కున్నప్పుడు బాధితులను అన్ని విధాల ఆదుకోవడమే అత్యంత ముఖ్యం. తుఫాన్ గండం గడిచింది కనుక గ్రామాల వారీగా తెలుగు రాష్ట్రాల్లో బాధితులను గుర్తించి వారిని ఆదుకోవాలి. పంటలను ఎంతమేరకు నష్టపోయారో లెక్కలు వేయాలి. ఎకరా పంటకు ఎంతపెట్టుబడి పెట్టారో గుర్తించాలి. అన్నదాతల విషయంలో అలసత్వం తగదు. తాజా మొంథా తుపాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తాతో పాటు తెలంగాణ జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా బాగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. అలాగే మత్స్యకారులు తుపాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతి న్నాయి. కొన్ని చోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయి నట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు. బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేసి ఆదుకో వడంలో కేంద్రం ఉదారంగా ముందుకు రావాలి. పంటనష్టపో యిన రైతులను పెద్ద మనసుతో ఆదుకోవాలి.గతంలో పెనుతు పానులు, వరదలు వచ్చినప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాయం కోసం ఏళ్లతరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. ఈసారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ముందుగానే అంచనా వేసినట్లుగానే మొంథా అల్లకల్లోలం సృష్టించింది. ప్రత్యేకించి కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్టు, తుపాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశర చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. అయితే ఇదే చొరవతో ఇప్పుడు బాధితుల కన్నీళ్లు తుడవాలి. సామాన్యుల నుంచి రైతుల వరకు అనేకులు తీవ్రంగా నష్టపోయారు. వారిని గుర్తించి ఆదుకోవడం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

ఎడిటోరియల్

# దారిద్ర్యరహిత రాష్ట్రంగా కేరళ

అత్యంత దుర్భర పేదరిక నిర్మూలన
వివిధ కార్యాక్రమాల ద్వారా దీనిని సాధించాం
కేరళ అవరణ దినోత్సవం సందర్భంగా సిఎం ప్రకటన
అసెంబ్లీలో విజయన్ ప్రకటన...
నిరసనగా విపక్షం వాకౌట్

తిరువనంతపురం,(నినాదం): దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ అవతరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో ప్రకటించారు. దేశంలో అత్యంత దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిందన్నారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 21,263 మందికి మొదటిసారిగా రేషన్ కార్డులు, ఆధార్, పెన్షన్లు వంటి ముఖ్యమైన పత్రాలు మంజూరు చేసిందని తెలిపారు. 4,394 కుటుంబాలకు జీవనోపాధి ప్రాజెక్టుల ద్వారా పని కల్పించామన్నారు. ప్రజలందరికీ సమాన హక్కులు నివాసం, విద్య, వైద్యం అందుతున్నట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రం అత్యంత దుర్భర పేదరికం నుంచిబయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగాకాంగ్రెస్ నేతృత్వం లోని ప్రతిపక్షాలు పినరయి విజయన్ ప్రకటనను తప్పుబట్టాయి. ప్రభుత్వం తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించాయి. ప్రతిపక్ష నేత సతీశన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన భారీ మోసం అని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. నవంబర్ 1న కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం శాసన సభలో ఆరాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఓ చారిత్రాత్మక ప్రకటన చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300నిబంధన కింద కేరళను తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఈసందర్భంగా విజయన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'ఒక శతాబ్దం క్రితం జరిగిన జాతీయోద్యమం నుంచి పుట్టుకొచ్చిన ఆలోచన నుండే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో.. దానిని సాధించడానికి దీర్ఘమైన, తీవ్రమైన పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాల ఫలితమే ఐక్య కేరళ ఏర్పడింది. మల యాళీల కల సాకారమైంది. ఐక్యకేరళ ఆవిర్భవించి నేటికి 69 సంవత్సరాలు. కానీ ఈ సంవత్సరం కేరళ అవతరణ దినోత్సవం కేరళ ప్రజలకు, ఒక నవ యుగానికి ప్రారంభం లాంటిది. కేరళనుభారతదేశంలోనే మొట్టమొదటి తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా మార్చడంలో మనం విజయం సాధించాము. ఈరోజు జరుపుకునే అవతరణోత్సవం ఓచారిత్రాత్మకం. చరిత్రలో ఒక స్థానాన్ని ఏర్పర్చుకుందని అన్నారు. శాసనసభ అనేక చారిత్రాత్మక చట్టాలు, విధాన ప్రకటనలకు సాక్ష్యంగా నిలిచింది. నవ కేరళ సృష్టిలో మరో మైలురాయిని గుర్తించే సమయంలో అసెంబ్లీ ఇప్పుడు సమావేశమైంది. 2021లో కొత్త మంత్రి త్వశాఖ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో తీవ్ర పేదరికన నిర్మూలన ఒకటి. శాసనసభ ఎన్నికల సమయంలో.. ప్రజలకు ఇచ్చిన అతి ముఖ్యమైన వాగ్దానాలలో ఒకదాన్ని నెరవేర్చడానికి ఇది నాంది కూడా. స్థానిక స్వపరిపాలన శాఖ నాయకత్వంలో, కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో కేవలం రెండు నెలల్లో తీవ్ర పేదరికంలో నివశిస్తున్న కుటుంబాలను గుర్తించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రయత్నంలో ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు,కుటుంబశ్రీకార్మికులు, స్వచ్ఛంద సేవకులు, అధికారులు సహా ఇతరులు కూడాభాగస్వాములయ్యారు. ఈపక్రియలో ప్రజాభాగస్వామ్యం కనిపించింది. మొదటగా వడక్కంచెరి మునిసిపాలిటి, అంచుతెంగు, తిరునెల్లి గ్రామ పంచయతీలలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ఆతరువాత రాష్ట్రం మొత్తానికి విస్తరించాం. సమాజంలో అన్నివర్గాల నుండి తీసుకున్న సమిష్టి అభిప్రా యాలు, సూచనల ద్వారా లబ్దిదా రుల కుటుంబాలను గుర్తించిచారిత్రాత్మక ప్రాజెక్టును ప్రారంభించాం అని విజయన్ అసెంబ్లీలో అన్నారు. అయితే తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను సిఎం ప్రకటిం చడంపై ప్రతిపక్షాలు విమర్శించాయి. ఆరాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు ఇది మోసం అని మండిపడ్డారు. ప్రతిపక్షసభ్యుల ఆరోపణలపై సిఎం విజయన్ స్పందించారు. ప్రతిపక్షనేత వ్యాఖ్యలు అప్రస్తుతమని విజయన్ తోసిపుచ్చారు. దీనిపై ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో అర్థంకావడం లేదన్నారు. ఇది ఒకచారిత్రాత్మకమైన ప్రకటన. ప్రపంచానికి తెలియజేయ డానికి అసెంబ్లీలో ప్రకటించాం. ప్రతిపక్షనేత వి.డిసతీశన్ దానిని మోసం అనే అంటారు. ఎందుకంటే అది అతనికి అలవాటు అని సిఎం అన్నారు.ఈ సందర్భంగా ఈ ప్రభుత్వం తాను నెరవేర్చగల వాగ్దానా లను మాత్రమే చేస్తుంది. చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తుంది.ఇప్పుడు ఇప్పటికే సాధిం చిన వాటిని నిలబె ట్టుకోవడానికి చర్యలు తీసుకుంటాము అనివిజయన్ పేర్కొన్నారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు.. చారి త్రాత్మక ప్రకటన చేసినరో జున.. నేడుప్రతి పక్షాలు అసెంబ్లీని బహిష్కరించడాన్ని పార్లమెంటు వ్యవహారాల మంత్రి ఎం.బి రాజేష్ విమర్శించారు. ఇదిచరిత్రలో నిలిచిపో తుంది. చరిత్రప్రతిపక్షాన్ని దోషులుగా ప్రకటిస్తుంది అని అన్నారు.



# ఐదవ షెడ్యూల్ రక్షణకు పెనుసవాలు!?

## ఆదివాసీల అస్తిత్వంపై కార్పొరేట్ దండయాత్ర

పాండవులు, శ్రీరాముడు వంటి పురాణ పురుషులు తమ అరణ్యవాసాన్ని ధర్మచరణ ఆచార్యంగా ఎంచుకున్న పవిత్ర భూమి ఈ అరణ్యాలు. వేల సంవత్సరాల చరిత్ర గల ఈ దండకారణ్యం, కేవలం ఆశ్రయం పొందిన ప్రదేశంగానే కాక, ధర్మాన్ని, ప్రకృతిని అనుసరించి జీవించే విధానానికి ప్రతీకగా నిలిచింది. కానీ, భారతదేశంలోని అడవి ప్రాంతాలు, ప్రత్యేకించి రాజ్యాంగం ద్వారా ఐదవ షెడ్యూల్ రక్షణ కల్పించిన గిరిజన ప్రాంతాలు, నేడు అపారమైన ఖనిజ సంపద కారణంగా ఆధునిక కార్పొరేట్ సంస్థల దోపిడీకి, ప్రభుత్వ విధానాల నిర్లక్ష్యానికి బలి అవుతున్నాయి. ఈ భూములు ఇప్పుడు కేవలం బొగ్గు, బాక్సైట్, ఇనుము మరియు యురేనియం వంటి ఖనిజాలను వెలికి తీసే కేంద్రాలుగా మాత్రమే చూడబడుతున్నాయి. ఈ దోపిడీ కేవలం భూమిని ఆక్రమించడమే కాదు, తరతరాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తున్న ఆదివాసుల అస్తిత్వాన్ని, సంస్కృతిని పూర్తిగా నాశనం చేసే ప్రయత్నంగా ఉంది. ఈ ప్రయత్నాలను అడ్డుకున్న ఆదివాసీలపై చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు, నిర్బంధాలు కొనసాగుతున్నాయి.

**రాజ్యాంగ రక్షణల ఉల్లంఘన**

భారత రాజ్యాంగం గిరిజనుల హక్కుల పరిరక్షణకు, వారి ప్రత్యేక సంస్కృతికి రక్షణ కల్పించడానికి ఉద్దేశించిన ఐదవ షెడ్యూల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ రక్షణలకు తోడుగా రూపొందించబడిన కీలక చట్టాలైన పంచాయతీ (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం (PESA), 1996, అటవీ హక్కుల చట్టం (Forest Rights Act - FRA), 2006లను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారు. PESA చట్టం ప్రకారం, మైనింగ్ లేదా ఏదైనా భూమి వినియోగానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు గిరిజన గ్రామ సభ (Gram Sabha) యొక్క ముందస్తు అంగీకారం తప్పనిసరి. అయితే, అదానీ, జిందాల్, ఎస్సార్ వంటి సంస్థలకు గనుల తవ్వకం అనుమతులు మంజూరు చేసే క్రమంలో, ప్రభుత్వాలు ఈ గ్రామ సభల అధికారాలను పూర్తి గా విస్మరిస్తున్నాయి. గ్రామ సభల తీర్మానాలను తప్పుడు పద్ధతుల్లో పొంది లేదా అధికారుల ఒత్తి డితో తారుమారు చేసి, ఈ చట్టాన్ని కేవలం కాగితాలకే పరిమితం చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కార్పొరేట్ దోపిడీ - అటవీ నిర్మూలన**

FRA చట్టం గిరిజనులకు అడవులపై ఉన్న వ్యక్తిగత మరియు సామాజిక హక్కులను చట్టబద్ధంగా గుర్తించినప్పటికీ, ఈ హక్కుల అమలును అడ్డుకుంటూ, ప్రభుత్వాలు అడవులను కార్పొరేట్లకు సులభంగా అప్పజెప్పడానికి వీలుగా విధానపరమైన మార్పులు చేస్తున్నాయి. ఉదాహ రణకు, ఇటీవల అటవీ సంరక్షణ నియమాలలో (Forest Conservation Rules) చేసిన మార్పులు అటవీ హక్కుల చట్టాన్ని బలహీనపరిచే ప్రయ త్నంలో భాగమేనని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం, జార్ఖండ్, నల్లమల వంటి ప్రాంతాలలో భారీ స్థాయిలో జరుగుతున్న తవ్వకాలు కేవలం ఖనిజ సంపద దోపిడీకి సంబంధించినవి మాత్రమే కాదుబీ అవి గిరిజనులను వారి సంప్రదాయ జీవనానికి ఆధారం అయిన అడవి నుంచి శాశ్వతంగా వెళ్లగొట్టే కుట్రగా భావించబడుతున్నాయి. ఈ ప్రయత్నాలను అడ్డుకున్న ఆదివాసీలపై చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు, నిర్బంధాలు కొనసాగుతున్నాయి.

**పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీల పాత్ర సంస్కృతి**

గిరిజనులు కేవలం అడవులపై ఆధారపడే జీవన సమూహాలు మాత్రమే కాదు, వారు శతాబ్దాలుగా ఈ అడవులకు సంరక్షకులుగా వ్యవహరిస్తున్నారు. వారి సాంప్రదాయ పరిజ్ఞానం, భూమి మరియు వనరులను నిలకడగా వినియోగించుకునే విధానాలు పర్యావరణ సమతుల్యతకు, జీవవైవిధ్య పరిరక్షణకు అత్యంత కీలకం. గిరిజనుల దేవతలు, ఆచారాలు, మరియు పండుగలు అడవి, పర్వతాలు, నీటి వనరుల చుట్టూ అల్లుకుని ఉంటాయి. మైనింగ్ ప్రాజెక్టుల ద్వారా జరిగే అటవీ నిర్మూలన కేవలం చెట్లను నరికివేయడం లేదా భూమిని తవ్వడం మాత్రమే కాదు, అది గిరిజనుల యొక్క పవిత్ర స్థలాలను, వారి సామాజిక-సాంస్కృతిక వారసత్వాన్ని సమూలంగా నాశనం చేస్తుంది. ఆధునిక ప్రపంచం పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఈ తరుణంలో, అడవులను కాపాడుకోవడంలో ఆదివాసీల పాత్రను విస్మరించడం అనేది భవిష్యత్తుకు ప్రమాదకరం.

**న్యాయపరమైన సవాళ్లు , పాలనా లోపాలు**

అధికార పార్టీల రాజకీయ అండదండలు, మరియు ఆర్థిక ప్రయోజనాల కారణంగానే గిరిజన చట్టాలను అమలు చేసే యంత్రాంగం నిర్వీర్యమవుతోంది. మైనింగ్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో, అటవీ శాఖ , మైనింగ్ శాఖల మధ్య సరైన సమన్వయం లోపించడం, పర్యావరణ ప్రభావ అంచనాలు (EIA) సరిగా జరగకపోవడం వంటి పాలనా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానాలు సైతం గతంలో సమత తీర్పు (%ఖుఘ్తీష్ఘ్షు జీబఎస్త్రఎవత్%, 1997) వంటి చారిత్రక తీర్పుల ద్వారా గిరిజన ప్రాంతాలలో మైనింగ్‌ను నియంత్రించడానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. అయినప్పటికీ, ఆ తీర్పుల స్ఫూర్తిని నీరుగార్చే విధంగా ప్రభుత్వాలు కొత్త చట్టాలను రూపొందించడం లేదా ఉన్న చట్టాల అమలును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం వంటి చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ చట్టాల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకే ఎక్కువ అధికారం ఉన్నందున, స్థానిక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఆదివాసుల హక్కులను బలిచేయడం సులభమవుతోంది. గిరిజన సలహా మండలి (%ఒతీఅఘ్రీశ్రీ -ూఎజఅంశీతీఎ జశీబఅఎఱశ్రీ - ూాజ%) వంటి రాజ్యాంగ సంస్థలు కూడా కేవలం నామమాత్రంగానే పనిచేస్తూ, గిరిజనులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నాయి.

**భవిష్యత్తు కార్యాచరణ , ప్రజాస్వామ్య డిమాండ్**

ఐదవ షెడ్యూల్ ప్రాంతాన్ని రక్షించుకోవడం, తద్వారా అడవి యొక్క పవిత్రతను, దేశ ఖనిజ సంపదను కాపాడుకోవడం అనేది తక్షణ అవసరం. దీనికి ప్రధానంగా కావలసింది గిరిజనుల ఐక్యత మరియు పౌర సమాజం యొక్క క్రియాశీల మద్దతు. ఆదివాసీలు తమకు రాజ్యాంగం కల్పించిన గ్రామ సభ అధికారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి, మైనింగ్ అనుమతులపై చట్టపరమైన సవాళ్లను కొనసాగించాలి, మరియు అంతర్జాతీయ వేదికలపై సైతం తమ హక్కుల ఉల్లంఘనలను ఎత్తిచూపాలి. ప్రభుత్వాలు తక్షణం %ూజుఖా% మరియు %ఖీ=ూ% చట్టాలను పూర్తి స్ఫూర్తితో అమలు చేస్తామని హామీ ఇవ్వాలి. కార్పొరేట్ సంస్థలకు అడవిని అప్పగించే ప్రయత్నాలను ఆపి, గిరిజన హక్కులకు భంగం కలిగించే అన్ని పాలనా పరమైన లోపాలను సరిదిద్దాలి. అంతిమంగా, గిరిజనుల ఆత్మగౌరవాన్ని, జీవనాన్ని కాపాడటం అనేది కేవలం సామాజిక న్యాయం మాత్రమే కాదు, దేశ పర్యావరణ భద్రతకు, రాజ్యాంగ ధర్మాన్ని నిలబెట్టడానికి అత్యంత కీలకం. వారి సంస్కృతిని, ప్రకృతితో వారి అనుబంధాన్ని కాపాడటం అంటే, దేశ సహజ వనరులను భవిష్యత్తు తరాలకు సంరక్షించడమే.

**వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్**
**విశ్లేషణ 9848559863**

## ఆపరేషన్ సిందూర్ 2.0కు సిద్ధంగా ఉన్నాం

**పాక్ ప్రేలాపనలపై ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది**



**భోపాల్,నవంబర్1(నినాదం):** అఫ్ఘనిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పై నోరు పారేసుకుంటున్న పాక్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ మరోమారు గట్టి వార్నింగ్ ఇచ్చారు. పాక్ మళ్లీ ఏదైనా మూర్ఖపు చర్యకు దిగితే ఆపరేషన్ సిందూర్ రెండో రౌండ్‌కు తాము రెడీగా ఉన్నామని అన్నారు. ఆపరేషన్ సింధూర్ 2.0కు భారత సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నా యి. త్రివిధ దళాధిపతులు సాయుధ దళాలను ముందుండి నడిపిస్తే మమల్ని ఎవరూ ఎదుర్కో లేరని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా జిల్లాలోని సైనిక్ స్కూల్‌ను సందర్శించిన సంద ర్భంగా ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు ఎప్పుడో భారత్ తప్ప ఇతరు లెవరూ నిర్ణయించలేరని కూడా తేల్చి చెప్పారు. పాక్ తగిన గుణపాఠం నేర్చుకుందని తాము భావించినప్పుడే ఆపరేషన్ సిందూర్ ముగుస్తుం దని అన్నారు.సైన్యానికి నేతృత్వం వహిస్తున్న లెప్టె నెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నావికాదళా ధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ ఇద్దరూ 1970ల్లో కలిసి చదువుకున్నారు. అప్పట్లో రేవా సైనిక్ స్కూల్లోక్లాస్ 5ఏతరగతిలో క్లాస్ మేట్స్‌గా ఉన్నారు. ఆతరువాత ఇద్దరు అంచెలంచెలుగా ఎదుగుతూ సాయుధ దళాల అధిపతులయ్యారు. భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం ఉందని ఇటీ వల పాక్‌రక్షణశాఖమంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యా నించిన విషయం తెలిసిందే. ఈసారి యుద్ధంలో తాము గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధి స్తామని కూడా అన్నారు. ఈ నేపథ్యంలో భారత ఆర్మీ ఛీఫ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడికి ప్రతీకా రంలో భారత్ మే6,7 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేసి పాక్ పాలక వర్గానికి, అక్కడి ఉగ్రమూకలకు వెన్నులో వణుకు పుట్టించింది.

# కార్తీక ఏకాదశితో ఆలయాల్లో రద్దీ

**యాదగిరిగుట్ట,నవంబర్1(నినాదం):** కార్తిక మాసం శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ మహా విష్ణువు ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణ్నా మారుమోగాయి. యాదగిరిగుట్టతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. దీనిని చిలుకు ఏకాదశి కూడా అంటారు. దీంతో హైదరాబాద్ సహ తెలుగు రాష్ట్రాల్లోని అన్న వైష్ణవాలయాల్లో రద్దీ నెలకొంది. యాదాద్రితో పాటు రత్నగిరి, నగరంలోని టిటిడి వెంకటేశ్వరాలయాలు, పాతబస్ ఈ రంగనాథ ఆలయంలో రద్దీ కనిపించింది. శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, చిన్న దూగం కూడలిలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకునేందుకు కోటబొమ్మాళి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆమదాలవలస మండల ప్రాంతాల్లోనూ విష్ణు, శివ ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటె త్తారు. కార్తిక ఏకాదశి పర్వదినం పురస్కరించ ుకుని భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో సుమా రు కిలోమీటర్ పొడవునా బారులు తీరారు. కార్తిక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం శ్రీవైభవ వేంకటే శ్వరస్వామి దేవాలయంలో సామూహిక సత్యనా రాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.

## శబరిమల ఆలయంలో బంగారం దొంగతనం

**మాజీ ఇవోను అరెస్ట్ చేసిన క్రమ్ బ్రాంచ్ పోలీసులు**




**తిరువనంతపురం,నవంబర్1(నినాదం):** శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలో బంగారం తాపడం పేరుతో జరిగిన మోసం కేసులో అధికారులు మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధీశ్ కుమార్‌ను శనివారం అరెస్టు చేశారు. 2019లో శబరిమల ఈవోగా సుధీశ్ బాధ్యతలు నిర్వర్తిం చారు. తిరువనంతపురంలో క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి అతన్ని అదుపులోకి తీసుకు న్నారు. అయ్యప్ప స్వామి వద్ద ఉన్న ద్వారపాల కుల విగ్రహాల సమాచారాన్ని దాచిపెట్టినట్లు అతనిపైఆరోపణలు ఉన్నాయి. బంగారు తాపడం ఉన్న ద్వారపాలకుల విగ్రహాలను.. కాపర్ షీట్లుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించినట్లు మాజీ ఈవోపై ఆరోపణలు ఉన్నాయి. ద్వారపాలకుల విగ్రహాల తాపడం కోసం వాటిని ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టికి అందజే శారు. వాస్తవానికి ఆ విగ్రహాలకు 1998లో గోల్డ్ ప్లేటింగ్ జరిగింది. అయితే మళ్లీ 2019లో ఆ విగ్రహాలను ఈవోగా ఉన్న సుధీశ్ వాటిని ఉన్నికృష్ణన్‌కు అందజేశారు. ఆ విగ్రహాలను రాగితో ప్లేటింగ్ చేసి ఉన్నట్లు చూపించి, వాటిని ఉన్న బంగారాన్ని మాజీ ఈవో తీసుకెళ్లినట్లు ఈ కేసులో ఆరోపణలు వచ్చాయి. శబరిమల మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బీ మురారి బాబును కూడా ఈ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మాజీ ఈవో కుమార్‌ను జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.

# తెలుగువారికి బృహత్సంహితలు...


## పానుగంటి సాక్షి వ్యాసాలు ఆంధ్రా షేక్స్పియర్ జయంతి

పానుగంటి ప్రతిభ అనన్యం. ప్రజ్ఞ బహుముఖీనం, నాటక కర్తగా, వ్యాసరచయితగా ఆయన పేరు సుస్థిరం. ప్రక్రియ ఏదైనా ఆయన రచనలకు హాస్యం ఆలంబనం. పదాలు గుప్పించడంలోను, ఒకమాటకు పది మాటలు వాడి వ్యంగ్యాన్ని, వర్ణనను, హాస్యాన్ని రంగరించడంలోను ఆయనకు ఆయనే సాటి. సాక్షి వ్యాసాల శైలి వరద గోదావరిలాగా ఝరీవేగంతో పరుగులెట్టేది. కొందరు ఆయనను "ఆంధ్రా అడిసన్" అంటారు. మరికొందరు ఆయనను "ఆంధ్రా షేక్స్పియర్" అంటారు. గ్రాంథిక భాషలో సామాజిక రుగ్మతలను ఎండగడుతూ ఆయన రాసిన సాక్షి వ్యాసాలు తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఆయన రాసిన నాటకాలు కూడా ఆనాటి సాహితీ అభిమానుల ఆదరణను పొందాయి. " పాను గంటి సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి.. ఎంచేతనంటే వాటిలో పేను లాంటి భావానికాయన ఏను గంటి రూపాన్నియ్యడం నేనుగంటి" అని శ్రీశ్రీ సైతం కొనియాడిన మేటి సాహితీ శిఖరం పానుగంటి.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు తెలుగు సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి అనేక అమూల్యా భరణాలు అందించిన నరసింహా రావును పాఠక లోకం 'కవిశేఖరుడ'నీ, 'అభినవ కాళి దాసు' అనీ బిరుదులతో అభినందించింది. నవంబరు 2, 1865వ తేదీన రాజమహేంద్రవరం తాలూకా సీతానగరంలో రత్నమాంబ, వెంకట రమణయ్య దంపతులకు జన్మించారు. 1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటర్, 1888లో బి.ఎ. పరీక్షలలో ఉత్తీర్ణు లైనారు. పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయుడిగా చేరిన పాను గంటి, ఆ రోజుల నుండే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. అయితే ఉపాధ్యాయుడిగా తన సంపాదన చాలక పోవడంతో తొలుత లక్ష్మీనరసాపురం సంస్థానంలో దివానుగా చేరారు. ఆ తర్వాత ఉర్లాం, అనేగొంది, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో కూడా పనిచేశారు. ఆయన లక్ష్మీ పురం జమిందారిణి రావు చెల్లయమ్మ గారి దివానుగా చేరారు. ఆరు సంవత్సరాల తర్వాత అభిప్రాయ భేదాల మూలంగా ఉద్యోగం మాని వేశారు. తరువాత ఉర్లాము సంస్థానం లోను, బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలోను దివానుగా కొంత కాలం పనిచేశారు. పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహదూర్ పానుగంటి రచనల గురించి వినగా, రాజాకు మైనారిటీ తీరగా రాజ్యాధికారం చేపట్టిన తర్వాత పంతులు గారిని 1915-16 మధ్య 'నాటక కవి'గా తమ ఆస్థానంలో నియమించారు. ఆయన కోరికపై అనేక నాటకాలు వ్రాసారు. వాటి నన్నింటిని మహా రాజుగారే అచ్చు వేయించారు. పానుగంటి వారి రచనలల్లో ప్రముఖ మైనవి సాక్షి వ్యాసాలు. సువర్ణముఖి, ఆంధ్రపత్రిక లలో 1913 నుండి 1933 మధ్యకాలంలో ప్రచురించ బడ్డాయి. వ్యాసాలన్నీ అచ్చమైన గ్రాంథిక భాషలో ఉన్నా, వ్యవహారానికి దగ్గరగా ఉండే శైలితో రాయడం రచయిత ప్రత్యేకత. వినోద ప్రధానశైలిలో రాస్తూ.. ఆనాటి సామాజిక రుగ్మతలను ఎండ గట్టడం ఈ వ్యాసాల ప్రధాన ఉద్దేశం. 1711 - 12 లో స్పెక్టేటర్ అనే ఆంగ్ల పత్రికలో జోసెఫ్ అడ్డిసన్, రిచర్డ్ స్టీల్ వ్రాసిన స్పెక్టేటర్ పేపర్స్ వ్యాసాలతో ప్రేరణ పొందిన పానుగంటి ఈ వ్యాసాలను రాశారంటారు. ఈ వ్యాసాలలో కాలాచార్యుడు, జంఘాల శాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి అనే పాత్రల ద్వారా సామాజిక విషయాలపై చర్చలను పెడతారు రచయిత. వారి సంభాషణల ద్వారా పాఠకుడికి అందాల్సిన సందేశాన్ని అందిస్తారు. "సాక్షి వ్యాసాలు" పుస్తకంగా వచ్చాక, అనతికాలం లోనే పానుగంటి వారి పేరు ఆంధ్రదేశంలో మారుమ్రోగి పోయింది. ఆ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి. సాక్షి వ్యాసాల రాసిన తర్వాత పిఠాపురం జమీందరు ప్రేరణతో ఇంకా అనేక రచనలు చేశారు పానుగంటి. సారంగ ధర చరిత్ర, వృద్ధ వివాహము, రాధాకృష్ణ, నర్మదా పురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణ రాఘవము, కంఠాభరణము, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర, బుద్ధ బోధసుధ, వీరమతి, పూర్ణిమ అందులో ప్రముఖమైనవి. ఆయన రాసిన నాటకాలే పానుగంటి వారి అభినవ కాళిదాసు బిరుదును పొందేలా చేశాయి. తన రచనల వలన తొలినాళ్లలో ఆయన విశేషంగా ధనమార్జించినా, అవసాన దశలో పేదరికానికి, ఋణబాధకు గురవడం గమనార్హం. సంస్థానం అందించే గౌరవ వేతనంపైనే ఆయన ఆధారపడాల్సి వచ్చింది. "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును" అని తన చివరిదశలో ఆ మహా రచయిత వాపోయాడంటేనే అతని పరిస్థితి అప్పుడు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత అనారోగ్యం కూడా అతన్ని బాగా కుంగదీసింది. తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేసిన సాక్షి వ్యాసాలను ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం అంతా యింతా కాదు. "జంఘాలశాస్త్రి" అనే పాత్ర ముఖతః పానుగంటి వారు సమకాలిక సాంఘిక దురాచారాల మీద, మూఢ విశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు అని నండూరి రామమోహనరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృదుమధుర నవార్థభాసుర వచనరచనా విశారదులైన" మహాకవి ఆధునిక కాలమున ఎవరు అని ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము "పానుగంటి లక్ష్మీనరసింహారావు"గారని. .. నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్యప్రేమికు లుండరని, నాటకములలో కన్యాశుల్కము ఎట్టిదో గద్య రచనములలో సాక్షి అటువంటిదని మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహితీ లోకాన్ని విడిచి తిరిగి రాని లోకాలకు పానుగంటి వారు వెళ్లినా, సాక్షి వ్యాసాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా ఉండి పోయాయి. ఇప్పటికీ తెలుగు విద్యార్థుల పాఠ్యాంశాలలో ఈ వ్యాసాలను ప్రచురించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమే. సుమారు ఇరవై సంవత్సరాలు ఆయన జీవితం సుఖంగా జరిగింది. ఆ రోజుల్లో దివాణం తరువాత వ్యయానికి వీరి గృహమే అనేవారు. ఆధునిక శ్రీనాథునిగా జీవించారు. ఉద్యోగాల వలన, రచనల వలన విశేషంగా డబ్బు గడించినా దానిని నిలువ చేయడంలో శ్రద్ధ కనపరచ లేదు. ఆధునిక శ్రీనాధుని వలెనే అనుభవించి నన్నాళ్ళూ బాగా అనుభవించి, తుది రోజులలో పేదరికానికి ఋణ బాధకు లోనయ్యారు. మహారాజా వారు బాగా పోషించినా, పంతులు గారికి తుదిదశలో వైషమ్యాలేర్పడి, తమదగ్గర ఏనాడో చేసిన ఋణం కొరకు వారికి ఇచ్చే నూట పదహారు రూపాయల గౌరవ వేతనంలో కొంతభాగం తగ్గించ డానికి ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధాప్యంలో ఆయన అటు ఇటు తిరిగి సంపాదించ లేకపోయారు. చేతికి అందివచ్చిన కుమారులు ఉన్నా వారిని ఉద్యోగాలకు పంపలేక పోయారు. పానుగంటి కవి శేఖరుని దుస్థితి గురించి ఆయన వ్రాసిన లేఖను ఆంధ్రపత్రికలో యర్రవల్లి లక్ష్మీనారాయణ ప్రచురించాడు ... "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును". 1933 నుండి శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యం చెడి పోయింది. 1935 లో పిఠాపురంలో ఉత్సవాలు నిర్వహించి పురజనులు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. పరిస్థితులు మారి, తీవ్ర మనస్తాపంతో ఈయన అక్టోబరు 7న, 1940లో మరణించాడు.



**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**



# సౌందర్య సంరక్షణకూ 'తులసి'!

మచ్చలేని సౌందర్యాన్ని సొంతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉండే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి అంటున్నారు నిపుణులు.



మొటిమలకు..

తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్‌గా కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుంది.

తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మ రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలు క్రమంగా తగ్గుముఖం పడతాయి.

తులసి ఆకుల రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుంది.

**నల్లమచ్చలుంటే..!**

ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకోసారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్లమచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది.

అవని

# రోజూ ఉసిరిక పొడిని ఇలా తినండి

చలికాలంలో ఉసిరికాయలు మనకు అధికంగా లభిస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగానే చాలా మంది ఈ సీజన్‌లో లభించే ఉసిరికాయలను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఇవి అత్యంత పుల్లగా ఉంటాయి. కనుక వీటితో ఊరగాయలు, పచ్చళ్లు, పులిహోర వంటివి తయారు చేస్తుంటారు. అయితే వాస్తవానికి ఆయుర్వేదంలో ఉసిరికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉసిరిని రోజూ తీసుకోవడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. సాధారణ ఉసిరికాయలు మనకు కేవలం ఈ సీజన్‌లోనే లభిస్తాయి. కానీ ఉసిరిక పొడి మనకు మార్కెట్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఈ క్రమంలోనే రోజూ ఒక టీస్పూన్ ఉసిరిక పొడిని తింటుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దీన్ని రాత్రి పూట ఒక టీస్పూన్ తేనెతో కలిపి తినవచ్చు. లేదా ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా తీసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..**

ఉసిరిక పొడిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు తగ్గిపోతాయి. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరిక పొడిలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఉసిరిక పొడిని తింటే ఫ్రీ ర్యాడికల్స్‌ను



తొలగించుకోవచ్చు. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**కొలెస్ట్రాల్ స్థాయిలకు..**

ఉసిరిక పొడిని రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఉసిరిక పొడిని తింటుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఉసిరిక పొడి శరీరానికి చలువ చేస్తుంది. కనుక దీన్ని తీసుకుంటే శరీరంలోని వేడి తగ్గిపోతుంది. గ్లూకోజ్ మెటబాలిజం మెరుగు పడుతుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఉసిరిక పొడిలో ఉండే క్రోమియం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ నియంత్రణలో ఉంటుంది.

**జీర్ణ వ్యవస్థకు..**

ఉసిరిక పొడిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ శక్తి పెరుగుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. శరీరంలో కొవ్వు చేరదు. మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీని వల్ల కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. అలాగే చర్మానికి, శిరోజాలకు కూడా ఉసిరిక పొడి మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి కొల్లాజెన్ ను ఉత్పత్తి చేసేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. యవ్వనంగా ఉంటుంది. ముడతలు పడకుండా నిరోధించవచ్చు. చర్మం కాంతివంతంగా మారుతుంది. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా దృఢంగా పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం, శిరోజాలకు అప్లై చేసే వివిధ రకాల ప్యాక్‌లలోనూ ఉసిరిక పొడిని వాడవచ్చు. ఇలా ఉసిరిక పొడి మనకు ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# ఈ చిన్న లడ్డూతో కొండంత ఆరోగ్యం!



శీతాకాలంలో అంజీర్ లడ్డూ మనకు ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలు చేస్తుంది. ఇది మన శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచేందుకు సహాయపడుతుంది. అలాగే రక్తహీనత , జీర్ణక్రియ , మలబద్ధకం , పేగు ఆరోగ్యం , కండరాల ఆరోగ్యం , బరువు నియంత్రణ , చర్మం, జుట్టు ఆరోగ్యానికి చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

ఈ లడ్డును పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఇష్టపడతారు . శీతాకాలంలో ఈ లడ్డూను రోజుకూ ఒకటి తినడం వల్ల ఇది మనల్ని అనేక వ్యాధుల భారీ నుంచి రక్షిస్తుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

**అంజీర్ లడ్డు తయారీకి కావలసిన పదార్థాలు**

ఎండిన అంజూర పండ్లు – 1 కప్పు (10 నుండి 15 ముక్కలు)
తరిగిన ఖర్జూరాలు – 1 కప్పు
తరిగిన బాదం-కప్పు
జీడిపప్పు- కప్పు
పిస్తాపప్పులు – 2 టేబుల్ స్పూన్లు
వాల్‌నట్స్ – 2 టేబుల్ స్పూన్లు
నెయ్యి – 1 టేబుల్ స్పూన్
ఏలకుల పొడి-టీస్పూన్

అంజీర్ లడ్డు ఎలా తయారు చేయాలి

అంజీరా లడ్డూ తయారు చేసేకునేందుకు ముందుగా అంజీర్, ఖర్జూరాలను చిన్న ముక్కలుగా కట్‌చేయండి. ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి వేడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్ వేసి కాసేపు వేయించాలి.

తరువాత అదే పాన్ లో ముందుగా కట్‌చేసుకున్న అంజీర్ పండ్లు, ఖర్జూర ముక్కలు వేసి 4 నుండి 5 నిమిషాలు అవి మెత్తబడే వరకు ఉడికించాలి. తరువాత తరిగిన డ్రై ఫ్రూట్స్, ఏలకుల పొడి వేసి బాగా కలపాలి.

ఇప్పుడు స్టవ్ ఆఫ్ చేసి, మిశ్రమాన్ని కొద్దిగా చల్లారనివ్వండి, తర్వాత మీ చేతులకు నెయ్యి రాసుకుని చిన్న చిన్న లడ్డూల తయారు చేసుకోండి. మీకు ఇష్టమైతే, ఈ లడ్డులకు కాల్చిన నువ్వులు లేదా గసగసాలు జోడించవచ్చు.

ఎండిన అంజీర్, ఖర్జూరంతో తయారుచేసిన ఈ రుచికరమైన వంటకానికి చక్కెర లేదా బెల్లం అవసరం లేదు. బాదం, జీడిపప్పు, పిస్తాపప్పు, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు అంజీర్, ఖర్జూరం నిజమైన తీపి వీటికి రుచిని తెచ్చిపెడుతుంది. ఈ లడ్డులు మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా.. మీకు తక్షన శక్తిని అందిస్తాయి.

పైన పేర్కొన్న అంశాలు నివేదికలు, ఇంటర్నెట్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా అందింజబడినవి. వీటిపై మీకు ఏవైనా సందేహాలు ఉన్నా.. వీటిని మీరు ఉపయోగించాలనుకున్న.. కచ్చితంగా వైద్యులను సంప్రదించండి.




# త్వరలో మార్కెట్లో మరో భారీ పతనం

## 'రిచ్ డ్యాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి హెచ్చరిక

ఇటీవల చోటు చేసుకుంటున్న రాజకీయ, భౌగోళిక పరిణామాల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు అతలాకుతలం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్ లో ఒడిదుడుకులపై రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తకర రచయిత ప్రముఖ ఇన్వెస్టింగ్ గురూ రాబర్ట్ కియోసాకి పెట్టుబడులపై మరోసారి హెచ్చరించారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో భారీ క్రాష్ కాబోతోందని ఇలాంటి పరిస్థితుల్లో మిమ్మల్నీ ఆర్థికంగా కవాచాలుగా రక్షణ కల్పించేవి వెండి, బంగారం, వంటి విలువైన లోహాలు, బిట్ కాయిన్, ఎథేరియం వంటి క్రిప్టోకరెన్సీలు అండగా నిలుస్తాయన్నారు. ఈ మేరకు ఆయన తాజాగా ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. కాగా కియోసాకి ఇలా హెచ్చరించడం ఇదే తొలిసారి కాదు. గతంలో 2025 ఫిబ్రవరిలో కూడా ఇలాగే చరిత్రలో అతి పెద్ద స్టాక్ మార్కెట్ క్రాష్ రాబోతోందని అంచనావేశారు. కాగా రాబర్ద్ కియోసాకి పోస్టులపై కొంత మంది నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. గత 15 ఏళ్లుగా మరో ప్రమాదం రాబోతోందని కియోసాకి అంచనా వేస్తూనే ఉన్నారని ఒక నెటిజన్ కామెంట్ చేయగా మరో నెటిజన్ స్పందిస్తూ కియోసాకి టైమ్ లైన్‌లో చూసిన ప్రతిసారి మార్కెట్ల క్రాష్ అంటూ మాట్లాడుతారని విమర్శిస్తున్నారు.




# అక్టోబర్‌లో రికార్డు స్థాయికి యూపీఐ లావాదేవీలు

పండుగ సీజన్ కావడంతో అక్టోబర్ నెలలో డిజిటల్ చెల్లింపులు సరికొత్త శిఖరాలకు చేరుకున్నాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు మునుపెన్నడూ లేనంతగా పెరిగి ఆల్-టైమ్ రికార్డులను సృష్టించాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. అక్టోబర్ నెలలో యూపీఐ ద్వారా జరిగిన లావాదేవీలు 20.70 బిలియన్లుగా నమోదైంది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 శాతం వృద్ధి నమోదైంది. విలువ పరంగా చూస్తే అక్టోబర్‌లో రూ.27.28 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. ఇక రోజువారీ లావాదేవీల విలువ సగటున రూ.87,993 కోట్లుగా ఉంది (668 మిలియన్లు). ఇది గతేడాదితో పోలిస్తే 16 శాతం అధికం. ఇక గతనెల యూపీఐ ద్వారా రూ.24.90 లక్షల కోట్ల లావాదేవీలు నమోదైన విషయం తెలిసిందే. సెప్టెంబర్‌లో రోజూవారీ లావాదేవీల విలువ సగటున రూ.82,991 కోట్లుగా (654 మిలియన్లు) ఉంది. 2016లో సాధారణంగా ప్రారంభమైన యూపీఐ చెల్లింపులు ఇప్పుడు తారాస్థాయికి చేరాయి. 2017 జూన్‌లో యూపీఐ లావాదేవీల రోజువారీ సగటు 3.5 లక్షలుగా ఉండగా.. ఈ ఏడాది అవి ఆల్‌టైమ్ రికార్డుకు చేరాయి.

# అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు

అక్టోబర్ మాసంలో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. దాదాపు రూ.1.95లక్షల కోట్లు జీఎస్టీ వసూళ్లయ్యాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 4.6శాతం పెరిగాయి. 2024 అక్టోబర్ మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.87లక్షలుగా ఉన్నాయి. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ GST (IGST) అన్నీ అక్టోబర్ నెలలో వృద్ధిని నమోదు చేయగా.. సెస్ వసూళ్లు మాత్రం తగ్గాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లో (ఏప్రిల్-అక్టోబర్) మొత్తం జీఎస్టీ వసూళ్లు 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2017లో జీఎస్టీని అమలు చేసినప్పటి నుంచి ఇదే అత్యధికం. భారత జీఎస్టీ వ్యవస్థ 2024-25లో రూ.22.08 లక్షల కోట్ల రికార్డు స్థూల వసూళ్లతో మైలురాయిని సాధించింది. ఇదిలా ఉండగా.. అక్టోబర్ నెలలో జీఎస్టీ రూ.1.87 లక్షల కోట్లు వసూలు జరిగాయి. ఆ మొత్తం 1.96 లక్షల కోట్లకు చేరింది. ఈ ఏడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.1.86 లక్షలు కోట్లు వసూలవగా.. సెప్టెంబర్‌లో 1.89 లక్షలు కోట్లుగా నమోదైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ గణాంకాలు తెలిపాయి. గతేడాదితో పోల్చినప్పుడు 4.6 శాతం వృద్ధి నమోదైంది. అయితే, గడిచిన నెలలతో పోల్చి చూస్తే సగటున 9 శాతం వృద్ధి కంటే తక్కువ నమోదైంది. అక్టోబర్ జీఎస్టీ వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగం నుంచి.. దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు వచ్చాయి. జీఎస్టీ రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే.. నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇదిలా ఉండగా.. దసరా సమయంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు అమలులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. చాలా వస్తువులపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. దాంతో దసరా నవరాత్రి, దీపావళి దీపావళి సమయంలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. జీఎస్టీ రేట్ల సవరణ తర్వాత వినియోగదారుల నుంచి డిమాండ్ కనిపించిందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది వినియోగం మరో పదిశాతానికిపైగా పెరిగే అవకాశాలున్నాయి. దాంతో అదనంగా రూ.20లక్షల కోట్ల మేర కొనుగోళ్లు జరగవచ్చని అంచనా వేస్తున్నారు. పండగ సీజన్‌లో వినియోగదారుల నుంచి బలమైన డిమాండ్, పన్ను విధానం, పెరుగుతున్న వినియోగం జీఎస్టీ వసూళ్లు పెరిగేందుకు కారణమని వినియోగం, పన్ను చెల్లింపులు సరైన దిశలో సాగుతున్నాయనేందుకు ఇది సానుకూలమని సూచికని కేపీఎంజీ ఇండియా భాగస్వామి అభిషేక్ జైన్ పేర్కొన్నారు.







# అమెజాన్‌లో లేఆఫ్స్

## అర్ధరాత్రి టైం మెయిల్స్

అమెరికా టెక్ దిగ్గజ సంస్థల్లో ఒకటైన అమెజాన్ భారీగా ఉద్యోగులను లేఆఫ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జరుగుతున్న తొలగింపులు ఉద్యోగులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఏళ్లుగా కంపెనీలో పనిచేస్తూ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న తొలగింపుల్లో ఇళ్లకు పంపటంపై చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తనను లేఆఫ్ చేసిన విధానం గురించి ఒక ఉద్యోగి బ్లైండ్ ఫ్లాట్ ఫారంలో పంచుకున్నాడు. ఇప్పటికే తాను వర్క్ లైఫ్ బ్యాలెన్స్ కుదరక తన పాపతో సమయం గడపలేకపోతున్నానని అదే సమయంలో కంపెనీ తనను ఫైర్ చేసినట్లు చెప్పిందని ఆయన చెప్పారు. కంపెనీలో నాలుగేళ్లుగా కష్టపడి పనిచేస్తున్నానని.. కానీ ఇలాంటి పరిస్థితి వస్తుందని తెల్లవారుజామున 5 గంటలకు ఇలాంటి పోస్ట్ ఒకటి పెడతానని కలలో కూడా అనుకోలేదన్నాడు. తాను పనిలో ప్రతిరోజూ అత్యుత్తమ పనితీరును కనబరిచినట్లు ఆ ఉద్యోగి తన పోస్టులో చెప్పాడు. వాస్తవానికి తానే కొన్నాళ్లుగా కంపెనీని విడిచిపెట్టాలని అనుకుంటున్నానని.. అదే సమయంలో ఊహించని మెరుపులా లేఆఫ్ అయ్యాయని చెప్పుకొచ్చాడు. తనకు తెల్లవారుజాము 2 గంటల సమయంలో ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఒక మెయిల్ అధికారికంగా అందిందని.. కార్పొరేట్ ప్రపంచంలో భవిశా ఇలాగే ఉంటుందేమో అంటూ పోస్ట్ పెట్టాడు. దేవుడే కావాలని ఈ చిన్న బ్రేక్ ఇచ్చి ఉండొచ్చని అన్నాడు. దీని కంటే మంచి భవిష్యత్తు ముందుందనే ఆశతో ముందుకెళ్లబోతున్నట్లు తన పోస్టులో చెప్పాడు.

అమెరికాకు చెందిన అమెజాన్ ప్రపంచ వ్యాప్తంగా 14వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భారతీయ ఉద్యోగుల సంఖ్య 800 వరకు ఉండొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే చాలా మందికి పింక్ స్లిప్ అంటే లేఆఫ్ కి సంబంధించిన మెయిల్స్ పంపబడినట్లు వెల్లడైంది. రిటైల్ బిజినెస్ యూనిట్, రోబోటిక్స్ అండ్ డివైజెస్ వంటి విభాగాలతో పాటు మరికొందరు ప్రభావితం అవుతున్నట్లు తెలుస్తోంది. చాలా మంది ఉద్యోగులకు కంపెనీ యాక్సెస్ నిలిపివేసినట్లు కూడా కొందరు షేర్ చేస్తున్నారు. అమెజాన్ వీడియో డిపార్ట్మెంట్ ఉద్యోగులు కూడా ప్రభావితం అవనున్నట్లు తేలింది. కంపెనీ మాత్రం అధికారికంగా తొలగింపులపై ప్రకటన చేయలేదు ఇప్పటి వరకు.

# జియోమార్ట్‌లో ఐఫోన్‌పై భారీ తగ్గింపు!

యాపిల్ హాలిడే సేల్‌ను మిస్ అయ్యారా? ఆందోళన అవసరం లేదు. జియోమార్ట్ ఇప్పుడు ఐఫోన్ ప్రేమికుల కోసం అత్యంత లాభదాయకమైన ఆఫర్ తీసుకువచ్చింది. ఐఫోన్ 16 ప్లస్ (128బీజీ)మోడల్ ఇప్పుడు జియోమార్ట్‌లో కేవలం రూ.65,990లకే లభిస్తోంది. ఐఫోన్ 16 ప్లస్ 128బీజీ వేరియంట్ అసలు ధర రూ.89,900 కాగా నేరుగా రూ. 23,910 తగ్గింపు అందిస్తోంది. అదనంగా ఎస్‌బీఐ కో-బ్రాండెడ్ ప్లాటినం క్రెడిట్ కార్డు ద్వారా ఈఎంఐ లావాదేవీలపై 5 క్యాష్ బ్యాక్ (రూ.1,000 వరకు) లభిస్తుంది. తద్వారా ఫోన్ ధర రూ.64,990 లకు తగ్గుతుంది. అంతేకాకుండా పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా మరింత అదనపు తగ్గింపు పొందవచ్చు. యాపిల్ అధికారికంగా ఐఫోన్ 17 విడుదల నేపథ్యంలో ఐఫోన్ 16 సిరీస్ ధరను తగ్గించినప్పటికీ, జియోమార్ట్ ధరలు అధికారిక స్టోర్ సవరించిన ధర రూ.79,900 కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయి.



## ఏకాదశి సందర్భంగా బీరంగూడ దేవాలయంలో లక్ష పుష్పార్చన



**పఠాన్‌చెరు, నవంబర్. 1 (నినాదం):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీకమాస ఏకాదశి సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున నుండి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం భక్తుల సమక్షంలో స్వామివారికి లక్ష పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో నిండిపోయి, భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈవో శశిధర్, చైర్మన్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారని ఆలయ అధికారులు తెలిపారు. చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, "కార్తీకమాసం ఎంతో పవిత్రమైనది. ఏకాదశి రోజున స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది," అని పేర్కొన్నారు. అలాగే ఆయన మాట్లాడుతూ, వచ్చే బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు, దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రహ్లాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## భార్యపై కర్రతో దాడి చేసిన భర్త



**పటాన్‌చెరు. నవంబర్ 1 (నినాదం):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యపై దారుణ హత్య జరిగింది. వడక్‌పల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రంలో కూలీ పనులు చేస్తూ మద్యం మత్తులో భార్యభర్తల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆగ్రహంతో భర్త భార్యపై కర్రతో దాడి చేసి హత్య చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం, నిజామాబాద్ జిల్లాకు చెందిన బానోత్ రాజు, సరోజ దంపతులు ఈ నెల 25న చెరుకూరి ప్రసాద్‌కు చెందిన వడక్‌పల్లి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో పనికోసం వచ్చారు. ఈ నెల 31న రాత్రి మద్యపానం చేసిన రాజు, సరోజతో ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో రాజు కర్రతో భార్యపై దాడి చేయగా, సరోజ అక్కడికక్కడే మృతిచెందింది. భార్యభర్తల మధ్య ఇంతకుముందు కూడా తరచూ వివాదాలు జరిగేవని, గతంలో రాజు జైలుకు వెళ్లినట్లు అమీన్‌పూర్ సీఐ నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి, భర్త రాజును పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సుచిత్ర ట్రాఫిక్ జంక్షన్‌పై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి

### మేడ్చల్ మల్కాజిగిరి మానవ హక్కుల కమిటీ




**అల్వాల్, నవంబర్ 1 (నినాదం):** కొన్ని నేలలుగా సుచిత్ర జంక్షన్ సిగ్నల్స్ క్లోజ్ చేసి ధురంలోయుటర్న్ పెట్టి, ట్రాఫిక్ సిగ్నల్స్ పాదచారులు కోసం వాడుతున్నారు. ట్రాఫిక్ జామ్ తగ్గించడానికీ వాహనాలు డైవర్ట్ చేసారు కాని దీని వల్ల ఇంకా ఎక్కువ ట్రాఫిక్ జామ్ అవుతుంది, దీన్ని వెంటానే ఉన్నతాధికారులు సమీక్షించి సిగ్నల్స్ ఓపెన్ చేసి ట్రాఫిక్ యధావిధిగా నడిచెల చూడాలి అని హ్యూమన్ రైట్స్ చీఫ్ డాక్టర్ ప్రదీప్ అరుణోదయ్ మీడియా లో తేలిపారు, రద్దీ సమయాల్లో అలసిపోయి పని నుండి ఇంటికి వెల్లే వాళకి ధురంగ ఉన యు టర్న్ ఇబ్బందిగ మారుతుంధి అని తమకు చాలా ఫిర్యాదులు వచ్చాయని తేలిపారు. ఈ సమావేశంలో పోషకుడు- నరహరి రావు, సలహాదారు- నర్సింగ్ రాజ్, న్యాయ సలహాదారు- కరుణాకర్, కార్యదర్శి- రితీష్ రాజ్, సంయుక్త కార్యదర్శి- గజానంద్ రాజ్, రాజ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ- రాహుల్, విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రెస్ సెక్రటరీ- హరీష్, శరణ్ కుమార్, ఆఫీస్ సెక్రటరీ: దుర్గా ప్రసాద్, నిహారిక, రిపోర్టింగ్ ఆఫీసర్- నరేందర్ పాల్గొన్నారు.

# పార్కుల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

**పది పార్కుల స్థలం కబ్జా**

**100 కోట్ల విలువైన పార్కు స్థలాలు కబ్జా అయినా పోలీసులకు ఫిర్యాదు చేయని మున్సిపల్ అధికారులు**

**మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఆకుల సతీష్**



**కుత్బుల్లాపూర్, నవంబరు 1 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ మల్లంపేట నందు కెవిఆర్ లేఔట్ 54 ఎకరాల వెంచర్ ను 2004 సంవత్సరంలో వేశారు. టిఆర్ఎస్ పాలనలో, స్థానిక ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, అతని సోదరుడు శంబిపూర్ కృష్ణ అండదండలు, సహకారంతో నరేష్ అతని మిత్రులు కలిసి సుమారు పది పార్కు స్థలాలు కబ్జా చేశారు. అంతే కాకుండా సుమారు 100 కోట్ల విలువైన పార్క్ ఆస్తికి తప్పుడు పత్రాలు సృష్టించి వెంచర్ వేసిన కెవి రామరాజు పేరు మీద సంతకం ఫోర్జరీ చేసి హైకోర్టు నుండి ఉత్తర్వులు పేరుతో పార్కులు రిజిస్ట్రేషన్లు చేశారు. పార్కు స్థలాల కబ్జాపై గతంలోనే మేము ఫిర్యాదు చేసిన నామ మాత్రంగా కూల్చివేశారు. పార్కుల అక్రమ ఆక్రమణ పై మున్సిపల్ అధికారులు కేసును మాత్రం నమోదు చేయలేదు. చివరికి 2024లో సూరారంలో అక్రమ గన్ తో నరేష్ కాల్పులు జరపడం, ఆ తర్వాత పోలీస్ అధికారులు కె.వి రామరాజు ఇచ్చిన పార్క్ స్థలాల కబ్జాపై ఫిర్యాదు ఆధారంగా నరేష్ వారి మిత్రులపై (737/2024) ప్రకారం దుండిగల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు . అత్యంత విలువైన 10 పార్కు స్థలాలు కబ్జాకు పాల్పడడంపై అండదండలు సాకారం అందించిన ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, కౌన్సిలర్ కృష్ణ పాత్ర పై విచారణ జరపలేదు. ప్రస్తుతం కె.వి.ఆర్ లేఔట్ లో అప్పట్లో కూల్చివేసిన పార్క్ స్థలాలు ప్రస్తుతం అధికార పార్టీ నేత తో నరేష్ అనే వ్యక్తి మళ్లీ చేతులు కలిపి తిరిగి అమ్మకాలు చేపట్టడంపై తక్షణమే కెవిఆర్ లేఔట్ లో పార్కు స్థలాల్లో ఆక్రమించుకున్న అన్ని నిర్మాణాలను కూల్చివేసి, పార్కులను పరిరక్షించడానికి ఫెన్సింగ్ వేసి రక్షించడమే కాకుండా నరేష్ మిత్రులు, ఎమ్మెల్సీరాజు, అతని తమ్ముడు కృష్ణ పాత్ర పై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అని మున్సిపల్ అధికారులకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి ,శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి





**కర్రసాము సదస్సు, సెలెక్షన్స్‌ను ప్రారంభించిన సొంటిరెడ్డి పున్నారెడ్డి**

**కుత్బుల్లాపూర్, నవంబర్ 1 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ లోని శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ ల్లో బూమ్స్ అకాడమీ వారిచే నిర్వహించబడుకున్న జాతీయ కర్రసాము సదస్సు, సెలెక్షన్స్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు జాతీయ కర్రసాము నిర్వాహకులు మహమ్మద్ రఫీ షేక్ అధ్యక్షత వహించగా టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుందని, ఇలాంటి సంప్రదాయ క్రీడలను ఆదరించాలని, ఇలాంటి ఆటలే పిల్లల మేధస్సును పెంపొందిస్తాయని వివరించారు. ఈ కార్యక్ర మానికి శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ వైస్ చైర్మన్ శ్రీమతి చైతన్య పున్నారెడ్డి, బూమ్స్ అకాడమీ నిర్వాహకులు శ్రీ కృష్ణ, కర్రసాము ప్రదర్శించే చిన్నారులు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పరిధిలో మహిళ అదృశ్యం

### పీఎస్‌లో ఫిర్యాదు చేసిన భర్త



**జవహర్‌నగర్, నవంబర్ 1 (నినాదం):** మహిళ అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సైఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ కు చెందిన ముత్తాడి స్నేహ (20) కు నాగేష్ తో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. ఈనెల 31వ తేదీన సాయంత్రం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో నగేష్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో స్నేహ ఇంటి నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ మేరకు భర్త చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికినా తెలిసిన వారి వద్ద వెతికినా స్నేహ ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు స్నేహ భర్త జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కేడిపి ఆధ్వర్యంలో కొనసాగిన నిరసన దీక్ష



**వికారాబాద్, నవంబర్ 1(నినాదం):** కే డిపి జెఏసి తలపెట్టిన నిరసన దీక్ష శనివారం కొడంగల్ పట్టణం లోని అంబేద్కర్ కూడలిలో మొదటి రోజు సజావుగా సాగింది. నిరసన దీక్ష కు టెంటు వేసుకుని కూర్చోడానికి సిద్దపడిన కెడిపి జేఏసీ సభ్యుల ఆలోచనకు స్థానిక పోలీసులు నిరాకరించడంతో, ఎండను సైతం లెక్క చేయకుండా, ఫుట్ పాత్ పై బైఠాయించి నిరసన దీక్షను కొనసాగించారు. ఈసందర్భంగా కెడిపి జేఏసీ నాయకులు మాట్లాడుతూ కొడంగల్ ను అన్ని రంగాలుగా అభివృద్ధి చేస్తానని రెండు దశాబ్దాలుగా మాట్లాడుతున్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో కొడంగల్ లో ఏ లాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రేవంత్ రెడ్డి రెండు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏ లాంటి పరిశ్రమలు నెలకొల్పలేదని, ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాల నిర్మాణాలకు ఇటీవల ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన చోట పనులు ప్రారంభించి, ప్రారంభించిన పనులను మధ్యలో ఆపేసి లగచర్ల హకీంపేట్ లకు తరలించడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించి కొడంగల్ లో మెడికల్ కళాశాల ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల లలతోపాటు అదనంగా ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు నెలకొల్పాలని కోరారు. ఈకార్యక్రమంలో కెడిపి జేఏసీ కో కన్వీనర్ లు గంటి సురేష్, ఎర్రన్ పల్లి శ్రీనివాస్, యు.రమేష్ బాబు, మాసాని వెంకటయ్య, రాథోడ్ సూర్యనాయక్,వడ్డె భీమరాజు, మాజీ సర్పంచ్ రమేష్ బాబు, నర్మద కిష్టప్ప,బుస్స చంద్రయ్య, డాక్టర్ కన్నోజు వెంకటేశ్వర్లు, కూర వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చినా ఆగని కబ్జాలు

**పరికి చెరువు పరిరక్షణ కమిటీ**



**కుత్బుల్లాపూర్, నవంబర్ 1 (నినాదం):** కుత్బుల్లాపూర్ మండలంలోని జగతగిరిగుట్ట, ఎల్లమ్మ బండ, కూకట్పల్లి లోని ఆల్విన్ కాలనీ లో విస్తరించి ఉన్న పరికించి చెరువు ను రక్షించాలని కోరుతూ గత కొద్దీ సంవత్సరాలనుండి నుండి చెరువు పరిరక్షణ కమిటీ పేరుతో ఉద్యమిస్తుంటే హైడ్రా కమిషనర్ కు వినతిపత్రం సమర్పించాం. గత ఫిబ్రవరి నెలలో హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేశారు. మళ్ళీ కూల్చిన చోట నిర్మాణాలు జరగడమే కాకుండా మరింత విస్తరించాయని, ఇలాగే కొనసాగితే పరికి చెరువు ఆనవాళ్ళు లేకుండా పోయే ప్రమాదం వున్నదని పరికిచెరువు పరిరక్షణ కమిటీ ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా మరోసారి దృష్టి పెట్టి అక్రమంగా ఏర్పడ్డ నిర్మాణాలను కూల్చివేసి మిగిలివున్న పరికి చెరువును కాపాడాలని శనివారం జగద్గిరిగుట్ట లో పరికి చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు సమావేశామై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హైడ్రా ఇతర చెరువులను అభివృద్ధి చేసినట్టు పరికి చెరువు ను అభివృద్ధి చేయుటకు సరిహద్దులను నిర్ణయించి హద్దులను ఏర్పాటు చెయ్యాలని కోరారు. అక్రమంగా కబ్జా చేస్తూ ప్రభుత్వ స్థలాన్ని అమ్ముతున్న కబ్జాదారుడి పై పిడి యాక్ట్ అమలు చెయ్యాలని ప్రభుత్వానికి, హైడ్రాధికారులకు సూచించారు. పరికిచెరువును పరిరక్షించే విషయంలో హైడ్రా కమిషనర్ నుండి స్పందన రాకపోతే మరోసారి హైడ్రా కు వినతిపత్రం ఇవ్వడమే కాకుండా ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరికి చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉమా మహేష్,సభ్యులు సాయి పంతులు,పవన్, ప్రవీణ్, బాబు,సహదేవ్ రెడ్డి పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్వామి వ్రతం పూజలో ఎమ్మెల్యే



**అల్వాల్, నవంబర్ 1 (నినాదం):** ఆల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి తుర్కపల్లి లోని హీల్టాన్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి ఆశీస్సులతో అందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యం కలగాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## ప్రభఅక్రమ నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు

**డిపోచంపల్లి సర్వేనెంబర్ 120లో అక్రమ నిర్మాణాలు నేలమట్టం**

**దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్, నవంబరు 1 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్-గండిమైసమ్మ మండల డిపోచంపల్లి పరిధిలోని సర్వే 120 ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దుండిగల్-గండిమైసమ్మ ప్రభుత్వ భూముల రక్షణకు శ్రీకారం చుట్టిన రెవెన్యూ అధికారులు ఐదు ఎకరాలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వాటిని పూర్తిగా తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవంటూ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.దళారులను నమ్మి మోసపోవద్దని తాసిల్దార్ ప్రజలకు సూచించాడు. కూల్చివేతల సమయంలో స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పోలీస్ బందోబస్తు నడుమ అక్రమనిర్మాణాలను పూర్తిగా తొలగించారు. సదరు భూమి చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. పక్కనే ఉన్న సర్వేనెంబర్ 120/1 ప్రభుత్వ భూమిలో దసరా, దీపావళి సెలవుల్లో సుమారు 40కి పైగా రూములు నిర్మించినా వాటివైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. సర్వేనెంబర్ 120/1లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలంటూ డిమాండ్ వినిపిస్తుంది. న్యాయం చేయాలంటూ బాధితులు రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు.

## రోడ్ల సమస్యపై ఉవ్వెత్తున నిరసన జ్వాల



**జవహర్‌నగర్, నవంబర్ 1 (నినాదం):** రోడ్డు మార్గాలు అభివృద్ధికి సూచికలని ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సరైన రోడ్డు, తదితర సౌకర్యాలు ఉండాలని రోడ్డు మార్గాలే ప్రగతి హేతువులని అటువంటి రోడ్ల సమస్య జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండడం మన అభివృద్ధికి నిరోధకమని జవహర్ నగర్ బిజెపి పశ్చిమ శాఖ అధ్యక్షుడు కమలాకర్ దుయ్యబట్టారు. జవహర్ నగర్ పశ్చిమ శాఖ బిజెపి ఆధ్వర్యంలో శనివారం ఫైరింగ్ రేంజ్ నుండి ఆర్మీ హనుమాన్ ఆలయం వరకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రోడ్డు సమస్య, అభివృద్ధిపై బీజేపీ నాయకులు ప్రజల పక్షాన నిలబడి అలుపెరగని పోరాటం చేస్తున్నారని, రోడ్డు సమస్య విషయంలో మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో రోడ్ల సమస్య గురించి విన్నవించగా ఈటల రాజేందర్ రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి మోర్చా ఓబీసీ ప్రతినిధి రంగుల శంకర్, ఉడత సంతోష్ గుప్తా, ముత్యం సుజాత, కుర్ర పుణ్యరాజు, మహేందర్ యాదవ్, మరాటి బాబు, ముచ్చర్ల యాదగిరి, శ్రీనివాసరెడ్డి, రాజు, మల్లేష్ గౌడ్, నవీన్ ,చంద్రశేఖర్, రవి ,లక్ష్మీరెడ్డి, పటేల్ గురుమూర్తి, రామ నాయక్, ఈశ్వర్ రెడ్డి, శివప్రసాద్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య కేంద్రం

**లయన్స్ క్లబ్ సహకారంతో 200 మందికి కంటి పరీక్షలు**

**అవసరమైన వారికి ఆపరేషన్ ఏర్పాట్లు**



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, నవంబర్1,(నినాదం):** ప్రతిఒక్కరూ కళ్ళకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం సీనియర్ అడ్వైజర్ పిట్ల మోహన్ రాజ్ అన్నారు. శనివారం మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం భవనంలో ఉచిత మేఘా కంటి పరీక్షల శిబిరం లయన్ ఎమ్మెస్ రెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి పైన హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్లు ఉన్నవారికి ఆపరేషన్ ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సలహాదారులు పిట్ల మోహన్ రాజ్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు ఎస్ రాంచందర్, ప్రధాన కార్యదర్శి పి లక్ష్మీనారాయణ, ఉప కార్యదర్శి రాందాస్ ధనరాజ్, వారితోపాటు ముదిరాజ్ సంఘం సభ్యులు రాందాస్ అశోక్, మహంకాళి శ్రీను, కటికల గోపాల్ హనుమంతరావు, రాందాస్ సంతోష్ ముదిరాజ్, గాంధీ నారాయణ, మహేందర్, బళ్లారి అశోక్, మర్రి ప్రభాకర్ ప్రభాకర్, యాదగిరి, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు. కంటి పరీక్షల శిబిరానికి సహకరించిన ముదిరాజు సంఘం నేతలకు కుటుంబ సభ్యులకు పిట్ల మోహన్ రాజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా ఎమ్మెల్యే రోహిత్ జన్మదిన వేడుకలు



**అల్వాల్, సెప్టెంబర్ 1(నినాదం):** మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తనయుడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదిన వేడుకలను సుభాష్ నగర్ లోని అమ్మవారి టెంపుల్ దగ్గర పాఠశాల విద్యార్థి విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహిస్తున్నారు.అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాణాసంచా కాల్చారు. సీనియర్ నాయకులు మాట్లాడుతూ ముందు ముందు ఎన్నో ఉన్నత పదవులు పొందాలని భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్, కృష్ణ గౌడ్, సి ఎల్ యాదగిరి, మూడు డివిజన్ల అధ్యక్షులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, ఉదయ్, భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులు శివ కుమార్, సూర్య కిరణ్, వెంకట్రావు, శివ, నాగేశ్వరరావు, శేఖర్, దశరథ యాదవ్, నరేష్, మధు గౌడ్ ,శివ శంకర్, వెంకట్, సాయిరాం గౌడ్, మహిళా నాయకులు మీనస్ మేరీ, పద్మ, లక్ష్మి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన చీఫ్ విప్



**వికారాబాద్, నవంబర్ 1(నినాదం):** జిల్లా పరిధిలోని బషీరాబాద్ మండలం మాజీ సర్పంచ్ ప్రియాంక భర్త శ్రావణ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకొని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న శ్రావణ్ ను పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో తో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలన్నారు. అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారికీ మనోధైర్యనిచ్చారు. అదేవిధంగా పెద్దేముల్ మండలం మంచాన్ పల్లి గ్రామానికి చెందిన మూడవత్ శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. హై టెక్ సిటీ లో చికిత్స పొందుతున్నారు. ఆయనను కూడా మహేందర్ రెడ్డి ఆసుపత్రి కి వెళ్ళి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందించారు.. మెరుగైన చికిత్స కోసం వైద్యులకు సూచించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ మాన్య నాయక్, వర్ధ్య శ్రీనివాస్, మూడవత్ రాజు, నరేష్, భాస్కర్, లక్ష్మణ్, బానోత్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# దొంగలకు సద్దికట్టే "ధోరణి వద్దు..!

**100 కోట్ల కబ్జాపై స్పందించని ఎమ్మెల్యే !**

**ప్రజల పక్షాన ఉండాలని వేడుకోలు..!**



**జగిత్యాల ప్రతినిధి నవంబర్ 1 (నినాదం):** జగిత్యాల పట్టణ ప్రధాన కూడలిలో 20 గుంటల మున్సిపల్ స్థలం కబ్జా పై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇప్పటివరకు నోరు మెదపలేదు తన అభిప్రాయాన్ని వెల్లడించలేదు. జిల్లా ప్రజలు ఎమ్మెల్యే అభిప్రాయం కోసం నిరీక్షిస్తున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య రాజకీయ వైరం పొగసూరుతూనే ఉంది. . గత రెండు సంవత్సరాలుగా ఒకరికొకరు భిన్నంగా వ్యవహరిస్తూ జిల్లా అధికార యంత్రాంగానికి కార్యకర్తలకు తలనొప్పిగా మారిందనే నిరసనలు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. 20 గుంటల మున్సిపల్ స్థలం కబ్జా అంశం జగిత్యాల జిల్లా పట్టణ ప్రజలకు సంబంధించింది. 100 కోట్ల ప్రభుత్వాస్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఎమ్మెల్యే పై ఉంది. మంత్రులుగా ఎంపీలుగా పనిచేసిన జీవన్ రెడ్డి , ఎల్ రమణ ల నిర్వాకం తో తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు కబ్జా చేసిన పెట్రోల్ పంప్ యజమాని యాజమాన్య హక్కుల కోసం న్యాయస్థానాలను కూడ తప్పుదారి పట్టించే స్థాయికి ఎదిగారనే విమర్శలు వినిపిస్తున్నాయి.(చివరకు పెంచిన వారే తుంచే పనికి పూనుకోవడం విశేషం) ఎమ్మెల్యే సంజయ్ కుమార్. ఏడు సంవత్సరాల రాజకీయ అనుభవం. రాజకీయాల్లో చేరక ముందు నుంచే పెట్రోల్ పంప్ యజమాని మంచి మిత్రుడు. 20 గుంటల ప్రభుత్వ స్థలం 100 కోట్ల ఆస్తిని జగిత్యాల ప్రజలకు అప్పగించడం కోసం ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల వెంట ఉంటారా..? లేక మిత్రుడికి సహాయం చేయడానికి సీఎంకు సర్ది చెప్పే ప్రయత్నం చేస్తారా..? ఆసక్తి రేపుతున్న అంశం. జగిత్యాల నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నిజాయితీని నమ్మి రెండు సార్లు గెలిపించారు. విలువైన స్థలాన్ని నియోజకవర్గ ప్రజల భావితరాలకు అందించి నికార్సైన ప్రజాప్రతినిధిగా ప్రూఫ్ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మంచి మిత్రుడుగా నిరూపించుకోవాల్సిన అవకాశం కూడా ఉంది. ఈ రెండింటిలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఏ అంశాన్ని ఎన్నుకుంటారనే ఆసక్తి నెలకొంది. పెట్రోల్ పంప్ యజమాని దగ్గర కిభాలానే ఓ దిక్కుమాలిన పేపర్ తప్ప మరోటి లేదనేది తేలిపోయింది. రెవిన్యూ శాఖలో డబ్బులు ఇస్తే కానీ పని అంటూ లేదు. రిజిస్ట్రేషన్ శాఖలో కూడా ఫేక్ డాక్యుమెంట్లతో భూములు కొట్టేసే ప్రయత్నాలను చూస్తున్నాం. ఇలాంటి తరుణంలో ఏళ్ల తరబడి కోర్టులో తన యాజమాన్య హక్కులు నిరూపించుకోలేని మిత్రుని వైపు ఉండి జగిత్యాల పట్టణ ప్రజలకు ద్రోహం చేస్తారా? దొంగకు సద్ది కట్టే ధోరణి అయితే రాజకీయ జీవితంపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితులు ఎదురుపడతాయి. ప్రస్తుతం కల్వకుంట్ల కుటుంబం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసి కోట్ల కుప్పేసుకుని రాజకీయ భవిష్యత్తు లేకుండా చేసుకున్నారు. సామాజిక వర్గం అదే అయినా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వ్యవహార శైలి పేదల పక్షాన్నే ఉంటుందని నియోజకవర్గ ప్రజలు నమ్ముతున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మరిన్ని పేరు ప్రఖ్యాతలు మరింత మెరుగైన రాజకీయ జీవితం అనుభవించే ఆస్కారం ఉంటుందనే చర్చ నడుస్తుంది.

## తన్నీరు సత్యనారాయణ రావు మృతి బాధాకరం

**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం) :** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మృతిచెందగా శనివారం సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన కరీంనగర్ కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. శనివారం హైదరాబాదులోని హరీష్ రావు నివాసంలో తన్నీరు సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించినట్లు రమేష్ తెలిపారు. ఆయన మృతి బాధాకరమని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు రమేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



# పంట నష్టపోయిన ఫీల్డ్ విజిట్ చేయడంలేదు..!

**అధికారులపై మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆగ్రహం**



**జగిత్యాల ప్రతినిధి నవంబర్ 1 (నినాదం):** తుఫాను వలన. పంట నష్టపోయిన ప్రాంతాలను అధికారులు ఫీల్డ్ విజిట్ చేయడం లేదని దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు శనివారం ఆయన జిల్లాలోని సారంగాపూర్ మండలం మట్టపల్లి పోతారం గ్రామాల్లో పంట నష్టపోయిన పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలిసిన ధాన్యాన్ని పరిశీలించారు ఈ సంద ర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ దీనితో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఉన్నారు. జిల్లా అధికారులతో ఫోన్ లో మాట్లాడిన జీవన్ రెడ్డి కలెక్టర్ గ అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మీ స్థాయిలో ఫీల్డ్ విజిట్ చేయడం చూశాను అని అన్నారు కానీ గ్రామాలలో అధికారులు జిల్లా అధికారులు పరిశీలన చూసి కూడా గ్రామ స్థాయిలో ఎలాంటి చలనం లేదు అన్నారు దీనికి కారణం రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులలో సమన్వయం లేకపోవడమే అని అన్నారు.ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి గారు తడిసిన ధాన్యం రంగు మారిన మొలకలెత్తిన రైతులకు నష్టం కాకూడదని కొంటామని నష్టపోయిన రైతులకు 10,000 రూపాయల నష్ట పరిహారం ఇస్తామని ప్రకటన చేసిన తర్వాత రైతులలో ఆత్మస్థైర్యం నెలకొంది అని అన్నారుకానీ అధికారుల వ్యవహార శైలితో ఆ నమ్మకం కలగడం లేదన్నారు చాలా కష్టపడి రైతు పంట పండిస్తే చేతుకు వచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలు అకాల వర్షాలతోని చేతికి వచ్చిన పంట నేలకొరిగిపోవడం దాన్యం కల్లాలలోనే మొలకెత్తడం బాధాకరం అన్నారు బట్టపల్లిలో దాదాపు 200 ఎకరాలు నెలకొరిగిపోయింది పంట కోయాలన్న ఆ పొలం పదన ఆరడానికి కనీసం వారం పైన పెట్టె పరిస్థితి ఉందన్నారు.ఎక్కడ కూడా హార్వెస్టర్ నడిచే పరిస్థితి లేదు దాదాపు ఒక ఎకరానికి 5,000 రూపాయలు హార్వెస్టర్ ఖర్చు వచ్చే పరిస్థితి ఉందన్నారు. సగం పంట నేలకొరిగిపోయింది సగం పంట వచ్చింది కూడా ధాన్యం తడిసి మొలకెత్తడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్న భావనతోని ముఖ్యమంత్రి గారు వ్యవసాయ శాఖ మంత్రి గారు స్పందించి ఎకరా కనీసం 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందింప చేయడం జరుగుతుందని ప్రకటింపచేయడం జరిగిందన్నారు ధాన్యం తడిసిన మొలకెత్తిన రంగు మారిన రైతుకు ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరింప చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆలోచన విధానానికి అనుగుణంగా రెవెన్యూ అధికార యంత్రాంగంలో చలనం కనబడుతున్నట్టు కనబడట్లేదన్నారు.కలెక్టర్ అదనం కలెక్టర్ రెవెన్యూ కొన్ని ఫీల్డ్ విజిట్ చేశార న్నారు.కలెక్టర్ గారు ప్రతి ఫీల్డ్ విజిట్ చేయడం సాధ్యం కాదన్నారు కలెక్టర్ గారు ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు అంటే ఇతర రెవెన్యూ అధికారులకు మార్గదర్శకంగా నిలుస్తుంది సారంగాపూర్ మండల ఎమ్మార్వో గారితో మాట్లాడితే వారిలో కదలిక ఉన్నట్టు కనబడ లేదన్నారు వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ సమన్వయంతోని ప్రకృతి వైపరీత్యాలలో రైతాంగాన్ని ఆదుకోవడమే గాని ప్రజానీకాన్ని ఆదుకోవడంలో ప్రధాన పాత్ర రెవెన్యూ అధికార యంత్రాంగానికి ఉంటుందన్నారు. నేలకొరిగిన పంటల పరిశీలన వివరాల నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తే ప్రభుత్వం నుండి మనకు వచ్చే సహాయం వస్తుంద న్నారు. అధికారులలో అలసత్వం పనికిరాదు ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఆరంభమైనట్టు కనబడటం లేదన్నారు ఇటువంటి పరిస్థితులలో తడిసిన ధాన్యాన్ని సేకరింప చేయడం జరుగుతుంది అంటే మైచర్ నిబంధనలు సడలింపు చేయాల్సి వస్తుందన్నారు అదనపు కలెక్టర్ రెవెన్యూ గ దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. మొ త్తం జిల్లాలో ఎక్కడెక్కడ అయితే పంట నేల కొరిగిందో ఆ వివరాలు సేకరించి ప్రభుత్వ పరంగా అందే సహాయాన్ని రైతులకు అం దింపచేయడం చర్యలు చేపట్టడంతో పాటు గా ధాన్యం సేకరణలు కూడా ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలలో ప్రత్యేక పరిస్థితులలో దాన్యం తడిసిపోవడం జరుగుతుంది కాబట్టి రైతు ఆందోళన చెందకుండా ధాన్యం తడిసిన రంగు మారిన మొలకెత్తిన రైతుకు అండ గా నిలిచే విధంగా సేకరింప చేయడం జరు గుతుందని పేర్కోవడం హర్షించదగ్గ విషయ మన్నారు.కొనుగోలు కేంద్రాలు అన్నీ కూడా తక్షణమే తూకం ఆరంభ చేసి ఆలోచన విధానానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికార యంత్రాంగం జిల్లాలో నేలకొరిగిన పంటల వివరాలన్నీ కూడా సేక రింపచేసి వారికి ప్రభుత్వం నుండి అందింప చేసే సహాయం అందింప చేయడానికి చర్య లు చేపడుతూ ధాన్యం సేకరణ పట్ల కూడా అవసరం వస్తే నిబంధనలు సడలించైనా కొనుగోలు తక్షణమే ఆరంభింప చేయాలి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆత్మవిశ్వాసాన్ని నింపవలసిన బాధ్యత క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగంపై ఉంటుంది ఆ దిశగా స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు మొక్కజొన్న మార్కెఫెడ్ ద్వారా సేకరింపచేయాలని అనుకోవడం సంతోషం కొంతమేరకు ఊరట కలిగించింది కానీ 18 క్వింటాల్ పరిమితి నిబంధనను సడలించాలన్నారు.కేంద్ర ప్రభుత్వం కూడా న్యాఫెడ్ ద్వారా మొక్కజొన్న సేకరణకు రాష్ట్ర ప్రభుత్వానికి తోడు నిలబడాలి మద్దతు ధర కల్పన అనేది కేంద్ర రాష్ట్ర ఇరు ప్రభుత్వాల బాధ్యత అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది కేంద్ర ప్రభుత్వం కూడా తోడు నిలవాలి 18 క్వింటాళ్ల పరిమితి తోని రైతు కొంత అయోమయానికి గురవుతున్నారన్నారు మొక్కజొన్న సేకరణ పాస్ బుక్ ఆదరంగా కొనుగోలు చేయండి విక్రయదారుని తంబు తీసుకోవాలి లేదు అంటే వీఆర్వో సర్టిఫికెట్ తీసుకోవాలి అందరు రైతులు స్థానికంగా అందుబాటులో ఉండే అవకాశం లేదన్నారు

## ఆకట్టుకున్న పారమిత టెడ్ ఎడ్ టాక్స్

**కరీంనగర్, నవంబర్ 1(నినాదం):** కరీంనగర్ లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో 25 జూలై న టెడ్ ఎడ్ టాక్స్ నిర్వహించడం జరిగింది. గత సంవత్సరం కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలాసపతి గ పరమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు మధ్యన ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో భాగంగా ఎంవోయూ లో సంతకం చేయడం జరిగింది. ఈ యొక్క ఎంఓయు ప్రకారంగా పారామిత విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఈ అంతర్జాతీయ వేదికపై మాట్లాడ డానికి సంబంధించిన శిక్షణను ఇవ్వడానికి నిర్ణయించడం జరిగింది.ఎంఓయు ప్రకారంగా ఇప్పటివరకు ఆరుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు టెడ్ జాతీయ వేదికపై మాట్లాడడం జరిగింది. వారి యొక్క టెడ్ టాక్స్ అమెరికా యొక్క టెడ్ ప్రధాన కార్యాలయం చే ఆమోదింపబడి ప్రపంచవ్యాప్తంగా ప్రచురింపబడ్డాయి.



## నిరుపేదలకు వరం సీఎం సహాయ నిధి

**లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ప్రణవ్**

**పేదవారి పట్ల చిత్తశుద్ధి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ**

**చెక్కుల పంపిణీ విషయంలో జాప్యం వహించం**



**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం):** పేదవారి పట్ల,ఆరోగ్య రీత్యా హాస్పిటల్ లో చేరికైన వారికి మానవతా దృక్పథంతో అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో ఎలాంటి జాప్యం వహించకుండా చెక్కులు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 47,62,000/- విలువ చేసే 135 చెక్కులను లబ్ధిదారులకు ప్రణవ్ స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కులు వచ్చిన లబ్ధిదారులు త్వరగా బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ అంటే పేదల పార్టీ అని పేద వారికి అండగా ఉండడం తమ కర్తవ్యమని అన్నారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కష్టకాలంలో ఆదుకున్న సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులకు,పార్టీ ఇంచార్జి ప్రణవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ,మండల,జమ్మికుంట పట్టణ,మండల,వీణవంక, కమలాపూర్ నాయకులు పాల్గొన్నారు.

## దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

**-వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసిన డాక్టర్ శ్రీకాంత్ రాజు**



**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం) :** జమ్మికుంట పట్టణంలో లలితా దంత వైద్యశాల ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ ఎర్రం రాజు శ్రీకాంత్ రాజు శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తన మాతృమూర్తి లలిత ఆశీస్సులతో ఏర్పాటు చేసిన లలితా దంత వైద్యశాల మన సేవలను గత 25 సంవత్సరాలుగా ప్రజలకు అందిస్తూ మంచి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం వైద్య శిబిరానికి సుమారు 120 మంది రోగులు వచ్చి తమ సమస్యలను వైద్యులకు తెలిపి వైద్యాన్ని చేయించుకున్నట్లు డాక్టర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సుమారు 120 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ శ్రీకాంత్ రాజు తెలిపారు. భవిష్యత్తులో ప్రజల ఆశీర్వాదంతో ఇలాంటి సేవలు మరిన్ని చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి ఆస్పత్రి సిబ్బంది స్రవంతి కౌముదిని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ బండ ప్రకాష్



**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం) :** పెద్దపల్లి ప్రభుత్వ ఐటిఐ విశ్రాంత కళాశాల ప్రిన్సిపల్ బల్ల సత్యనారాయణ కుమారుడి వివాహం సిద్దిపేట లోని పోలీస్ కన్వెన్షన్ హాల్ (పొన్నాల) లో జరగగా వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ బండ ప్రకాష్ కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు సామ్రాజ్యం నాయకులు తిరుపతి రాజేందర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్లైయిమ్ చేయని ఆస్తులపై అవగాహన కల్పించాలి

**ఉద్గమ్ పోర్టల్ ప్రాధాన్యత వివరించాలి**

**కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, నవంబర్ 1(నినాదం):** దీర్ఘకాలంగా క్లెయిమ్ చేయని ఆస్తులు బ్యాంకు డిపాజిట్లు, బీమా, పీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్, షేర్లను క్లెయిమ్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి.. బ్యాంకు, భీమా, ఆర్థిక సంస్థల ప్రతినిధులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరి యంలో బ్యాంకు, బీమా, నియంత్రణ సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశానికి లికలెక్టర్లి హాజరై మాట్లాడారు. బ్యాంకు ఖాతా ప్రారంభించేటప్పుడు అన్ని వివరాలు పూర్తిగా నింపి.. నామినీ వివరాలు తప్పని సరిగా రాయాలన్నారు. పలువురు ఉద్యోగ, ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాల్లో నివసించినప్పుడు వివిధ ఆర్థిక సంస్థల్లో చేసిన ఇన్వెస్టెంట్లు.. క్లైమ్ చేయకుండా వదిలేశారన్నారు. దీంతో వారి అడ్రస్ , కుటుంబసభ్యుల వివరాలు తెలియక ఖాతాల్లోనే సొమ్ము ఉండిపోయిందన్నారు. ఆధార్, ఫోన్ వచ్చిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా క్లైమ్ చేయని ఆస్తులు రెండు లక్షల కోట్లు ఉందని.. వీటిని అర్హులైన పౌరులకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉద్గం పోర్టల్ ను ప్రవేశపెట్టిందన్నారు.గుజరాత్ లో అక్టోబర్ 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. మీ డబ్బు మీ హక్కు అనే నినాదంతో దీనిని ప్రారంభించారన్నారు. సంబంధిత బ్యాంకులు, సంస్థల వద్దకు వెళ్లి మీ వద్ద ఉన్న సరైన పత్రాలు సమర్పించి నగదు పొందాలని సూచించారు. డిసెంబర్ 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని.. గ్రామాల వారీగా స్టాళ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఈ కార్యక్రమం గురించి వివరించాలని పేర్కొ న్నారు. పదేళ్లు ఖాతాను వినియోగించకుండా ఉంటే డీఫ్ ఫండ్ లోకి వెళుందన్నారు. ఎవరైనా వివరాలు సమర్పిస్తే డీఫ్ నుంచి యాక్టివేట్ చేసి జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని ప్రతినిధులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. క్లీన్ చేయని డిపాజిట్లు, బీమా, పీఎఫ్ వంటి వాటపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కేవైసీ, ఫోన్ నెంబర్, అడ్రస్, అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ముందు చూపుతో ఆలోచిస్తే ఇలాంటి సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. డీజీఎం సోలంకి మాట్లాడుతూ కలెక్టర్ చొరవతో రెండు నెలల్లో కొన్ని ఖాతాలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఎస్ఎల్ బీసీ చైర్మన్ శ్రీహరి మాట్లాడుతూ.. క్లైమ్ చేయని ఆస్తులను అర్హులకు అప్పగించాలనే ఉద్దేశంతో 90 రోజుల క్యాంపెయిన్ను జిల్లాల వారీగా ప్రారంభించినట్లు వివరించారు. మీ వద్ద ఉన్న వివరాలతో బ్రాంచ్ కి వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. యూబీఐ డీజీఎం అపర్ణ రెడ్డి మాట్లాడుతూ క్లైమ్ చేయని ఖాతాదారులను కనుక్కునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్ మాట్లాడుతూ.. నామినీ పేరు నమోదు చేయకపోవడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

## గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన

**-అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ డాక్టర్ అశ్విని తానాడే వాకాజీ**



**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం):** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధం చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ నోడల్ ఆఫీసర్ బిబి స్కీం డాక్టర్ అశ్విని తానాడే వాకాజీ అన్నారు.బేటి బచావో బేటి పడావో పథకంలో భాగంగా హుజురాబాద్ మున్సిపల్ ఆఫీస్ లో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ నోడల్ ఆఫీసర్ బి బి స్కీమ్ డాక్టర్ అశ్విని తానాడే వాకాజీ మాట్లాడుతూ పి సి పి ఎన్ డి టి ఆక్ట్ గురించి ఎక్కువగా అవగాహన కార్యక్రమాల్లో నిర్వహించి గర్భస్థ ఆండ శిశు మరణాలని తగ్గించాలని,డేగ ఆపరేషన్ ఎక్కువగా నిర్వహించాలని, మొదటి బిడ్డగా ఆడపిల్ల జన్మించి రెండవసారి గర్భం దాల్చిన మహిళలకు ఆడ మగ మధ్య లింగ భేదాలు లేకుండా ఉండాలని అవగాహన కల్పించారు. వైద్య శాఖకు సంబంధించిన అధికారులు సైతం ఈ చట్టంపై గ్రామాలలో ప్రతి ఒక్కరికి అవగాహన ఉండేలా తగు చర్యలు చేపట్టాలని సూచించారు.డిఎంఅండ్హెచ్ఓ. వెంకటరమణ , మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ,మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వారణాశిలో రాజరాజేశ్వర స్వామి దివ్య కళ్యాణోత్సవం



**వేములవాడ, నవంబర్ 01(నినాదం) :** పవిత్ర వారణాశి క్షేత్రంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ఉత్తర్వుల మేరకు వేములవాడ ఆలయ అర్చకుల వేదమంత్రో చ్ఛారణలు, సాంప్రదాయ సంగీత సప్తస్వరాలతో వైభవోపే తంగా కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వేములవాడ ఆలయ ప్రతిష్ఠతను, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ప్రతిష్ఠించిందని వేములవాడ రాజన్న ఆలయ ఈవో రమాదేవి అన్నారు. వారి వెంట ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఉన్నారం భాస్కర్, స్థానాచారి ఇన్చార్జ్ నమిలికొండ ఉమేష్ పాల్గొన్నారు.

## డాక్టరేట్ పట్టా పొందిన ప్రభాకర్‌కు ఘన సన్మానం

**అంబాల సేవలు అభినందనీయం**

**ప్రముఖ వ్యాపారవేత్త రాజేంద్రప్రసాద్**



**జమ్మికుంట, నవంబర్ 1 (నినాదం)** ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని హొసూర్ నగరంలో ఏషియ ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ వారు జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ (ప్రభు) సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ పొందిన సంద ర్భం పురస్కరించుకొని పవన్ మోటార్స్ అధినేత రాజేంద్రప్రసాద్ తన షో రూమ్ లో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ సంద ర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంత చిత్రకా రులుగా పని చేస్తూ బాబాసాహెబ్ అంబేద్కర్ సూచించిన దారిలో ' పే బ్యాక్ టు ద సొసైటీ ' అనే నినాదంతో తనకు ఆర్ట్ ద్వారా వచ్చిన డబ్బుల నుండి సమాజ సేవ చేస్తూ అందరి మన్ననలు పొందారు. సామాజిక సేవ రంగంలో గౌరవ డాక్టరేట్ పట్టాకే వన్నె పెరిగిందన్నారు, ఆయన చిత్రకారుడే కాకుండా జర్నలిస్టుగా క్రీడారంగంలో జాతీయస్థాయిలో పతకాలు సాధించి ఈ గడ్డకు వన్నెతెచ్చారని, తను చేస్తున్నటు వంటి సామాజిక సేవలో మేము కూడా భాగస్వామ్యం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పబ్బు శ్రీనివాస్, ఇల్లంతకుంట మండలం సిపిఐ కార్యదర్శి మాదారపు రత్నాకర్ ఇతరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలి**

**తడిసిన ధాన్యం ఏ స్థితిలో ఉన్న వెంటనే కొనుగోలు చేయాలి**

**కొత్తపల్లి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి**



**కరీంనగర్, నవంబర్ 1(నినాదం):** అకాల వర్షానికి కొత్తపల్లి మండలంలో పంట నష్టపోయిన రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని, తడిసిన ధాన్యం ఏ కండిషన్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బిజెపి కొత్తపల్లి మండల అధ్యక్షులు కుంట తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రోజున కొత్తపల్లి తహసిల్దార్ కార్యాలయం ఎదుట రైతులను ఆదుకోవాలని ఆందోళన కార్యక్రమం చేపట్టి, ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కుంట తిరుపతి మాట్లాడుతూ మెంథా తుపాను రైతులకు కన్నీరు మిగిల్చిందని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చేతికి వచ్చిన పంట పూర్తిగా దెబ్బతిందని, అనేక ప్రాంతాల్లో పంట పొలాలు నీటిలో మునిగిపోయాయని, వడ్ల కుప్పలు వరద తాకిడికి కొట్టుకుపోయి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతాంగం దిక్కు తోచని స్థితిలో ఉందన్నారు. ధాన్యం తడిసిపోవడం, పంటలు నేలరాలిపోవడం, వరదల్లో కొట్టుకుపోవడం చూసి రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు. ఆరుగాలం శ్రమించి కోతకు సిద్ధమైన పంట నీటిపాలైందని, రైతుల కష్టం వృథా అయి, వారికి కన్నీళ్లను మిగిల్చిందన్నారు. యూరియా, విత్తనాలు దొరకక, రైతు భరోసా ఆలస్యమై, ఇప్పటికే రైతులు ఇబ్బంది పడ్డారని , మళ్లీ ఈ తుఫాను దెబ్బతో రైతుల బాధ వర్ణాతీతంగా మారిందని , వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల కు పంటను తీసుకువచ్చిన అటువైపుగా అధికారులు రాలేని పరిస్థితులు , పంట కొనుగోలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంట కొనుగోలుపై చేస్తున్న అలసత్వం నిర్లక్ష్యం కారణంగా నేడు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగం పట్ల వ్యవహరించిన తీరు మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ధ్వజమెత్తారు.. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి తక్షణం చర్యలు చేపట్టాలని, అలాగే తాలూ , తరుగు తేమ పేరిట రైతాంగాన్ని వేధించకుండా , ఇబ్బంది పెట్టకుండా పంట ఏ స్థితిలో ఉన్న కొనుగోలు చేయాలని డిమాండ్ ఆయన డిమాండ్ చేశారు.


## రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్**

**కరీంనగర్, నవంబర్ 1(నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతదేశ సైనిక శక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం పట్ల కరీంనగర్ బిజెపి శ్రేణులు ఆందోళన చేప ట్టారు. శనివారం సాయంత్రం కరీంనగర్లోని తె లంగాణ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టారు.పాల్గొన్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం ఓవర్గం ఓట్ల కోసం మన దేశాన్ని మన సైనికులను ఘోరంగా అవమానించారని ఆయన మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో మైనార్టీలను ప్రసన్నం చేసుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగజారి ఇండియన్ ఆర్మీ పై వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలన్నా రు. ఆపరేషన్ సింధూర్, ఇండియన్ ఆర్మీ ని అవమానించే రీతిలో మాట్లాడినందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాల ని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్**




**వేములవాడ, నవంబర్ 01 (నినాదం) :** జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మండలం హన్మాజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంచార్జి కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీ హెచ్ సీ లో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. గర్భిణీలు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ఇక్కడ అందుతున్న సేవలు, వసతులపై అవగాహన కల్పించాలని నిరంతరం పరీక్షలు చేసి వైద్యం అందించాలని సూచించారు. సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ఆసుపత్రికి వచ్చే వారికి వివరించాలని తెలిపారు. అనంతరం హన్మాజీపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, సిబ్బంది రిజిస్టర్లు పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యా బోధనను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యాలయం ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**వేములవాడ, నవంబర్ 01(నినాదం) :** ట్రాఫిక్, రోడ్డు నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు గత 14 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 71మంది మందు బాబులు పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు శనివారం కోర్టులో ప్రవేశపెట్టారు. వారిలో 14 మందికి జైలు శిక్ష, జరిమానా,57 మందికి జరిమానా విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి రోజు పట్టణ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశాలకు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఏర్పడుతాయని కావున నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

# పంట నష్ట వివరాలను వెంటనే అంచనా వేయాలి

**రాష్ట్ర నాయకుడు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



**మిర్యాలగూడ నవంబర్ 1(నినాదం):** తుఫాను వల్ల పంట నష్టపోయిన వివారాలను వెంటనే అంచనా వేయాలి అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారంనల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామంలో నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా వ్యవసాయ,రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి.. పంట నష్టం అంచనా వేయాలని కోరారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నష్టపరహారం ఎకరాకు పదివేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించినప్పటికీ. సంబంధిత శాఖల అధికారులు పంట నష్టం అంచనా వేయడం లేదంటే.. నష్టపరిహారం అందించే ఆలోచన ప్రభుత్వానికి లేదనేది స్పష్టమవుతుందన్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు.. చేతికొచ్చిన దశలో నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం రైతులను పరామర్శించకపోవడం.. పంట నష్టం అంచనా వేయకపోవడం వంటి చర్యలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ముఖ్యంగా యాసంగి ధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులనే ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా జిల్లాలోని రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారకుండా రైతుల ఆవేదనను అర్థం చేసుకొని మద్దతు ధర చెల్లించి.. ఎలాంటి కొర్రలు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి.. నష్టపరిహారం కింద ఎకరాకు 30 వేల రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. వారి వెంట కంపసాటి శ్రీనివాస్. పిఎన్వి ప్రసాద్. మేక రాంబాబు. శేఖర్. సిహెచ్ వెంకటయ్య. బొగ్గారం కృష్ణయ్య. జక్క నాగేశ్వరరావు. నూక పాంగ సత్యం. ఎస్.కె జాఫర్. మూగల ముసలయ్య యాదవ్. బొగ్గారపు నాగయ్య తదితరులు ఉన్నారు .

# ఇష్టపడి చదివితే మంచిర్యాంకులను సాధించవచ్చు

**మిర్యాలగూడ నవంబర్ 1 (నినాదం):** విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచిర్యాంకులు సాధించవచ్చు అని మిర్యాలగూడ కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం గ్రూప్ -1 విజేత లిటిల్ ఫ్లవర్ విద్యార్థి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన టి ఎస్ పి ఎస్సీ ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో స్థానిక హౌసింగ్ బోర్డు లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూలు కు చెందిన పూర్వ విద్యార్థి కుమారి కొండిపర్తి సత్య వేద కు రాష్ట్ర స్థాయిలో 269 వ ర్యాంక్ సాధించి, వనపర్తి జిల్లా అసిస్టెంట్ అడిట్ ఆఫీసర్ గా నియమితులైనందుక స్కూల్ ఆవరణ లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఎన్నో ఉద్యోగాలను నియమించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎం . ఇ. ఓ. బాలు నాయక్. ట్రస్మ టౌన్



ప్రెసిడెంట్ శ్రీ శ్రీపతి శ్రీనివాస్ విజేత తల్లి దండ్రులు కృష్ణమా చారి, శ్రీదేవి . పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ. కె. కె. జయరాజన్ ట్రస్మ అధ్యక్షుడు శ్రీపతి శ్రీనివాస్. పాఠశాల డైరెక్టర్ శ్రీమతి కె. కె.జిన్సీ జయరాజన్ గారు, హెడ్ మాస్టర్ సుజయ్ కుమార్ గారు, ఐ. ఐ. టీ. హెడ్ శ్రీ. ఎరగాని ప్రసాద్ గారు మరియు తదితర టీచింగ్ సిబ్బంది పాల్గొని, విజేతను అభినందించారు.

# ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు కోర్సులో శిక్షణ ఇవ్వాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ ప్రతినిధి నవంబర్ 1 (నినాదం):** ప్రణాళిక బద్ధంగా విద్యార్థులు. చదువుకున్న యువత, విద్యార్థులకు వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఈ విషయంపై సెట్విన్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా సెట్విన్ ద్వారా నిర్వహించే కోర్సులు ,వాటికి సంబంధించిన అర్హతలు, ఇతర వివరాలతో జిల్లాలో నీ అన్ని సంక్షేమ కళాశాలలు, పాఠ శాలలు, కేజీబీవీ లలో అవగాహన కల్పించాలని, ఇందుకుగాను ఒక షెడ్యూల్ రూపొందించాలని, వచ్చే వారం ఈ అవగాహన కార్యక్రమం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ,సెట్విన్ ప్రతినిధి రెనుకను ఆదేశించారు. అలాగే విద్యార్థులతో పాటు, చదువుకున్న నిరుద్యోగ మహిళలలు మహిళా ప్రాంగణంలో బ్యూటిషన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ విధమైన శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల అధికారులు ,ఆర్ సి ఓ లు వారి వారి విద్యాసంస్థల్లోని విద్యార్థులు మధ్యలో బడి ఎం మానేసిన వారు ఆయా కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు సెట్విన్ ప్రతినిది రేణుక మాట్లాడుతూ చదువుకున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సాంకేతిక నైపుణ్యం ఉంటే జీవితంలో రాణించడానికి అవకాశం ఉందని, సెట్విన్ ద్వారా సుమారు 30 కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, తమ శిక్షణ కాలం కేవలం మూడు నుండి ఆరు నెలలు మాత్రమే ఉంటుందని, దీని ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డిప్లమా సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని, ఐదవ తరగతి మొదలుకొని ఇంటర్ ఆపై పాసైన వారందరికీ నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థులు వారి విద్యను పూర్తి చేసుకున్న వెంటనే ఈ కోర్సులకు సంబంధించి సర్టిఫికెట్ వస్తుందని తద్వారా వారికి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, డిపిఓ యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, డిటిడిఓ చత్రు నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ సి ఓ లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## 15న ప్రత్యేక లోకాదాలత్

**నల్లగొండ ప్రతినిధి నవంబర్ 1 (నినాదం) :** రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం ఈ నెల 15న ప్రత్యేక లోకాదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి .సంపూర్ణ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల జిల్లాలోని కక్షిదారులు15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాల త్‌లో వారి పెండింగ్ కేసులు, ప్రీ లిటీగేషన్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

# దళితుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం చలో హైదరాబాద్

**నల్లబెల్లి నవంబర్ 1 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి సుప్రీంకోర్టు జస్టిస్ సీజేఐ గవాయ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా పోరాటం చేయాలనే సంకల్పంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దళితుల ఆత్మగౌరవ పోరాట ప్రదర్శన కార్యక్రమం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పరికి రత్నం మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు చలో హైదరాబాద్ పిలుపుకు ప్రతిస్పందిస్తూ ఉత్సాహంగా బయల్దేరారు. మండల కేంద్రంగా ప్రారంభమైన యాత్రలో వందలాది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొని నినాదాలతో ఆత్మగౌరవ



పోరాటానికి నాంది పలికారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పరికి రత్నం మాదిగ మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న అన్యాయాలపై ఇక మౌనం సాధ్యం కాదు. న్యాయం, సమానత్వం, గౌరవం కోసం ఎమ్మార్పీఎస్ నిరంతర పోరాటం కొనసాగిస్తుంది. చలో హైదరాబాద్ కార్యక్రమం దళితుల స్వాభిమానానికి ప్రతీకగా నిలుస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పరికి కోర్నెల్ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు నాగెల్లి అనిల్ మాదిగ, నల్లబెల్లి గ్రామ అధ్యక్షుడు పరికి పవన్ మాదిగ, మాజీ ఎంపీటీసీ జన్ను జయరావు, అలాగే నాగెల్లి ప్రకాష్, పరికి నవీన్, కనుకం నవీన్, పొడేటి కిషోర్, మనుగొండ సూర్య పవన్, పరికి సూర్యం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సంద ర్భంగా నాయకులు అందరూ ఏకకంఠంగా మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ అనేది కేవలం ఒక సంఘం కాదు, అది మాదిగ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీక. దళితుల సమస్యల పరిష్కారం కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది అని పేర్కొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన పాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య



**మల్హర్ నవంబర్ 01 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం పెద్దతుండ్ల శనివారం వాల రమ కిషన్ రావు దంపతుల కూతురు ప్రవళిక సుగ్యాన్ ల వివాహానికి హాజరైన పాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య, మాజీ సర్పంచ్ రాజు నాయక్, పెద్దతుండ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్ళ రవీందర్, సీనియర్ నాయకులు సుధాకర్ రావు, వెంకటస్వామి, అడువల మహేష్, అడువల శ్రీను, రమణారెడ్డి, మధుకర్, శివ, ప్రశాంత్, శ్రీధర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తా

**-జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన గణపారపు హరిబాబు**



**డోర్నకల్/మరిపెడ నవంబర్ 01 (నినాదం న్యూస్):** మహబూబాద్ జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సమితి,ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ ఆదేశాల మేరకు,మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్‌గా గణపారపు హరిబాబు నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషా రాణి జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,సంస్థ నియమ నిబంధనల ప్రకారం నిర్భందంగా పనిచేస్తూ,ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటపెట్టడమే కాకుండా, సమాచార హక్కు చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా నియమితుడైన జిల్లా కో- ఆర్డినేటర్ గణపారపు హరిబాబు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు జాతీయ ఛైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన సెక్రటరీ జనరల్ ధర్మరాజు,రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి,ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ గాడిపల్లి మధు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామిగా ఉండేందుకు కట్టుబడి ఉన్నానని, సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హరిబాబు అన్నారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకెళ్లాలి

**-చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎంఈఓ అనితాదేవి**




**డోర్నకల్/మరిపెడ నవంబర్ 01 (నినాదం న్యూస్):** శాస్త్రీయ దృక్పథంతో ముందు కెళ్లాలని మరిపెడ విద్యాశాఖ అధికారి గాదె అనితాదేవి అన్నారు. శనివారం మరిపెడ హైస్కూల్లో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను జనవిజ్ఞాన వేదిక బాధ్యులతో కలిసి ఆమె ఆవిష్కరించి,మాట్లాడారు నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నవంబరు 7న పాఠశాలల స్థాయి, 21మండల స్థాయి, 28 జిల్లాస్థాయి, డిసెంబరు 12 నుండి 14 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని జనవిజ్ఞాన వేదిక మరిపెడ మండల అధ్యక్షుడు బయగాని రాంమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు గౌరవ అధ్యక్షులు అనంతరావు, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, చెకుముకి కన్వీనర్ షేక్ సుబాన్, సామాజిక న్యాయ విభాగం శ్రీశైలం, సభ్యులు దేవుల, నెహ్రూ, ప్రకాష్, శౌరి, రమేష్ రెడ్డి, లెనిన్, ప్రసాద్ రావు, సారయ్య, సురేష్, బాబురావు, అనిత, సుధ, మంజు శ్రీ, శంకర్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్యం అందించిన యశోద ట్రస్ట్ వైద్యశాల

**-చిలుకూరు లో యశోద ట్రస్ట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం**
**ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి**



**కోదాడ (నినాదం):** గ్రామీణ ప్రాంతం చిలుకూరు లో కార్పొరేట్ స్థాయి వైద్య శాల ఏర్పాటు అని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ అన్నారు. శని వారం చిలుకూరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన యశోద ట్రస్ట్ హాస్పిటల్‌ను ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు పూర్తి వ్యాపార ధోరణి తో కాకుండా సేవ దృక్పదం తో సేవలు అందించాలన్నారు.నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల్లో వైద్య శాల పేరు గడించాలి అన్నారు. పేదలకు అందుబాటు లో ఉండే వైద్య శాల లకు ప్రభుత్వం పక్షాన సహకారాలు అందిస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య శాల సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శాల నిర్వాహకులు మాట్లాడుతూ వైద్య శాల లో జనరల్ వ్యాధుల, యాక్సిడెంట్ కేసులు, చిన్న పిల్లల, గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, మహిళల కు ప్రసూతి, దీర్ఘ కాలిక వ్యాధులు బీపీ షుగర్, తో పాటు చర్మ వ్యాధుల చికిత్స, అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ల్యాబ్ సదుపాయాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద ట్రస్ట్ హాస్పటల్ యజమానం కాసాని దశరథ యశోద గ్రామ శాఖ అధ్యక్షులు సోందుమియా కొదారు బాబు కడియాల వెంకటేశ్వర్లు వట్టి కోటి నాగయ్య గరినే శేషగిరిరావు వట్టికూటి వెంకటేశ్వర్లు అశోక్ ఉపేందర్ సురేష్ రావిలాల ఉత్తేజ్ మంగయ్య శ్రీనివాసరావు నాగేశ్వర రావు బండి కాశయ్య బంధు మిత్రులు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు

# పోషకాహారంతోనే మహా ఆరోగ్యం

**చింతపల్లి, నవంబర్ 1 (నినాదం):** పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని కుర్మేడు నవోదయ మోడల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు.ఆయన మాట్లాడుతూ పోష కాహారం పై అవగాహన పెంచుకొని వంటలు చేయాలని సూచించారు. ఫుడ్ ఫెస్టివల్ లో భాగంగా ఆకుకూరలు, కూరగాయలతో విద్యా ర్థులు తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శ నను పరిశీలించి



సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అనంతుల జంగయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంభం శ్రీశైలం గౌడ్, నాదిరి శ్రీశై లం,గండేటి వెంకటయ్య పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



**మహాముత్తారం, నవంబర్ 01 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంతో పాటు బోర్లగూడెంలో గిరిజన సహకార సంస్థ ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రజాసంఘ నాయకులు డివిజనల్ మేనేజర్ వాణి కి వినతిపత్రాన్ని సమర్పించారు. బోర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గాజరాంపల్లి రైతులకు రవాణా సౌకర్యం ఇబ్బందికరంగా మారడంతో గ్రామంలోని బొడ్రాయి నుండి చెరువు వరకు సిసి రోడ్లు నిధుల కేటాయింపుకై ఐటిడిఏ పిఒకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అజ్మీరా పూల్ సింగ్ నాయక్, పీక కిరణ్, ఠాకూర్ రవీందర్ సింగ్, కోట రాజు పాల్గొన్నారు.

# జీవన ప్రమాణాలను మెరుగైన ఆహారపు అలవాట్ల ద్వారా పెంచుకోవాలి



**మిర్యాలగూడ నవంబర్ 1 (నినాదం):** మనం గడిపే యాంత్రిక జీవనంలో శారీరక శ్రమతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం ద్వారా జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చని జనయేత్రి పౌండేషన్ నల్గొండ జిల్లా జనయేత్రీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు అధ్యక్షులు అను మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు ఎం .డి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బాలాజీ అన్నారు శనివారం మిర్యలగూడ పట్టణంలో ని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సహకారం తో జనయేత్రి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడాతు. ప్రతి నెల క్రమం తప్పకుండా మొదటి తారీఖున మిర్యాలగూడ లోని ప్రముఖ వైద్యులచే మధుమేహం థైరాయిడ్ రక్తపోటు మొదలగు ఉచిత పరీక్షలతోపాటు , ఉచిత మందులు అందజేస్తూ విలువైన వైద్య సలహాలను అందిస్తున్నామని దీనిని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ తులసిరాం మాట్లాడుతూ ప్రతినిత్యం శారీ రక శ్రమతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పు నట్లయితే జీ వన ప్రమాణాన్ని పెంచుకోవడానికి వీలువడుతుందని అన్నా రు. సీనియర్ వైద్యులు డాక్టర్ జాడి రాజు మాట్లాడుతూ ప్రతి నిత్యం ఒక గంట సేపు వ్యాయామం చేయాలని, ఏ ఆహాం మై నా మితంగా తీసుకోవాలి అని అన్నారు. ప్రముఖ డాక్టర్లు . మోయిద్ . నాగు నాయక్, వికాస్ రఫీ గారు,ఝాన్సీ లక్ష్మీబా యి, భవాని రెడ్డి,ల్యాబ్ టెక్నీషియన్లుయాదగిరి, కృష్ణ అంజి, రఫీ షాహీర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గూడపూరి లక్ష్మణ్ సభ్యులు మాజీ కౌన్సిలర్ రవి, నరేందర్ గౌడ్, చిన్న వెంకన్న పరిగి సైదులు మల్లయ్య పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నల్లబెల్లి నవంబర్ 1(నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరం గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ డ్యాగల వ ల్లి కా ం బ - ర వే ం ష్ దంపతుల ప్రథమ పుత్రుడు కృష్ణ (రాజేష్) వివాహం, ఊటుకూరి భాగ్యలక్ష్మి - చక్రపాణి గౌడ్ దంపతుల కుమార్తె కీర్తన తో శనివారం కోటగండి లోని పిడిఆర్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు నర్సం పేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూ వరులను ఆశీర్వదించారు. నూతన దంప తులకు ఆయుష్మంతు భవ అని ఆశీర్వచ నాలు అందించి, సుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంలో ఎమ్మెల్యే మాట్లా డుతూ, వివాహం మన సంస్కృతిలో ఒక పవిత్ర బంధం. కుటుంబాలు కలిసే ఈ సుందర సందర్భం ఆనందకరంగా సాగా లని, కొత్త జీవితానికి శుభారంభం కావా లని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, చిట్యాల తిరుపతి రెడ్డి, ఇస్తారి శేఖర్ గౌడ్, నాగపూరి కృష్ణ మూర్తి గౌడ్, వైనాల అశోక్, బత్తిని మహే ష్, పాలాయి రవీందర్, జిల్లా మునిందర్, చుక్క రమేష్, నీల శ్రీధర్, కత్తి కిరణ్ గౌడ్, రాజు, మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేదికను పూలతో, లైటింగ్ తో అందంగా అలం కరించారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, అభిమానులు హాజరై ఆశీర్వదించారు.

# బిల్డింగ్ నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

**- బిల్డింగ్ కార్మికరంగం మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య**

**డోర్నకల్/మరిపెడ నవంబర్ 01(నినాదం న్యూస్):** 50 సంవత్సరాలు దాటిన బిల్డింగ్ నిర్మాణరంగ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని సిఐటియు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య అన్నారు. శనివారం ఒకటవ తారీఖున బిల్డింగ్ కార్మికుల గ్రామీణ సమస్యల సర్వే సందర్భంగా మరిపెడ బంగ్లా గెస్ట్ హౌస్ ఆవరణములో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిల్డింగ్ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య మాట్లాడుతూ మేము ఈరోజు పలు గ్రామాలలో కార్మిక సమస్యల సర్వే చెయ్యగా మా దృష్టికి వచ్చిన సమస్యలు ముఖ్యంగా 50 సంవత్సరాల దాటిన బిల్డింగ్ రంగ కార్మికులకు పెన్షన్ లేదు అని తేలింది కనుక 50 సంవత్స రాలు దాటిన ప్రతి బిల్డింగ్ కార్మికునికి పెన్షన్ అందజేయా లని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బిల్డింగ్ కార్మికులకు మెడికల్ టెస్ట్ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం ఆరోగ్య సమస్యలకు వైద్య ఖర్చులకు డబ్బులు ఇవ్వకుండా వైద్య పరీక్షలకు మాత్రమే కాంట్రాక్టులకు డబ్బులు ఇచ్చి పబ్బం గడుపుతుందని వారు అన్నారు



అంతేగాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా బిల్డింగ్ రంగ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి కట్టించాలని లేదా ప్రతి కార్మికుడికి ఇంటి నిర్మాణం కోసం 15 లక్షల ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అట్లాగే టెక్నాలజీ పెరిగిన కొద్దీ కార్మికులకు పని తగ్గే అవకాశం ఉంది. కాబట్టి వచ్చిన టెక్నాలజీని ప్రభుత్వం తరపున కార్మికులకు శిక్షణ ఇచ్చి దాని సంబంధించిన పరికరాలను పూర్తి సబ్సిడీతో బిల్డింగ్ కార్మికులకు అందజేయాలని వారు అన్నారు.. సంక్షేమ బోర్డు వస్తున్నటువంటి ప్రతి సదుపాయాన్ని లేబర్ ఆఫీస్ నుండి నిర్మాణరంగ కార్మికుల అందజేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర వెంకన్న,వాసు, పున్నయ్య,భద్రయ్య,విష్ణు,ఎల్లయ్య, ఉపేందర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రతి పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలే

**- జిల్లా సంక్షేమ అధికారి జి.మల్లేశ్వరి.**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నవంబర్ 1 నుండి డిసెంబరు ఒకటి వరకు నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలను జరపాలని డిడబ్ల్యూ ఓ మల్లేశ్వరి తెలిపారు. ఆయా పాఠశాలల్లోని బాల బాలికలకు బాల్యవివాహాలు, బాల కార్మికులు, బేటి బచావో బేటి పడావో, వంటి కార్యక్రమాలపై నెల రోజులు జిల్లాలోని ప్రతి గ్రామం, మండలంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, జిల్లా సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న డిసిపియు, సఖి, మహిళా సాధికారికత కేంద్రం విభాగాలు కలిసి నిర్వహించాలని ఆమె తెలిపారు. బాల్య వివాహారహిత జిల్లాగా రూపుదిద్దడమే ధ్యేయంగా అన్ని విభాగాలు కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనూష, గాయత్రి , కళావతి, మమత, తిరుపతి, సోషల్ కుమార్, ప్రవీను, రామ్ చరణ్, సాయిరాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి వైద్య విద్యకు ఆర్థికసాయం



**మల్హర్ నవంబర్ 01, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన షేక్ యాకుబ్ పాషా కుమార్తె షేక్ అస్మా తపస్సు 2025 విద్యా సంవత్సరం నిట్ కౌన్సిలింగ్ లో జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. విద్యార్థి చదువుల ఖర్చు అవసరాల నిమిత్తం ఆన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సైనికుడు బానోత్ రాజ్ కుమార్ ఢిల్లీ రాజు తమ వంతు సాయంగా 5 వేల రూపాయలు ఆర్థికసాయం అందించి విద్యార్థిని అభినందించి తల్లీదండ్రులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మండల యాదవ్ సంఘం అధ్యక్షులు కాసాని శ్రీశైలం, కాసర్ల రాజయ్య, తోట్ల సమ్మయ్య, లావుడ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలి



**చింతపల్లి , నవంబర్ 1 (నినాదం)** పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచడానికి ప్రైవేట్ యాజమాన్యం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని (మాల్) వేంకటేశ్వర నగర్ లో పోలేపల్లి వినోద్ కుమార్ కు చెందిన లైఫ్ స్టార్ హాస్పిటల్ ను శనివారం ఆయన పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి , కేతావత్ భిల్యా నాయక్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలందరికి అన్ని రకాల వైద్య సేవలు అదునాతున పద్ధతిలో తక్కువ ఖర్చుతో అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పూల యాదయ్య ముదిరాజ్, పీపుల్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ , డాక్టర్ శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది

**కలెక్టర్ అభిలాష అభినవ్**






**నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 1.(నినాదం):** ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం ఖానాపూర్ మండలం లోని మస్కాపూర్ గ్రామంలో గల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఆస్ట్రో నామీ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్ర మం లో స్థానిక శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేతో కలిసి ఆస్ట్రోనామీ ల్యాబ్‌ను, రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ల్యాబ్‌లో గల వస్తువులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే విద్యార్థులందరికీ మంచి విద్య అందుతుందని అన్నారు. మస్కాపూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల పరీక్ష ఫలితాలతో పాటు, అన్ని రంగాలలో ముందు నిలవడం సం తోషకరమైన విషయమని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందిం చేలా జిల్లాలో పలు పాఠశాలల్లో ఆస్ట్రానమీ ల్యాబ్ లను ప్రారంభించా మని అన్నారు. ఈ ల్యాబ్ ల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల పరిజ్ఞానం పెరుగుతుందని అన్నారు. విద్యార్థు లు ఈ అవకాశాన్ని చక్కగా వినియో గించుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను గమనించి, వారి పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మరింత మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థు లను ఆ దిశగా సన్నద్ధం చేయాలని వివరించారు. పాఠశాలలో ఆస్ట్రో నామీ ల్యాబ్ ప్రారంభించడంతో పాటు, కంప్యూటర్ ల్యాబ్, అటల్ థింకర్ ల్యాబ్, ఏర్పాటు చేసుకో వడం జరుగుతుందని తెలిపారు. బాలశక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు అధిగమించేలా చర్య లు తీసుకో వడంతో పాటు, సామాజిక పరిజ్ఞా నం పెంపొందించేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

**ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్**

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. ప్రభుత్వ విద్యను బలో పేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభు త్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఇందుకుగాను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడం జరిగిందని వివరించారు. గత రెండేళ్లలో మస్కాపూర్ పాఠశాల ను ఎంతో అభివృద్ధి చేశామని, అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించి నట్లు తెలిపారు. మంచి ఫలితాలు సాధించేలా విశేష కృషి చేస్తున్న పాఠశాల విద్యార్థులకు, సిబ్బందికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజే శారు. భవిష్యత్తులో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొ ని ఉన్నత స్థానంలో నిలవాలని తెలిపారు. ఇటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐఐటి మద్రాస్ వారిచే 10 విభాగాల్లో 35 మంది విద్యార్థులు పాలుపం చుకొని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 31 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## సాంబ శివలయంలో శుక్లపక్షం ప్రబోధిని ఏకాదశి వేడుకలు

**పాల్గొన్న ఓదెల డైరెక్టర్ సామల యమున హరికృష్ణ**



**సుల్తానాబాద్, నవంబర్ 01 (నినాదం):** కార్తీక మాసంలో శుక్లపక్షం ప్రబోధినిఏకాదశి సందర్భంగా పంచశత్కాలలో భాగంగా మొదటి రోజున శని వారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వేణు గోపాల స్వామి ఆలయ ఆవరణలోని శ్రీ సాంబశివ ఆలయం లో ఘనంగా వేడుకలునిర్వహించడం జ రిగింది. స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు.అనంతరం కార్తీక జ్యోతితో నగర సంకీర్తన జరిపారు. ఈ సందర్భంగా అ ర్చకులు భక్తులు దీపదానాలు చేశారు. ఆలయ అర్చకులు పాలువెల్ల రమేష్, సాయి ప్రణవ్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీ వేణుగోపాలస్వా మి ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళీధర్, డైరె క్టర్ మస్యాల శ్రీదేవి రవీందర్, శ్రీ శివాలయం కమి టీ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ,అర్చకులు వ ఖ్లకొండ మహేష్, ఓదెల దేవస్థానం ధర్మకర్తల మం డలి డైరెక్టర్ సామల యమున హరికృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ కూకట్ల ఓదెలు, కవిత పెద్ద సంఖ్య లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ఓదెల దేవ స్థానం డైరెక్టర్ గా నియమితులై మొదటిసారిగా సాంబశివ ఆలయానికి విచ్చేసిన సామల యము న దంపతులకు శ్రీ సాంబశివ ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

## సుల్తానాబాద్ మున్సిపల్‌కు మహర్దశ

**పట్టణ అభివృద్ధికి రూ. 15 కోట్లు మంజూరు**

**సుల్తానాబాద్ ను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు**



**సుల్తానాబాద్, నవంబర్ 01(నినాదం):** సుల్తానాబాద్ మున్సిపాలిటీకి మహర్దశ వచ్చింది. మున్సిపల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభు త్వం జీవో నెం బర్ 566 ద్వారా 15 కోట్లు మంజూరు చేసిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయ రమణా రావు వెల్లడించారు. ఈ మేర కు ఆయన శనివారం మీడి యాకు ప్రకటన విడుదల చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ, గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సుల్తానాబాద్ పట్టణం పై సవతి తల్లి ప్రేమ చూపించారని అన్నారు. అభివృద్ధిలో పట్టణం ఎంతో వెనుకబ డిపోయిందన్నారు. [illegible] సాబాద్ ప్రజల్లో ఒకరిగా ఇక్కడ పెరిగి [illegible] చెప్పారు.అందుకే పట్టణం రుణం తీర్చుకునేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. రూ. 15 కోట్లను పట్టణంలో ఇంటర్నల్ రోడ్లు, జెంక్షన్ లు,డ్రైనేజీ లు, కల్వర్టులు, వీలీన గ్రామాల అభివృద్ధికి వెచ్చిం చనున్నట్టు చెప్పారు. కోరగానే నిధులు విడుదల చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే కృ తజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలు త నకు అండగా నిలవాలని, మరిన్ని నిధులను సమీ కరించి అభివృద్ధి పనులు చేపడతానని ఎమ్మెల్యే అన్నారు.

## ఎమ్మార్పీఎస్ ధర్నాకు వెళ్లిన మండల నాయకులు



**ధర్మారం నవంబర్ 1 (నినాదం):** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.బి. గవాయి పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఈరోజు మండ ల ఎమ్మార్పీఎస్ నాయకులు హైద రాబాద్ తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొల్లి స్వామి,ఎమ్మార్పీఎస్ మండ ల కన్వీనర్ ఇరుగురాల.మహేష్, కో కన్వీనర్ నెరూవట్ల అభిలాష్,ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి మద్దునాల మల్లేశం, ఏఎంసి డైరెక్టర్ కాంపల్లి రాజేశం,చొప్పదండి మల్లేశం,కాంపల్లి పోశయ్య,తాళ్లపల్లి మల్లేశం, చొప్పదండి సతీష్,నేరువట్ల మల్లయ్య,రాజయ్య, ఎదుల్ల.ప్రభాకర్ తదితరులు వెళ్లారు.

## మంత్రి సహకారంతోనే గ్రామాలన్ని అభివృద్ధి

**పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ**

**సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



**మంథని నవంబర్ 1( నినాదం):** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారం తోనే గ్రామలన్ని అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు శనివారం ఖానాపూర్ గ్రామ పంచాయతి కార్యాలయ భవన నిర్మాణానికి సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతి భవన నిర్మానానికి రూ. 20లక్షలు మంజూరయ్యాయని అయన తెలిపారు. అంతేగాకుండా ఎల్ మడుగును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంలో భాగంగా ఖానాపూర్ పిడబ్ల్యు రోడ్ నుంచి రుద్ర పాదాల వరకు రూ. 7కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. భూమి పూజ కార్యక్రమాని కి వచ్చిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ను మాజీ ఎంపిపి నారమల్ల లక్ష్మి రాజం, తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే నారమల్ల లక్ష్మి రాజం ను నాయకులు,గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచులు సేమంతుల ఓదెలు, దొరగోర్ల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు తోట సుధాకర్, నాయకులు బాస అశోక్, మంథని సమ్మయ్య, పెగడ రాజు, మాదర వెంకటేష్, రంగు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## కులదైవం భీమన్న గుట్టను కబ్జా కోరుల నుంచి కాపాడుకుందాం



**నిర్మల్ ప్రతినిధి , నవంబర్ 1.(నినాదం) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో గల సేవ్ భీమన్న గుట్ట కాపాడే క్రమంలో ఈరోజు ముదిరాజ్ సోదరు లందరూ పత్రిక ప్రకటన చేయడం జరిగింది. మా యొక్క 63 ఎకరాల 11 గుంటల కుల దైవం భీమన్న గుట్టను ముదిరాజులకే కేటా యించాలని ఈరోజు ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది.అక్కడ ఎలాంటి నిర్మాణాల ను చేపట్టకుండా తక్షణమే బేషరతుగా ఆపేయాలని లేని పక్షాన ముదిరాజుల పక్షాన తీవ్ర మైన ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తెలియజేయడం జరిగింది. ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ ముక్త కంఠంతో ఖండించింది. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు యాటకారి సాయన్న ముదిరాజ్,బోన్ల గంగాధర్ ముదిరాజ్,పాతర్ల గణేష్ ముదిరాజ్,, సుంకరి సాయి ముదిరాజ్, సుంకరి రాజేష్ ముదిరాజ్, ఏపూరి ప్రమోద్ ముదిరాజ్, దొంతుల చంద్రశేఖర్ ముదిరాజ్, పోలీస్ భీమేష్ ముదిరాజ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు జై ముదిరాజ్ జై జై ముదిరాజ్ ముదిరాజుల ఐక్యత వర్ధిల్లాలి.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



**నిర్మల్ ప్రతినిధి,(ఖానాపూర్)నవంబర్ 1.(నినాదం):** ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ తో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అన్నారు. రైతులు తమ పంటను ప్రభుత్వానికే అమ్మాలని సూచించారు. నిర్ణిత సమయానికి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రైతులకు వరి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు కలుగకూడదని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే, చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వరి ధాన్యం శుభ్రపరిచే యంత్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా పులి సదానందం



**మంథని, నవంబర్ 1 (నినాదం):** మంథని మండలం సూరయ్యపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా పులి సదానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సూరయ్యపల్లిలో ముదిరాజ్ సంఘం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని అనుకున్నారు. అధ్యక్షులుగా పులి సదానందం, ఉపాధ్యక్షులుగా సుంకరి దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లి ప్రసాద్, సహాయ కార్యదర్శిగా బొల్లి రవి కోశాధికారిగా బీర్క సదానందం, కార్యవర్గ సభ్యులుగా సుంకరి సదాశివ్, జోడు రాజు, ముఖ్య సలహాదారులుగా బీర్కా లక్ష్మన్, బీర్కా రాము, చింతకింది సత్తయ్య, బీర్క సాగర్ లను ఎన్నుకోన్నారు.

## ఎస్‌టియు మండల అధ్యక్షునిగా రాజశేఖర్




**మంథని, నవంబర్ 1 (నినాదం):** ఎస్‌టియు మంథని మండల అధ్యక్షునిగా ములకల్ల రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మంథని పట్టణంలో ఎస్ టి యు టి ఎస్ మండల కౌన్సిల్ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు ఈదులపల్లి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ టి యు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా ములకల్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మద్ది రాజు, జిల్లా కౌన్సిలర్లు గా శేషాద్రి, భోగే చంద్రశేఖర్, కిన్నెర శ్రీనివాస్, బడుగు నరేష్ లు ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఓడ్నాల సహేందర్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

# ప్రకృతి వైపరీత్యాలకు ఎవరు అడ్డు కాదు

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్**



**మంథని టౌన్ నవంబర్ 01 (నినాదం):** ప్రకృతి వైపరీత్యాలకు ఎవరు అడ్డు కాదని ప్రకృతి వైపరీత్యాలను అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా మంత్రి శ్రీధర్ బాబు పై పుట్ట మధు చేసినటువంటి అనుచిత వాక్యాలు అర్ధ రహితమని మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్ అన్నారు. మంథని వ్యవసాయ మార్కెట్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పుట్ట మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను అడ్డం పెట్టుకొని ఇష్టారా జ్యంగా మంత్రి శ్రీధర్ బాబు పైన పుట్ట మధు చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలను అర్ధ రహితమని హితవు పలికారు. ప్రకృతి వైపరీ త్యాలను ఆపడం ఎవరి తరం కాదని ముందస్తు చర్యలలో భాగంగా మార్కెట్లో రైతులకు కావలసినటువంటి ధాన్యం తడవకుండా కవర్లు అందుబాటులో ఉంచామని అన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు వరి వేస్తే ఉరి అని మీ అధినేత కేసిఆర్ బహిరంగంగానే తెలపడం జరిగింది. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఒక గింజ కోత లేకుండా వరి ధాన్యాన్ని కొను గోలు చేస్తూ రైతులకు త్వరితగతిన డబ్బులను వారి అకౌంట్లో జమ చేయడం ద్వారా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వారు అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తుంటే అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. బహుజనవాదమని మాట్లాడు తున్నా పుట్ట మధు గత పది సంవత్సరాలు మీ పాలనలో బహుజనులను పట్టించుకున్న దాఖలాలు లేవని మా ప్రభుత్వం వచ్చిన వెంటనే శ్రీధర్ బాబు ప్రతి కులానికి, ప్రతి వర్గాన్నీ ముందు ఉంచాలని వారు అన్ని కులాలకు, సంఘ భవనాలు, కమ్యూనిటీ హాళ్లకు కోట్ల రూపాయలు సాంక్షన్ చేయించడం జరిగిందని అన్నారు. యూరియా కోసం రోడ్డెక్కి ధర్నా చేసి ఏదో సాధించిన అనుకుంటున్నావు. యూరియా లేకుండా వెంకటాపూర్ లో నీ ఫామ్ హౌస్ లో పండే వరి ధాన్యాన్ని ఎలా పండించావని కుదుదల వెంకన్న నిలదీశారు. రైతులకు అకాల వర్షాల దృష్ట్యా రెండు కొత్త బాయిలర్లను తీసుకోవడం జరిగింది వాటికి త్వరలోనే ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసి వాటిని వాడుకలోకి తీసుకువస్తామని వాటి ద్వారా రైతులు త్వరితగతన వడ్లను ఆరబెట్టుకుంటారని ఆ ధాన్యాన్ని మార్కెట్ కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఏ రాష్ట్రప్రభుత్వం చేయని పనిని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో సన్నబట్లకు బోనస్ ను ప్రకటించిందని అన్నారు. రైతులకు క్వింటాల్ కు రూ 500 ల బోనస్ను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందనీ వాటి ద్వారా రైతులు ఎంతో లాభప డుతున్నారని, ఇది రైతు రాజ్యం అని రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో క్వింటాకు రెండు నుండి ఐదు కిలోల కోత విధించడం జరిగిందని మిల్లర్లు దళారులు కుమ్మక్కై రైతులను మోసం చేశారని తద్వారా రైతు చాలా నష్టపోయారన్నారు. ఇవన్నీ ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. ఇంకోసారి మంత్రి శ్రీధర్ బాబు పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఐటిఐలో
## న్యాయ విజ్ఞాన సదస్సు

**యువత చదువుకునే వయసులో పెడదారి పట్టదు**

**వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు**




**పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 01 (నినాదం):** స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత కుంచాల మాట్లాడుతూ,సోషల్ మీడియా లో అసభ్యకరమైన సందేశాలు పంపడం వల్ల ఎలాంటి శిక్షలు ఉంటాయో విద్యార్థి, విద్యార్థులకు వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండ వాహనం నడపడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. అలాగే గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే పార్సిల్ కవర్లు తీసుకెళ్లడం వల్ల ఎం.డి.పి.ఎస్ లో మనకు తెలియకుండానే ఇరుక్కొని ఇబ్బందులకు గురవుతారని విద్యార్థులకు వివరించారు. యువత చదువుకునే వయసులో బంగారు బవిష్యత్ పాడు చేసుకోవద్దని సునీత కుంచాల అన్నారు. ఇందులో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతు,ఎవైనా న్యాయ సలహాలు కావాలంటే 15100 కి కాల్ చేయాలని ప్రతి న్యాయస్థానంలో ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయసేవాదికార సంస్థ అందుబాటులో ఉంటుందని,ప్రతి ఒక్కరు దానిని సద్వినియోగం చేస్కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నుచ్చు శ్రీనివాస్,ఎం. శరత్ కుమార్, ఆర్.ఝాన్సీ,టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే




**మంథని నవంబర్ 1 (నినాదం):** హైదరాబాద్ లో ఇందిరాపార్క్ వద్ద జరిగిన షెడ్యూల్ 9 ద్వారా బీసీ రిజర్వేషన్ సాధన కోసం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 24 గంటల నిరాహార దీక్ష కు మంథని మాజీ శాసన సభ్యులు పుట్ట మధుకర్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అధికారం వచ్చే వరకు అబద్దాలు చెప్పి, అధికారం వచ్చాక మేము బీసీ రిజర్వేషన్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని కేంద్రం లో ఉన్న %దీజీూ% ప్రభుత్వం ఒప్పుకోవడం లేదని 22 నెలల నుండి అబద్దాల తో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అని ఏద్దెవా చేశారు. ఈ అబద్దాల కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ కోసం 9 వ షెడ్యూల్ లో చేరిపించక పోతే రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ కనుమరుగయ్యేది ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమం లో బీసీ నాయుకులు రచ్చపల్లి మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీతోనే రాజా మార్గం

**-15న లోక్ అథాలత్ నిర్వహణ**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత**



**పెద్దపల్లి ప్రతినిధి,నవంబర్ 01(నినాదం):** రాజీ తోనే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత అన్నారు. ఈ నెల 15న స్పెషల్ లోక్ అథాలత్ నిర్వహిస్తున్నామని,రాజీ చేసుకోవాలనుకునే వారు దీనిని సద్వినియోగం చేసుకొని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత సూచించారు. జిల్లా కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహణ పై జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కే.స్వప్న రాణి తో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత మాట్లాడుతూ,లీగల్ సర్వీస్ అథారిటీ తరపున ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్ ,సివిల్ కేసులకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు. ఇంటి గొడవలు, భూమి తగాదాలు యాక్సిడెంట్,భార్యాభర్తల వివాదాలు, చెక్ బౌన్స్ వంటి వివిధ కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేసుకోవచ్చని అన్నారు. లోక్ అథాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నవంబర్ 15న నంది మేడారం సుల్తానాబాద్,పెద్దపల్లి,మంథని, రామగుండం కోర్టులలో స్పెషల్ లోక్ అథాలత్ నిర్వహించడం జరుగుతుందని,ప్రజలు దీనిని వినియోగించుకుని చిన్నచిన్న కేసులు రాజీ చేసుకోవాలని ఆమె కోరారు. లోక్ అథాలత్ లో మాత్రమే కాకుండా కోర్టు సమయాలలో కూడా న్యాయ సేవాధికారి సంస్థ వద్దకు వచ్చి కేసు రాజీ చేసుకోవాలనుకుంటున్నాం అని తెలిపితే ఇతర పక్షాల వారిని పిలిచి చర్చించి రాజీ చేసేందుకు ప్రయత్నించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

**-ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నవంబర్ 01(నినాదం):** సిర్పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. శనివారం కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగజ్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం యుఐడిఎఫ్ పథకం కింద రూ. 18.70 కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందని, దీంతో పట్టణంలోని పలు కూడళ్లతో పాటు వార్డులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రహదారులు మరియు భవనాల శాఖకు చెందిన రోడ్లలో 55 కిలోమీటర్ల రోడ్లను హైబ్రిడ్ అన్యూటీ మోడల్ హామ్ ఫేస్- 1 కింద తీసుకున్నామని, దీంట్లో భాగంగా కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ నుండి సిర్పూర్ వరకు, సిర్పూర్ నుండి మాకిడి వరకు, కల్వాడ నుండి ఒడ్డుగూడ వరకు వయా దహెగామ్ మీదుగా డబుల్ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. అలాగే పంచాయతీరాజ్ శాఖకు చెందిన 36 కిలోమీటర్ల రోడ్లను కూడా హ్యామ్ ఫేస్1 కింద అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. రహదారులు భవనాల శాఖకు చెందిన తలోడి - సలుగుపల్లి డబుల్ బీటీ రోడ్డు కోసం రూ. 25 కోట్ల సెంట్రల్ రోడ్డు ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ విషయంలో చొరవ తీసుకున్న కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలియజేశారు. కాగజ్ నగర్ ఏరియా హాస్పిటల్ కోసం 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ. 18.50 కోట్లు మంజూరు అయ్యాయని, టెండర్లు కూడా ఖరారు చేశారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటీవల తాను ముఖ్యమంత్రి పలు ప్రతిపాదనలు పంపానని, ఆ నిధుల మంజూరు కోసం కృషి చేస్తామని తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రాచారి, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ, మాజీ కౌన్సిలర్ బాల్క శ్యామ్, కుమారస్వామి పాల్గొన్నారు.

## రైతుల నుంచి పూర్తిస్థాయి సోయా కొనుగోలు చేపడతాం

**నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 1 (నినాదం):** జిల్లాలో సోయా కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం తెలిపారు. సోయా పంటను ప్రభుత్వం నిర్ణయించిన తేమ శాతం ప్రకారం కొనుగోలు చేస్తామని, రైతులు ఆ ప్రమాణాలకు అనుగుణంగా పంటను మార్కెట్‌యార్డుకు తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నారని, ఆ టోకెన్ల ప్రకారం నిర్ణయించిన తేదీల్లోనే రైతులు తమ పంటను తీసుకురావాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా, పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని సోయా పంటను మొత్తంగా కొనుగోలు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# యుద్ధ పాతిపదికన కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేయాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ ప్రతినిధి నవంబర్ 1 (నినాదం) :** మొంథా తుఫాన్ ప్రభావంతో నల్లగొండ జిల్లాలోని పది మండలాల పరిధిలో కొంతమేరకు తడిసిన టువంటి వరి ధాన్యం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయ డం జరిగిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలోని వివిధ కొనుగోలు కేంద్రాల్లో సుమారు 4,600 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం తడిసినట్లు పేర్కొన్నారు. రైతులు స్వయంగా ఆ ధాన్యాన్ని కొంతమేరకు ఆరబెట్టినప్పటికీ, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు సుమారు 2,653 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి జిల్లాలోని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని తెలిపారు.అదేవిధంగా, ఆ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను టాబ్ ఎంట్రీల ద్వారా నమోదు చేసి, వారికి రావలసిన మొత్తం డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడిందన్నారు. రైతులు అధైర్యపడవద్దని జిల్లా యంత్రాంగం భరోసా ఇస్తోందని,రైతులు తమ పంటను సరైన విధంగా ఆరబెట్టి, తగిన తేమ శాతం వచ్చిన తరువాత కొనుగోలు కేంద్రాలకు తరలించాలనీ కోరారు.జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ నిర్వాహకులకు తగు సూచనలు ఇస్తున్నారని. తనతో పాటు అదనపు కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ చేయడంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని ఆమె వెల్లడించారు.

# ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే లక్ష్యం

**తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్**

**భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కోర్టు భవనాలకు వర్చువల్ గా శంకుస్థాపన**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** రాజ్యాంగంలోని 21 వ అధికరణం ప్రకారం ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో నిర్మించ తలపెట్టిన 10 ం 2 కోర్ట్ భవనాలకు శనివారం వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్.పి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పౌరుడి ప్రాథమిక హక్కుల పరిరక్షణే ధ్యేయం కావాలని వారు పేర్కొన్నారు. వ్యవస్థలోని అన్ని వర్గాల సహకారం, వనరుల లభ్యత న్యాయ వ్యవస్థకు ఉందని తెలిపారు . అంతకుముందు 6 ఇన్ క్లయిన్, గట్టమ్మ దగ్గర కోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హై కోర్ట్ జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్, జస్టిస్ ఎన్. రాజేశ్వర్ రావు హాజరు కాగా భూపాలపల్లిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్ రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్.పి. కిరణ్ ఖరే, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ లు హై కోర్ట్ న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. ములుగులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. వి. పి.సూర్య చంద్రకళా, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ లు హై కోర్ట్ న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. సర్వమత ప్రార్థనలు





నిర్వహించిన అనంతరం పునాది రాయి వేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాకు న్యాయస్థాన భవన సముదాయం మంజూరు కావడం ఆనందిచదగిన విషయం అన్నారు. కొత్త కోర్టు ఏర్పాటు అనేది సిబ్బందికి, న్యాయవాదులకు, కక్షిదారులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. చారిత్రక నేపథ్యం వున్నా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కోర్టు ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని జస్టిస్ తెలిపారు. జస్టిస్ ఎన్.రాజేశ్వర్ రావు మాట్లాడుతూ కోర్టు భవనాలు న్యాయ దేవాలయాలు అన్నారు. కేసుల్లోని ఇరువర్గాలకు న్యాయం జరిగే విధంగా న్యాయవ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్, సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీ. కన్నయ్య లాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. శ్రీనివాస చారి, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణుగోపాల చారి, గవర్నమెంట్ ప్లీడర్ డి . రాంసింగ్ ప్రధాన కార్యదర్శి రంగోజు బిక్షపతి, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రావణ్ రావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి శబరీష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే లక్ష్యం

**తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్**

**భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కోర్టు భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన**

**జయశంకర్‌భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** రాజ్యాంగం లోని 21 వ అధికరణం ప్రకారం ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో నిర్మించ తలపెట్టిన 10 ం 2 కోర్ట్ భవనాలకు శనివారం వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్.పి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పౌరుడి ప్రాథమిక హక్కుల పరిరక్షణే ధ్యేయం కావాలని వారు పేర్కొన్నారు. వ్యవస్థలోని అన్ని వర్గాల సహకారం, వనరుల లభ్యత న్యాయ వ్యవస్థకు ఉందని తెలిపారు . అంతకుముందు 6 ఇన్ క్లయిన్, గట్టమ్మ దగ్గర కోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హై కోర్ట్ జస్టిస్ ఈ.వి.వేణుగో పాల్, జస్టిస్ ఎన్. రాజేశ్వర్ రావు హాజరు కాగా భూపాల పల్లిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్ రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్.పి. కిరణ్ ఖరే, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ లు హై కోర్ట్ న్యాయమూ ర్తులకు స్వాగతం పలికారు. ములుగులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. వి. పి.సూర్య చంద్రకళా, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ లు హై కోర్ట్ న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పునాది రాయి వేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాకు న్యాయస్థాన భవన సముదాయం మంజూరు కావడం ఆనందిచదగిన విషయం అన్నారు. కొత్త కోర్టు ఏర్పాటు అనేది సిబ్బందికి, న్యాయవాదులకు, కక్షిదారులకు ఎంతో ఉపయోగకరం



అన్నారు. చారిత్రక నేపథ్యం వున్నా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కోర్టు ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని జస్టిస్ తెలిపారు. జస్టిస్ ఎన్.రాజేశ్వర్ రావు మాట్లాడుతూ కోర్టు భవనాలు న్యాయ దేవాలయాలు అన్నారు. కేసుల్లోని ఇరువర్గాలకు న్యాయం జరిగే విధంగా న్యాయవ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ కార్య దర్శి ఏ. నాగరాజ్, సీనియర్ సివిల్ జడ్జి న్యాయసే వాధికార సంస్థ కార్యదర్శి టీ. కన్నయ్య లాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. శ్రీనివాస చారి, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణుగోపాల చారి, గవర్నమెంట్ ప్లీడర్ డి . రాంసింగ్ ప్రధాన కార్య దర్శి రంగోజు బిక్షప తి, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధా కర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రావణ్ రావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి శబరీష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


# జాగృతి వందశాతం రాజకీయ వేదికే

**జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపోటములపైనే వారి శ్రద్ధ**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**కరీంనగర్, నవంబర్ 1(నినాదం) :** తెలంగాణ రాష్ట్రంలో పార్టీలు ప్రజలను దగా చేశాయని, ప్రజా సమస్యల పై ప్రధాన పార్టీలు పోరాడటం మానేశాయని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జాగృతి జనంబాటలో భాగంగా కరీంనగర్ జిల్లాలోరెండో రోజు శనివారం కవిత విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వీ పార్క్ హెూటల్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ రాష్ట్రం లో రాజకీయ శూన్యత నెలకొందన్నారు. జనంబాట తర్వాత జాగృతి పూర్తి కార్యాచరణ వెల్లడిస్తామని స్పష్టం చేశారు. తాను ఎవరో వదిలిన బాణాన్ని కాదని.. తాను ప్రజలు వదిలిన బాణాన్ని అంటూ స్పష్టం చేశారు. జాగృతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందని నేను ఏవరిని బాణం ని కాదని తెలంగాణ ప్రజల బాణాన్ని అని కవిత స్పష్టం చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమం పూర్తయిన తర్వాత భవిష్యత్తు కార్యచరణ ను ప్రకటిస్తామన్నారు. వెల్ఫేర్ హాస్టల్స్ లో మరణాలపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీ వర్షిత విషయంలో నిజాలు పూర్తిగా వెలుగులోకి రావాలని అన్నారు. గత ఏడాదిన్నరలో 110 మంది విద్యార్థులు మరణించారని ఆమె వెల్లడించారు. రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రజలకు అందకపోవడం బాధాకరమని తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం విద్యార్థుల చదువుకు ఆటంకమవుతోందన్నారు. ముఖ్యమంత్రి రూ. 700 కోట్లు విడుదల చేసినా ప్రతి నెలా నిధులు ఇవ్వాలనే హామీ నిలబెట్టుకోలేదన్నారు. పాఠశాలలు, కాలేజీలు మూసివేయకుండా పోరాటం చేస్తామని ఆమె తెలిపారు.

**గ్రానైట్ మాఫియాపై పోరాటం చేస్తా.**

కరీంనగర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందకపోవడాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. వెయ్యి కోట్లు కేటాయించినా కరీంనగర్ ఇంకా పాత స్థితిలోనే ఉందన్నారు. డ్రైనేజీ లేకుండా మానేరులో మలినాలు పోస్తున్నారని అన్నారు. ఇది



స్మార్ట్ సిటీనా ? అని ప్రశ్నించారు. కరీంనగర్-వేములవాడ రహదారి దుమ్ముతో నిండిపోవడాన్ని పెండింగ్ వంతెనలు, దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని గుర్తు చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్, శ్రీధర్ బాబు ప్రజల సమస్యలపై స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రానైట్ మాఫియా రాష్ట్ర సహజ వనరులను నాశనం చేస్తోందని, ప్రభుత్వం ఇచ్చిన పర్మిషన్లను దాటి తవ్వకాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులను చిన్న కారణాలకే తొలగించడం దారుణమని, 1100 మందిని తిరిగి పునరుద్ధరించాలని ఆమె కోరారు. కరీంనగర్ ఎయిర్పోర్ట్ అవసరమని గతంలో నిజామాబాద్లో 800 ఎకరాలు సేకరించి ప్రయత్నం చేశామని గుర్తు చేశారు.

**రిజర్వేషన్లు లభించకపోవడం విచారకరం**

మహిళలకు, బీసీలకు తగిన రిజర్వేషన్లు లభించకపోవడం విచారకరమని, వచ్చే మూడేళ్లలో నియోజకవర్గాల పునర్విభజనతో మహిళలకు ఎక్కువ ప్రాతినిధ్యం లభిస్తుందని కవిత ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక తెలంగాణ సాధనలో వెనుకడుగు వేయమని అన్నారు. సమసమాజం రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోరాడలేదని విమర్శించారు. రైతు చట్టాలపై రాహుల్ గాంధీ మాట్లాడినా లేబర్ చట్టాలపై మౌనం పాటించారని ఆమె వ్యాఖ్యానించారు. కార్మికులకు న్యాయం జరగాలంటే సమష్టిగా ఉద్యమం చేయాల్సిందేనన్నారు.ఈ విలేకరుల సమావేశం లో రాష్ట్ర నాయకులు ఎల్ రూప్ సింగ్, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

NINADAM CINEMA

# సల్మాన్‌తో దిల్‌రాజ్ మూవీ?




టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు మరోసారి భారీ స్థాయిలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌తో పాటు దిల్ రాజు డ్రీమ్స్ అనే కొత్త విభాగం ద్వారా యంగ్ టాలెంట్‌కి అవకాశాలు కల్పిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల 'గేమ్ ఛేంజర్' ,'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి ప్యాన్-ఇండియా స్థాయిలో ప్రాజెక్టులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో పలు బడా హీరోలతో సినిమాలు తెరకెక్కించే ప్రణాళికలో ఉన్న ఆయన, ఈసారి బాలీవుడ్ వైపు దృష్టి సారించారు. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌తో భారీ చిత్రాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు టాలీవుడ్ టాప్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్నారని వినికిడి. వీరిద్దరి కాంబినేషన్‌లో క్లాస్ టచ్‌తో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని టాక్. ఇప్పటికే సల్మాన్ ఖాన్ స్క్రిప్ట్‌ను విని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక, టెక్నీషియన్ల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక సల్మాన్ రెమ్యునరేషన్ విషయానికి వస్తే.. ఈసారి లాభాల్లో వాటా తీసుకోవ డానికి అంగీకరించారని వార్తలు వస్తున్నాయి. దిల్ రాజు ఈ ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మించాలనుకుంటున్నారని, సినిమాని ప్యాన్-ఇండియా లెవెల్‌లో విడుదల చేయాలనే లక్ష్యంతో ఉన్నారని టాక్. గతంలో 'హిట్', 'జెర్సీ' వంటి సక్సెస్‌ఫుల్ రీమేక్‌లతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న దిల్ రాజు, ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి మళ్లీ బాలీవుడ్ మార్కెట్‌లో తన ముద్ర వేయడానికి రెడీ అవుతున్నారు.

# పెద్ది మూవీలో జాన్వీ లుక్స్ అదుర్స్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం శ్రీలంకలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ఇదిలా వుంటే తాజాగా ఈ సినిమా నుంచి కథానా యికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ అచ్చియమ్మాఅనే పాత్రలో కనిపించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో జాన్వీ క్రికెట్ కామెంటేటర్‌గా కని పించనుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా వచ్చే మార్చి 27న విడుదల కానుంది. ' ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కి స్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీక రణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తొలి పాట వినిపించేందుకు చిత్ర బృందం సిద్ధమ వుతోంది. ఈ నెల 8న రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న ఏఆర్ రెహమాన్ లైవ్ కాన్సర్ట్‌లోనే ఈ చిత్ర తొలి గీతాన్ని వినిపిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దర్శకుడు బుచ్చిబాబు సామాజిక మాధ్యమాల వేదికగా సంకేతాలు అందించారు. ఆటలతో ముడిపడి ఉన్న బలమైన భావోద్వేగాలు నిండిన కథతో ఈ సినిమా ముస్తాబవుతోంది. దీనికి రెహమాన్ సంగీత మందిస్తుండగా.. రత్నవేలు ఛాయాగ్రాహ కుడిగా వ్యవహరిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# విడుదలకు రెడీగా ఆంధ్ర కింగ్ తాలూకా




ఈ నెలాఖరున 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన.. భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ సినిమాని పి. మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలోని చిన్ని గుండెలో అంటూ సాగే మెలోడీ గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాటకు వివేక్ - మెర్విన్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. మెర్విన్ సోలమన్, సత్య యామిని ఆలపించారు. ఈ పాటలో రామ్ - భాగ్యశ్రీల కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. వినూత్నమైన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. దీన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దానికి ఒకరోజు ముందుగానే ఈ నెల 27న తెరపైకి తీసుకొచ్చేందుకు నిర్మాతలు నిర్ణయించి నట్లు సమాచారం. త్వరలో దీనిపై స్పష్టత రానుంది.

# ఆదిసాయికుమార్ శంబాల ట్రైలర్ విడుదల




ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'శంబాల'. మిస్టికల్ థ్రిల్లర్‌గా.. యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. అర్చన అయ్యర్, శ్వాసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ ముఖ్యపాత్రల్ని పోషించారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. పరమశివుడికి, అసురుడికి మధ్య జరిగిన యుద్ధమే ఈ కథకు మూలం అంటూ సాయికుమార్ వాయిస్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఇది సైన్స్ ఊహకు అందనిది అనే డైలాగులు ఆసక్తి కలిగిస్తున్నాయి.


# రోషన్ నటించిన ఛాంపియన్ టీజర్ విడుదల




నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రం 'ఛాంపియన్' స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. స్పోర్ట్స్ నేపథ్యంలో సాగనున్న ఈ సినిమాలో రోషన్ ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపిస్తున్నారు. పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్' టీజర్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రోషన్, అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ మంచి హైప్ క్రియేట్ చేయగా, తాజాగా రిలీజైన టీజర్ సినిమా స్థాయిని పెంచింది. 'ఛాంపియన్' కథ స్వాతంత్ర్యానికి ముందు హైదరాబాద్‌లో నివసించే ఆర్మీ మాన్, ఫుట్‌బాలర్ అయిన మైఖేల్ సి. విలియమ్స్ చుట్టూ తిరుగుతుంది. మైదానంలో ప్రత్యర్థుల ను సవాలు చేస్తూ తన ప్రతిభను ప్రదర్శించే ఈ యంగ్‌మ్యాన్‌కి ఇంగ్లండ్‌లో రాణి ఎలిజబెత్‌ను కలుసుకునే అవకాశం దక్కుతుంది. దేశం కోసం ఆడే అవకాశమొచ్చినా, అతని మనసు మాత్రం తన ప్రేయసి వద్దే ఉంటుంది. కానీ జీవితం అతనికి సవాళ్లు, భావోద్వేగాలు, యుద్ధం, ప్రేమ అన్నీ ఒకేసారి ఎదురుచూపిస్తుంది. ఫుట్‌బాలర్‌గా రోషన్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించాడు. హైదరాబాదీ యాసలో హిందీ మిక్స్ చేసిన అతని డైలాగ్ డెలివరీ చాలా న్యాచురల్‌గా, క్యారెక్టర్‌కి తగినట్టుగా ఉంది. యాక్షన్ సన్నివేశాల్లో ఎనర్జీ, రొమాంటిక్ సీన్స్‌లో ఫినెస్, ఆత్మవిశ్వాసంతో కూడిన అటిట్యూడ్‌తో రోషన్ ఆకట్టుకున్నాడు. అనస్వర రాజన్ అందంగా కనిపించింది. వీరిద్దరి కెమిస్ట్రీ మనసుకు హత్తుకునేలా ఉంది. దర్శకుడు ప్రదీప్ అద్వైతం స్పోర్ట్స్, డ్రామా, యాక్షన్, రొమాన్స్, వార్ ? ఈ అన్ని ఎలిమెంట్స్‌ను అద్భుతమైన నారేషన్‌తో ఆకట్టుకున్నారు. సినిమాటోగ్రాఫర్ ఆర్. మధీ వండర్‌ఫుల్ విజువల్స్‌ను క్యాప్చర్ చేయగా, మిక్కీ జె. మేయర్ మ్యూజిక్ టెన్షన్, ఎమోషన్ రెండింటినీ అద్భుతంగా బ్లెండ్ చేశారు. 'ఛాంపియన్' టీజర్ హిస్టరీ, స్పోర్ట్స్ డ్రామా, లవ్ స్టోరీ, అద్భుతమైన కంటెంట్‌తో సినిమాపై అంచనాలను పెంచింది. ఈ చిత్రం డిసెంబర్ 25న క్రిస్మస్‌కు విడుదల కానుంది.

# కథ పాతదే అయినా.. జాతర కొత్తది

**అభిమానులకు రవితేజ మాస్ జాతర**




ఖాకీ కథలు రవితేజకు బాగా అచ్చొచ్చిన జానర్. 'క్రాక్', 'పవర్', 'విక్రమార్కుడు'.. ఇలా ఆయన కెరీర్‌లో పోలీస్ కథలతో కొట్టిన హిట్లు అనేకం. ఇప్పుడాయన 'మాస్ జాతర' కోసం రైల్వే పోలీస్‌గా మారారు. లక్ష్మణ్ భేరి (రవితేజ) నిజాయితీ గల రైల్వే పోలీస్. తన కళ్ల ఎదురుగా అన్యాయం జరిగితే.. అది తన పరిధిలోనిది కాకున్నా దాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుని మరీ న్యాయం చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వరంగల్‌లో పని చేసే సమయంలో ఓ మంత్రి కొడుక్కి తనదైన శైలిలో బుద్ధి చెప్తాడు. ఆ తర్వాత తను అల్లూరి జిల్లాలోని అడవివరం రైల్వే స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అవుతాడు. కొండల మధ్య ఉండే గిరిజన ప్రాంతాన్ని శివుడు (నవీన్ చంద్ర) శాసిస్తుంటాడు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులతో శీలావతి రకం గంజాయిని పండించి.. దాన్ని కోల్‌కతాకు స్మగ్లింగ్ చేస్తుంటాడు. లక్ష్మణ్ ఆ ఊర్లోకి అడుగు పెట్టడంతోనే శివుడికి ఎదురు వెళ్లడం మొదలు పెడతాడు. జిల్లా ఎస్పీ నుంచి మొదలు.. మొత్తం రాజకీయ వ్యవస్థ అండగా ఉన్న శివుడ్ని ఓ మామూలు రైల్వే ఎస్సై ఎలా అడ్డుకున్నాడు? అతని గంజాయి సామ్రాజ్యాన్ని ఎలా కూలదోశాడు?ఈ కథలో తులసి (శ్రీలీల), హనుమాన్ భేరి (రాజేంద్ర ప్రసాద్)ల పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది మిగిలిన కథ. కొత్త దర్శకులు అగ్రతారలతో జట్టు కట్టారంటే చాలు సినీప్రియుల్లో, అభిమానుల్లో ఓ నూతనోత్సాహం కనిపిస్తుం టుంది. తమ అభిమాన కథానాయకుడ్ని ఎంత కొత్తగా తెరపై చూపిస్తారు..? అతనితో ఎలాంటి వినూత్నమైన కథ చెప్పిస్తారనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంటుంది. ఈ అంచనాల్ని దృష్టిలో పెట్టుకునే దర్శకుడు భాను భోగవరపు దీంట్లో రవితేజ పాత్రను వింటేజ్ ఎనర్జీతో పవర్‌ఫుల్‌గా తెరపై ఆవిష్కరించారు. రవితేజ నుంచి కోరుకునే ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ యాక్షన్ అంశాల్ని మేళవిస్తూనే ఆయన ఒకప్పటి బెంచ్ మార్క్ హిట్స్‌ను గుర్తు చేసుకునేలా కొన్ని హైమూమెంట్స్‌ను అందించే ప్రయత్నం చేశారు. అయితే కథలో కొత్తదనం కనిపించలేదు. రవితేజ ఇప్పటికే ఇలాంటి రొటీన్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చాలా చేసేశాడు కదా అని ప్రేక్షకుడికి అనిపిస్తుంది. రవితేజలోని హైఎనర్జీని రుచి చూపిస్తూ మంచి యాక్షన్ సీక్వెన్స్‌తో ఆయన పాత్రను తెరకు పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంటుంది. ఆ వెంటనే తన కుటుంబ నేపథ్యాన్ని..

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787